RNI No.TELTEL/2005/16755

# ప్రజాబలం

PRAJABALAM Telugu Daily తెలుగు దినపత్రిక

Website: prajabalam.in

Cell: 9292104449 / 9848384973
SRAVANTHI Enterprises
OFFSET PRINTERS

We undertake Printing of Daily News Papers

హైదరాబాద్ 23 ఆగస్ట్ 2025 శనివారం | పేజీలు:12 | వెల రూ.2.00 | సంపుటి:21 | సంచిక:71

## మహిళా పోలీస్ సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉంది

**మహిళా పోలీస్ సిఫారసుల అమలుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉంది**

**శాంతి భద్రతల సంరక్షణలో రాష్ట్రం నెంబర్ వన్.. పోలీస్ సిబ్బంది జీవితాలు పణంగా పెట్టి సేవలందిస్తున్నారు**

**శాంతిభద్రతలతోనే పెట్టుబడులు సాధ్యం**

**విద్యా విధానంలో కొత్త ఒరవడి**

**డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క**



మహిళా పోలీస్ సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉంది, మూడు రోజుల సదస్సు ద్వారా మహిళా సిబ్బంది సంక్షేమానికి చేసే సిఫారసులను అమలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉంటుందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు భరోసా ఇచ్చారు.

నియామక సమయంలో లేని లింగ వివక్ష విధుల్లో చూపడం సరైనది కాదని, మహిళ పోలీసులో మహిళా అనే పదాన్ని తొలగించాలన్న సిఫారసు మంచి ఆలోచనని , రాష్ట్ర ప్రభుత్వం పక్షాన ఈ సిఫారసు తో తాను ఏకీభవిస్తున్నానని డిప్యూటీ సీఎం తెలిపారు. నియామక సమయంలో లింగ వివక్ష లేకుండా ఎంపిక చేస్తున్న నేపథ్యంలో విధుల్లో కూడా సమానంగా చూడాలన్న ప్రతిపాదన సరైందేనని డిప్యూటీ సీఎం అభిప్రాయపడ్డారు. మహిళా సిబ్బంది వ్యక్తిగత అవసరాలు, యూనిఫామ్ అవసరాలు అన్ని అమలు చేయదగినవే అవేమి గొంతెమ్మ కోరికలు కాదని అన్నారు. మహిళా పోలీస్ సిబ్బంది సమస్యలపై త్వరితగతిన కమిటీ వేసి సైంటిఫిక్ గా రాష్ట్ర ప్రభుత్వానికి అందిస్తే అమలు చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని డిప్యూటీ సీఎం తెలిపారు.

ప్రజల అవసరాలను తీర్చడమే మా ప్రభుత్వ లక్ష్యం, ప్రభుత్వ లక్ష్యాలను నెరవేర్చే సిబ్బంది అవసరాల గురించి ఆలోచన చేయాల్సిన అవసరం ప్రభుత్వాలకు ఉంటుందని తెలిపారు.



రాష్ట్ర సిబ్బంది అవసరాలు తీర్చి ప్రజల జీవనస్థితిగతులను ఏరకంగా మార్చగలం అన్న భావనతో మానవీయ కోణంలో పరిపాలించే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, యావత్ క్యాబినెట్ తెలంగాణ రాష్ట్రంలో ఉందన్నారు.

ఏ రాష్ట్రమైనా అభివృద్ధి చెందాలి అంటే, పెట్టుబడులు రావాలి అంటే శాంతి భద్రతలు బాగుండాలి, అప్పుడే పెట్టుబడులు వస్తాయని తెలిపారు. అంకిత భావంతో పనిచేసే పోలీసు సిబ్బంది ఉన్నప్పుడే అది సాకారం అవుతుంది అన్నారు.

ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రాష్ట్రంలో అనేక కార్యక్రమాలు, ఉత్సవాలు జరిగాయి పోలీసులు జీవితాలను పనంగా పెట్టి చిన్న దుర్ఘటన జరగకుండా జాగ్రత్తలు తీసుకున్నారని తెలిపారు. శాంతి భద్రతల పరిరక్షణలో తెలంగాణ రాష్ట్రం నెంబర్ వన్ గా ఉందన్నారు. పోలీసు సిబ్బంది శ్రమ రాష్ట్ర అభివృద్ధికి మూలం అన్నారు. పోలీసు సిబ్బంది వ్యక్తిగత సమస్యలతో పాటు శాఖపరమైన అవసరాలు కార్యాలయాల భవనాలు, పోలీస్ స్టేషన్ లు, సిబ్బంది క్వార్టర్స్ వంటి సమస్యలకు సంబంధించి ప్రతిపాదనలు తీసుకురావాలని పోలీసు అధికారులకు డిప్యూటీ సీఎం సూచించారు.

రాష్ట్రంలో విద్యా విధానంలో కొత్త ఒరవడిని ప్రజా ప్రభుత్వం సృష్టిస్తుందని తెలిపారు. 25 ఎకరాల విస్తీర్ణంలో, 200 కోట్ల రూపాయల పెట్టుబడితో ఒక్కో స్కూల్ ను ఇంటర్నేషనల్ స్టాండర్డ్స్ తో నిర్మిస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో ఒకేసారి 104 పాఠశాలలు నిర్మిస్తున్నాం అన్నారు.

పోలీస్ సిబ్బంది పిల్లలు చదువుకునేందుకు ఒక యంగ్ ఇండియా ఇప్పటికే ప్రారంభించామని అది బాగా అభివృద్ధి చెందాలని కోరుకుంటున్నాం తెలిపారు.

సామాజిక ఒత్తిడి, ఉన్నతాధికారుల ఒత్తిడి,రాజకీయ ఒత్తిళ్ళ నేపథ్యంలో పోలీస్ సిబ్బంది వారి పిల్లల చదువులపై దృష్టి పెట్టే పరిస్థితి ఉండదు, ఈ విషయంలో తల్లిదండ్రులుగా వారు ఆందోళనలో ఉంటారని గమనించి మంచి విద్యను అందించాలని, పోలీసు పిల్లల భవిష్యత్తు బాధ్యతను తీసుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్లు డిప్యూటీ సీఎం తెలిపారు. ఈ రాష్ట్రం మనది దీన్ని రక్షించుకునే వాతావరణం ఏర్పాటు చేసేందుకు భవిష్యత్తులోనూ మరిన్ని వర్క్ షాప్ లు నిర్వహించాలని డిప్యూటీ సీఎం పోలీసు ఉన్నతాధికారులకు సూచించారు.

## ఆరు నెలల్లో బుదేరా మహిళా డిగ్రీ కళాశాలను తెలంగాణకే రోల్ మోడల్ గా మారుస్తా...

**సింగూరును టూరిస్ట్ హబ్ గా మారుస్తా...**

**మునిపల్లి మండలంలో రూ.70 కోట్ల అభివృద్ధి పనులకు మంత్రి శంకుస్థాపన.**

**నియోజకవర్గంలో విద్యా, వైద్య, రవాణా సౌకర్యాల మెరుగు కు ప్రత్యేక శ్రద్ధ.**

**మంత్రి దామోదర్ రాజనర్సింహా**

**కలెక్టర్ పి.ప్రావీణ్య తో కలిసి అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి.**



**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి ఆగస్టు 22(ప్రజాబలం)సంగారెడ్డి జిల్లా:సంగారెడ్డి**/ఆరు నెలలలో బుదేరా లోని సాంఘిక సంక్షేమ మహిళా డిగ్రీ కళాశాలను తెలంగాణ రాష్ట్రంలో రోల్ మోడల్ గా తీర్చిదిద్దనున్నట్లు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహా అన్నారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ పి . ప్రావిణ్య తో కలిసి అందోల్ నియోజకవర్గ పరిధిలోని మండలంలో ని వివిధ గ్రామాలలో రూ.70 కోట్ల రూపాయలతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు మంత్రి దామోదర్ రాజనర్సింహా శంకుస్థాపన చేశారు,ఈ సందర్భంగా బుదేరా సాంఘిక సంక్షేమ మహిళా డిగ్రీ కళాశాలలో విద్యార్థులను ఉద్దేశించి మంత్రి మాట్లాడుతూ బుదేరా కళాశాలలో విద్యార్థులకు అవసరమైన అన్ని రకాల సౌకర్యాలను మెరుగుపరిచి రానున్న ఆరు నెలల్లో కళాశాలను తెలంగాణ రాష్ట్రంలోని అన్ని కళాశాలలకు రోల్ మోడల్ గా మార్చేలా కృషి చేయనున్నట్లు తెలిపారు. కళాశాలలో చదివే విద్యార్థులకు భద్రత కల్పించడంతోపాటు మెరుగైన వసతులు కల్పించనున్నట్లు అధునాతన సౌకర్యాలతో కూడిన ల్యాబ్ లు, డిజిటల్ తరగతి గదులు, మెరుగైన



ఫర్నిచర్, లైబ్రరీ ఏర్పాటు చేయనున్నట్లు విద్యార్థులకు అవసరమైన అన్ని రకాల సౌకర్యాలు కళాశాలలో ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

అనంతరం మండలంలోని కళాశాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించారు. పాఠశాలలో మౌలిక వసతుల మెరుగుకు కృషి చేయునట్లు తెలిపారు,గత వారం రోజులుగా కురిసిన భారీ వర్షాలకు దెబ్బతిన్న రోడ్లను మంత్రి పపరిశీలించారు.వెంటనే భారీ వర్షాల కారణంగా దెబ్బతిన్న రోడ్ల మరమ్మతులకు నివేదిక సమర్పించాలని అధికారులను ఆదేశించారు. మునిపల్లి మండలం అల్లాపూర్ గ్రామపంచాయతీ కార్యాలయంలో సంక్షేమ పథకాలు అమలుపై సమీక్ష జరిపి గ్రామస్తులతో మాట్లాడారు.

సింగూర్ ప్రాజెక్టును టూరిస్ట్ హబ్ గా మారుస్తా: త్వరలో సింగూరు ప్రాజెక్ట్ ను టూరిస్ట్ హబ్ గా మార్చనున్నట్లు మంత్రి దామోదర్ రాజనర్సింహా తెలిపారు. మునిపల్లి మండలంలోని గార్లపల్లి హై లెవెల్ బ్రిడ్జి నిర్మాణం పనులు ప్రారంభించిన



తర్వాత జరిగిన సమావేశంలో మంత్రి మాట్లాడారు. బుదేరా నుండి సీరూరు వరకు సింగూరు బ్యాక్ వాటర్ వెంట రెండు లైన్ల రోడ్డు ఏర్పాటు కోసం రూ. 60 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. ఈ రోడ్డు నిర్మాణంలో భాగంగా గార్లపల్లిలో హై లెవెల్ వంతెన ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ రోడ్డుతో సింగూరు ప్రాజెక్టు వెనుక భాగంలోని రాయికోడ్ మునిపల్లి మండలాలలో గ్రామాలు అభివృద్ధి చెందనున్నట్లు తెలిపారు. రాష్ట్ర రాజధాని హైదరాబాదు కు 100 కిలోమీటర్ల లోపు ఉన్న పెద్ద ప్రాజెక్టు సింగూరు ప్రాజెక్టు అన్నారు. సింగూరు ప్రాజెక్టును టూరిజం హబ్ గా మార్చడానికి కృషి చేయనున్నట్లు తెలిపారు సింగూరు ప్రాజెక్టు మధ్యలో రామచంద్రాపురం శివారులో నీట మునుగకుండా ఉన్న 15 ఎకరాల విస్తీర్ణం లోని భూమిలో రిసార్ట్ హోటలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. భవిష్యత్తులో సింగూరు బ్యాక్ వాటర్ వెంట గ్రామాలలో ప్రభుత్వ ప్రైవేటు ఆధ్వర్యంలో రిసార్ట్లో ఏర్పాటు కానున్నట్లు తెలిపారు. హైదరాబాదు నుండి సింగూరు ప్రాజెక్టు చూడడానికి వచ్చే టూరిస్టులు సింగూరు ప్రాజెక్టును చూసి పడవలలో రామచంద్రపురం రిసార్ట్ కు వచ్చి మధ్యాహ్నం భోజనం చేసుకొని రాత్రి సింగూరు బ్యాక్ వాటర్ వెంట వెలిసే రిసార్ట్లలో విశ్రాంతి తీసుకునేలా టూరిస్టు హబ్ ను తీర్చిదిద్దనున్నట్లు తెలిపారు. బుదేరా సిరూరు రోడ్డు ఏర్పాటుతోపాటు సింగీతం నుండి కోడూరు వరకు రోడ్డు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు ఈ రెండు రోడ్ల నిర్మాణంతో సింగూరు బ్యాక్ వాటర్ గ్రామాలకు మెరుగైన రోడ్డు రవాణా సౌకర్యాలు కలగడంతో పాటు ఈ ప్రాంతం టూరిస్ట్ హబ్ గా మారనున్నట్లు మంత్రి దామోదర్ రాజనర్సింహా తెలిపారు.

రూ.70 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన: మునిపల్లి పర్యటన సందర్భంగా మంత్రి మండలంలో ని వివిధ గ్రామాలలో రూ. 70 కోట్ల నిధులతో పలు అభివృద్ధి పనులకు మంత్రి దామోదర రాజనర్సింహా శుక్రవారం శంకుస్థాపన చేశారు. మంత్రి శుక్రవారం శంకుస్థాపన చేసిన అభివృద్ధి పనుల వివరాలు ఇలా ఉన్నాయి,2.20 కోట్లతో సాంఘీక సంక్షేమ మహిళా డిగ్రీ కళాశాల, బుదేర లో ఆదనపు తరగతి గదులు మరియు ప్రహారీ గోడ నిర్మాణం.43 లక్షలతో కళాశాలలో మౌళిక సదుపాయాలు,98 లక్షలతో మునిపల్లి-ఖమ్మంపల్లి బి.టి. రోడ్డు నిర్మాణం,1.24 కోట్లతో మోడల్ స్కూల్, మునిపల్లిలో చేసిన పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం,34.50 లక్షలతో యస్.సి. బాయ్స్ హాస్టల్, మునిపల్లిలో పలు అభివృద్ధి పనులు,1.96 కోట్లతో మునిపల్లి చందాపూర్ బి.టి.రోడ్డు నిర్మాణం,1.26 కోట్లతో పి.డబ్ల్యుడి రోడ్డు - తక్కెడపల్లి బి.టి. రోడ్డు నిర్మాణం.

57.50 లక్షలతో కె.జి.బి.వి. తాటిపల్లి లో మౌళిక సదుపాయాలు,37 లక్షలతో నిర్మించిన వంటశాల, ఇతర మరమ్మత్తులకు ప్రారంభోత్సవం,42 కోట్లతో తాటిపల్లి-మక్తక్యాసారం డబల్ రోడ్డు నిర్మాణం,17 కోట్లతో గార్లపల్లిలో హైలెవెల్ బ్రిడ్జ నిర్మాణం తదితర అభివృద్ధి పనులకు మంత్రి దామోదర్ రాజనర్సింహ కలెక్టర్ పి ప్రావీణ్య త తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంధాల చైర్మన్ అంజయ్య, సంగారెడ్డి రెవెన్యూ డివిజనల్ అధికారి రవీందర్ రెడ్డి, పంచాయతీరాజ్ అధికారులు, ఆర్ అండ్ బి అధికారులు, ఉపాధ్యాయులు ప్రిన్సిపల్స్, వివిధ శాఖల సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు

## జైల్లో ఉన్న పీఎం, సీఎంలను తొలగించే బిల్లు.. కేజ్రీవాల్ అంశాన్ని ప్రస్తావించిన అమిత్ షా



తీవ్రమైన క్రిమినల్ ఆరోపణలతో జైలు పాలైన ప్రధాని, కేంద్ర మంత్రులు, ముఖ్యమంత్రులు లేదా రాష్ట్ర మంత్రులను పదవుల నుంచి తొలగించేందుకు ఉద్దేశించిన నూతన బిల్లుల వెనుక ఉన్న అసలు కారణాన్ని కేంద్ర హెూంమంత్రి అమిత్ షా వెల్లడించారు. ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ జైలు నుంచే ప్రభుత్వాన్ని నడిపిన ఉదంతం కారణంగానే ఈ బిల్లులను తీసుకురావాల్సి వచ్చిందని ఆయన స్పష్టం చేశారు. ఒకవేళ కేజ్రీవాల్ అరెస్ట్ అయిన వెంటనే తన పదవికి రాజీనామా చేసి ఉంటే, ఈ రోజు ఈ మార్పులు అవసరం అయ్యేవి కావని ఆయన అభిప్రాయపడ్డారు.

కేరళలో జరిగిన మనోరమ న్యూస్ కాన్క్లేవ్‌లో అమిత్ షా మాట్లాడుతూ, దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన 75 ఏళ్లలో ఎప్పుడూ ఇలాంటి పరిస్థితి ఎదురుకాలేదని గుర్తుచేశారు. “ఒక ముఖ్యమంత్రి జైల్లో ఉండి ప్రభుత్వాన్ని నడపాలని దేశ ప్రజలు కోరుకుంటున్నారా? ఇది ఎలాంటి చర్చో నాకు అర్థం కావడం లేదు. ఇది పూర్తిగా నైతికతకు సంబంధించిన ప్రశ్న” అని ఆయన వ్యాఖ్యానించారు. రాజ్యాంగాన్ని రూపొందించిన సమయంలో, జైలుకు వెళ్లిన వారు కూడా పదవుల్లో కొనసాగుతారని ఎవరూ ఊహించి ఉండరని ఆయన అభిప్రాయపడ్డారు.

తీవ్రమైన క్రిమినల్ ఆరోపణలపై వరుసగా 30 రోజుల పాటు అరెస్ట్ లేదా నిర్బంధంలో ఉన్న ప్రజాప్రతినిధులను పదవుల నుంచి తొలగించేందుకు కేంద్ర ప్రభుత్వం బుధవారం పార్లమెంటులో మూడు బిల్లులను ప్రవేశపెట్టిన విషయం తెలిసిందే. ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో అరవింద్ కేజ్రీవాల్ అరెస్ట్ అయ్యాక, రాజీనామా చేసేందుకు నిరాకరించిన విషయాన్ని అమిత్ షా ఈ సందర్భంగా ప్రస్తావించారు.

“ఒక ముఖ్యమంత్రి జైలు నుంచి పాలన సాగించిన ఘటన జరిగింది. మరి రాజ్యాంగాన్ని సవరించాలా, వద్దా? గతంలో బీజేపీ ప్రభుత్వాలు కూడా అధికారంలో ఉన్నాయి, కానీ మాకు ఎప్పుడూ ఇలాంటి పరిస్థితి ఎదురుకాలేదు” అని అమిత్ షా పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో రాజ్యాంగ నైతికతను కాపాడాల్సిన బాధ్యత అధికార, ప్రతిపక్ష పార్టీలు రెండింటిపైనా ఉంటుందని ఆయన అన్నారు.

## సాస్కి కింద అదనంగా రూ.5,000 కోట్లు కేటాయించండి

**ఢిల్లీ పర్యటనలో కేంద్ర ఆర్థికమంత్రిని కోరిన ముఖ్యమంత్రి చంద్రబాబు**

వార్త 2 లో

# ప్రజాబలం

23 ఆగస్ట్ 2025 శనివారం


## సాస్కి కింద అదనంగా రూ.5,000 కోట్లు కేటాయించండి

### ఢిల్లీ పర్యటనలో కేంద్ర ఆర్థికమంత్రిని కోరిన ముఖ్యమంత్రి చంద్రబాబు



అమరావతి, ఆగస్ట్ 22 : ఢిల్లీ వెళ్లిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శుక్రవారం కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్‌ను కలిశారు. రాష్ట్రంలో చేపట్టే పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఆర్థిక సహాయం అందించవలసిందిగా కేంద్ర ఆర్థికమంత్రిని ముఖ్యమంత్రి కోరారు. ఆంధ్రప్రదేశ్‌కు ఇప్పటివరకు ప్రత్యేక మూలధన పెట్టుబడి సహాయం (స్పెషల్ అసిస్టెన్స్ టు స్టేట్స్ ఫర్ క్యాపిటల్ ఇన్వెస్ట్‌మెంట్) పథకం కింద రూ. 2,010 కోట్లు లభించాయని తెలిపారు. రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న మూలధన ప్రాజెక్టుల కోసం అదనంగా రూ. 5,000 కోట్లు కేటాయించాలని వినతి పత్రం సమర్పించారు. అలాగే 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన సింగిల్ నోడల్ ఏజెన్సీ (ఎస్ఎన్ఏ) ప్రోత్సాహక పథకం మార్గదర్శకాల ప్రకారం రూ. 250 కోట్ల విడుదలకు రాష్ట్ర ప్రభుత్వం పంపిన ప్రతిపాదనలపై తగు ఉత్తర్వులు ఇవ్వాలని వినతి పత్రంలో పేర్కొన్నారు. తూర్పు ప్రాంత రాష్ట్రాల సమగ్రాభివృద్ధి కోసం కేంద్రం ప్రకటించిన పూర్వోదయ పథకాన్ని స్వాగతిస్తున్నామని చెప్పిన ముఖ్యమంత్రి... ఈ పథకం ద్వారా ఆంధ్రప్రదేశ్ ప్రయోజనం పొందగలదని తెలిపారు. దీని విధివిధానాలు రూపొందించి త్వరగా ఈ పథకాన్ని అమల్లో తేవాలని ముఖ్యమంత్రి కోరారు.

# అర్హులైన ఏ ఒక్కరి పెన్షన్ రద్దుకాదు

### దివ్యాంగులు ఎవరూ ఆందోళన చెందాల్సిన పనిలేదు

### గత ప్రభుత్వంలో నకిలీ దివ్యాంగ సర్టిఫికేట్లతో దందా

### పెన్షన్లపై సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు

అమరావతి, ఆగస్ట్ 21 : పెద్దఎత్తున దివ్యాంగుల పింఛన్లు తొలగిస్తున్నారంటూ ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గురువారం సచివాలయంలో అధికారులతో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పథకంపై సమీక్ష నిర్వహించారు. గత ప్రభుత్వంలో అడ్డదారిలో సదరం సర్టిఫికెట్లు తీసుకుని పెన్షన్ పొందుతున్నవారిపై ఇటీవల జరిపిన పునఃపరిశీలన వివరాలను అధికారులు ముఖ్యమంత్రి ముందుంచారు. ఈ ప్రక్రియలో అనర్హులను గుర్తించినట్లు, అన్నివిధాలా పూర్తి ఆరోగ్యవంతులుగా ఉండి... ఎలాంటి వైకల్యం లేకుండానే కొంతమంది పెన్షన్ పొందుతున్నట్లు పరిశీలనలో తేలిందని తెలిపారు. అనర్హులైన పెన్షన్ల ధృవీకరించడానికి ప్రత్యేక వైద్య బృందాలను నియమించి నిర్ధారించినట్లు వెల్లడించారు. అయితే నకిలీ పెన్షన్లను మాత్రమే తొలగించాలని, అర్హులైన ఏ ఒక్క దివ్యాంగ పింఛనుదారుకు పెన్షన్ రద్దు కాకూడదని సమీక్షలో ముఖ్యమంత్రి స్పష్టంగా అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అర్హులైన పెన్షన్లు యధావిధిగా కొనసాగుతాయని, దివ్యాంగులు ఎవరూ ఈ విషయంలో ఆందోళన చెందాల్సిన పనిలేదని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి అన్నారు. అలాగే తాత్కాలిక సర్టిఫికెట్ల ద్వారా దివ్యాంగుల పెన్షన్, హెల్త్ పెన్షన్ పొందేవారికి కూడా ఎప్పటిలా నెలనెలా పింఛన్ అందించాలని స్పష్టం చేశారు. వారికి పంపించిన నోటీసులు సైతం వెనక్కి తీసుకోవాలని సీఎం చెప్పారు.

## ఇకపై టీచర్ పోస్టుల భర్తీకి ప్రతిఏటా డిఎస్సీ నిర్వహిస్తాం!

### గత 14నెలల్లో సమర్థవంతంగా సంస్కరణలు అమలుచేశాం

### ఫలితాలు రాబట్టే బాధ్యత అధికారులు, ఉపాధ్యాయులదే!

### దాతల సహకారంతో ప్రభుత్వ పాఠశాలల్లో కీలక మౌలిక సదుపాయాలు

### అమరావతిలో ఏడాదిలోగా సెంట్రల్ లైబ్రరీ నిర్మాణానికి చర్యలు

### విద్యాశాఖ ఉన్నతాధికారులతో మంత్రి లోకేష్ సమీక్ష



అమరావతి: రాష్ట్రచరిత్రలో తొలిసారిగా 16,347 పోస్టులతో మెగా డిఎస్సీ ప్రకటించి, విజయవంతంగా నిర్వహించాం. ఇకపై ప్రతిఏటా డిఎస్సీ ప్రకటించి ఖాళీలను భర్తీచేయనున్నట్లు రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ వెల్లడించారు. ఉండవల్లి నివాసంలో విద్యాశాఖపై రాష్ట్రస్థాయి అధికారులతో సమీక్ష నిర్వహించారు. అనవసరమైన శిక్షణా కార్యక్రమాలతో ఉపాధ్యాయుల విలువైన సమయాన్ని వృథా చేయవద్దు. ప్రభుత్వ విద్యలో విద్యాప్రమాణాలను మెరుగుపర్చేందుకు గత 14నెలలుగా సమర్థవంతంగా సంస్కరణలు అమలుచేశాం, సంస్కరణల అంతిమ లక్ష్యం అభ్యసన ఫలితాలే. మెరుగైన ఫలితాలపై దృష్టిసారించాల్సిన బాధ్యత అధికారులు, ఉపాధ్యాయులపై ఉంది. అసర్ నివేదిక ప్రకారం ఎఫ్ఎల్ఎన్ (ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ) (ప్రోగ్రామ్ అమలులో జాతీయస్థాయిలో రాష్ట్రం 14వస్థానంలో ఉంది, ఈ పరిస్థితిలో మార్పు రావాలి. మెరుగైన ర్యాంక్ సాధించేందుకు నిర్మాణాత్మకమైన చర్యలు చేపట్టాలి. దేశంలోనే మొట్ట మొదటి సారిగా ప్రతి బిడ్డకు గ్యారెంటీడ్ ఎఫ్ఎల్ఎన్ ఒక హక్కుగా ఇవ్వబోతున్నాం. ఉపాధ్యాయుల సహకారంతో మారుమూల ప్రాంతాల్లో ఉన్న ప్రతి బిడ్డకి గ్యారెంటీడ్ ఎఫ్ఎల్ఎన్ అందించడమే లక్ష్యంగా పనిచేద్దాం అని మంత్రి అన్నారు.

తల్లికి వందనం చివరి దశ నిధుల విడుదల

తల్లికి వందనం కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలుచేశాం, చివరి విడతగా పెండింగ్ దరఖాస్తులను ఆమోదిస్తూ రూ. 325కోట్లు విడుదల చేశాం. విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా 2024-2025 ఫీజు రీఎంబర్స్ మెంట్ నిధులను వెంటనే విడుదల చేసేలా చర్యలు తీసుకోవాలి. రాష్ట్రంలో కొత్తగా మంజూరైన జవహర్ నవోదయ విద్యాలయాలు, కేంద్రీయ విద్యాలయాలకు దాతల సహకారంతో భూసేకరణకు చర్యలు తీసుకోవాలి. తమిళనాడు, పంజాబ్, గుజరాత్ వంటి రాష్ట్రాల్లో అమలుచేస్తున్న విజయవంతమైన విధానాలను అధ్యయనం చేసి, ఉత్తమమైన స్కూల్ పాలసీని సిద్ధంచేయండి. నిర్దిష్ట క్యాలండర్ ప్రకారం మండల, జిల్లా, రాష్ట్రస్థాయిలో సైన్స్ ఫెయిర్స్, స్పోర్ట్స్ మీట్ లు నిర్వహించాలి. ఇందుకోసం శాప్ సహకారం తీసుకోండి. రాజ్యాంగ దినోత్సవం నాడు అసెంబ్లీ లో విద్యార్థులచే ప్రత్యేక సమావేశం నిర్వహించడానికి స్పీకర్ గారి అనుమతితో ప్రతి అసెంబ్లీ నియోజకవర్గం నుండి విద్యార్థులను ఎంపిక చెయ్యాలని ఆదేశించారు.

మౌలిక సదుపాయాలకు దాతల సహకారం

రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలు, మోడల్ స్కూల్లలో కీలకమైన మౌలిక సదుపాయాల (ఇన్‌ఫ్రాస్ట్రక్చర్) అభివృద్ధికి దేశ, విదేశాల్లో స్థిరపడిన ప్రముఖులు, దాతల సహకారం తీసుకోవాలి. ఆసక్తిగల తమ గ్రామాల్లోని స్కూళ్లను దత్తత తీసుకునేలా ఆయా స్కూళ్లకు అవసరమైన మౌలికసదుపాయాలతో ప్రత్యేకమైన వెబ్ సైట్ రూపొందించాలి. జాతీయస్థాయిలో పేరెన్నికగన్న కార్పొరేట్ సంస్థల సహకారాన్ని కూడా తీసుకోవాలి. రాష్ట్రంలోని అనంతపురం, నెల్లూరు, ఏలూరు, కడప చిత్తూరులలో ఆధునీకరించిన సైన్స్ సెంటర్లను త్వరగా ప్రారంభించి, విద్యార్థులకు ఉపయోగకరంగా తీర్చిదిద్దండి. రాష్ట్రవ్యాప్తంగా మంజూరైన 125 అటల్ టింకరింగ్ ల్యాబ్‌ల నిర్మాణాలను వెంటనే ప్రారంభించి, ఏడాదిలో పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలి.

దేశంలోనే అత్యుత్తమంగా సెంట్రల్ లైబ్రరీ

దేశంలోనే అత్యుత్తమ మోడల్ తో అమరావతిలో సెంట్రల్ లైబ్రరీ నిర్మాణాన్ని చేపట్టాలి. 2లక్షల చదరపు అడుగుల్లో డిజైన్ చేస్తున్న ఈ లైబ్రరీ నిర్మాణాన్ని ఏడాదిలోగా పూర్తిచేసేలా చర్యలు తీసుకోండి. విశాఖపట్నం జగదాంబ సెంట్రల్ లో ప్రతిపాదించిన రీజనల్ లైబ్రరీని 50వేల అడుగుల్లో నిర్మించేందుకు యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాల్సిందిగా మంత్రి లోకేష్ ఆదేశించారు. రాష్ట్రంలో పబ్లిక్ లైబ్రరీల బలోపేతానికి చేపట్టాల్సిన చర్యలపై మంత్రి లోకేష్ చర్చించారు. పబ్లిక్ లైబ్రరీల్లో నిర్ణీత సమయాలను ఖచ్చితంగా అమలుచేసేలా సిబ్బందికి ఫేషియల్ రికగ్నిషన్ విధానాన్ని అమలుచేయండి. ఉమ్మడిజిల్లా కేంద్రాల్లో ప్రస్తుతం 13మాత్రమే జిల్లా గ్రంథాలయాలు ఉన్నాయి. వాటితో పాటు కొత్తగా ఏర్పాటైన జిల్లా కేంద్రాల్లో కూడా జిల్లా గ్రంథాలయాలు ఏర్పాటుచేసేలా చర్యలు తీసుకోవాలి. రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రభుత్వ గ్రంథాలయాలను అనుసంధానిస్తూ ఇంటిగ్రేటెడ్ కామన్ సాఫ్ట్ వేర్, వెబ్ సైట్ రూపొందించాలి. అందులో పెండింగ్ ఇన్ ఫ్రాస్ట్రక్చర్, బుక్ యాక్సెస్, లైబ్రరీ మేనేజ్ మెంట్ వివరాలను అందుబాటులో ఉంచాలి.

సెస్సు నిధులతో లైబ్రరీల అభివృద్ధి

స్థానిక సంస్థలనుంచి సుమారు రూ.213 కోట్ల రూపాయల మేర సెస్సు బకాయిలు పెండింగ్ లో ఉన్నాయి. వాటిని రాబట్టి లైబ్రరీలను అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకోవాలి. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ లైబ్రరీల్లో విజ్ఞానవంతమైన కమ్యూనిటీ కార్యక్రమాలు నిర్వహించి విద్యార్థుల్లో ఆసక్తి పెంపొందించేందుకు చర్యలు తీసుకోవాలి. నేషనల్ మిషన్ ఫర్ లైబ్రరీ నుంచి రాష్ట్రానికి మంజూరైన నిధులను సద్వినియోగం చేసుకోవాలి.

ఇందులో రాజమండ్రి గ్రంథాలయానికి రూ.87లక్షల రూపాయలు మంజూరయ్యాయి. ఈ ఏడాది ప్రభుత్వ లైబ్రరీల్లోని పుస్తకాలతో ప్రిపేరైన 350మందికి కానిస్టేబుల్ ఉద్యోగాలు లభించాయి. లైబ్రరీల వల్ల కలిగే ప్రయోజనాలపై పెద్దఎత్తున క్యాంపెయిన్ నిర్వహించాలి. పోటీపరీక్షలకు అవసరమైన అన్నిరకాల పుస్తకాలు లైబ్రరీల్లో అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని మంత్రి లోకేష్ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్, పాఠశాల విద్య కమిషనర్ విజయరామరాజు, ఇంటర్మీడియట్ విద్య కమిషనర్ కృతికా శుక్లా, సర్వశిక్ష స్టేట్ ప్రాజెక్ట్ డైరక్టర్ బి.శ్రీనివాసరావు, విద్యా మౌలిక సదుపాయాల సంస్థ ఎండి సివిఎన్ దీవెన్ రెడ్డి, పబ్లిక్ లైబ్రరీస్ డైరక్టర్ కృష్ణమోహన్ రావు తదితరులు పాల్గొన్నారు.

## రాహుల్ ప్రశ్నలకు సమాధానమేది?

గత కొన్నిరోజులుగా దేశంలో జరుగుతున్న రాజకీయ పరిణామాలు రాహుల్ గాంధీ, ఎన్నికల కమిషన్ చుట్టూ తిరుగుతున్నాయి. లోకసభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, ఎన్నికల సంఘం మధ్య తీవ్ర వైరుధ్యం నెలకొంది. ఎన్నికల కమిషన్ బిజెపి కోసం ఓట్లచోరీకి పాల్పడుతోందని రాహుల్ గాంధీ ప్రతిరోజు వివిధ కోణాల్లో చేస్తోన్న ఆరోపణలతో ప్రతి చోట ఓట్ల గల్లంతు పైనే చర్చ జరుగుతోంది. రాహుల్ గాంధీ ఈనెల 7వ తేదీన ఢిల్లీలో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా మహాదేవపుర ఓటర్ జాబితా లొసుగులను బయటపెట్టిన విధానం సామాన్య ప్రజలను సైతం ఆలోచనలోపడేసింది. ఎన్నికల సంఘం, బిజెపి కుమ్మక్కై ఐదు రకాల అవకతవకలతో ఓట్లచోరీకి పాల్పడినట్లు నిర్దిష్టమైన ఆధారాలతో, సాక్ష్యాలతో చేసిన ఆరోపణలకు ఇసి ఇచ్చిన వివరణతో ప్రజలకు నిరాశే మిగిలింది. రాహుల్ గాంధీ ఆరోపణలు నిరాధారమని చెప్పడంలో ఎన్నికల కమిషన్ తడబాటుకు గురవుతోంది. బెంగళూరు సెంట్రల్ లోక్‌సభ నియోజకవర్గంలోని మహాదేవపుర అసెంబ్లీ సెగ్మెంట్‌కు సంబంధించి రాహుల్ పిపిటి ద్వారా ఆసక్తికరమైన అంశాలను(ఇంట్రెస్టింగ్ ఫ్యాక్ట్స్) వెలుగులోకి తెచ్చారు.గురు కిరత్ సింగ్ డాంగ్ అనే వ్యక్తి 116, 124, 125, 126 పోలింగ్ బూత్ లలో ఓటరుగా నమోదైనట్లు రాహుల్ ఆధారాలు ప్రదర్శించారు. ఆదిత్య శ్రీవాస్తవ అనే వ్యక్తి 458, 459 పోలింగ్ బూత్ లలో ఓటరుగా నమోదు కాబడి, మహారాష్ట్రలోని ముంబైలో 197, ఉత్తరప్రదేశ్‌లోని లక్నోలో 84వ పోలింగ్ బూత్‌లో ఓటరుగా నమోదు కాబడినట్లు సాక్ష్యాలు చూపెట్టారు. ఇటువంటి నకిలీ ఓటర్లు 11,965 మంది ఉన్నట్లు తేల్చారు. శకున్ రాణి అనే 70 సంవత్సరాల మహిళను నూతన ఓటర్లను నమోదు చేసే 6 ఫారం ద్వారా రెండు బూతులలో ఓటరుగా నమోదు చేశారు.ఒకే గదిగల హౌస్ నెంబర్ 35 లో 80 మంది ఓటర్లు, హౌస్ నెంబర్ 791లో 46 మంది ఓటర్లు, ఓ కమర్షియల్ క్లబ్‌లో 68 మంది ఓటర్లు నమోదైన ఆధారాలను మీడియా ముందు ప్రదర్శించారు. ఇంటి నెంబర్లు 0, 00, అని తండ్రి పేరు ఎక్స్, భర్త పేరు వై, ఓటర్ వయసు 0,00 గా నమోదులు ఉన్నాయి. స్పష్టంగా వేల కొలది తప్పులు కనిపిస్తున్నప్పటికీ విచారణ జరిపించాల్సిన బాధ్యత నుంచి ఇసి తప్పుకుంటూ తాను ఎవరికీ జవాబుదారీ కాననే రీతిలో ప్రవర్తిస్తోన్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. మహాదేవపుర అసెంబ్లీ సెగ్మెంట్‌లో అయిదు పద్ధతుల ద్వారా 1,00,250 తప్పుడు ఓట్లు నమోదు చేసిన వైనాన్ని రాహుల్ బయటపెట్టారు.దేశవ్యాప్తంగా నిర్దేశిత నియోజకవర్గాలలో బిజెపికి అనుకూల ఫలితాలు రావడానికి ఇసి సహకరించిందని రాహుల్ గాంధీ చెబుతున్నారు. రాహుల్ గాంధీ సహేతుకమైన ఆధారాలతో, సాక్ష్యాలతో బయటపెట్టిన అంశాలకు ఎన్నికల కమిషన్ ఇచ్చిన సమాధానం విశ్లేషకులను సంతృప్తి పరచలేదు. ఎన్నికల కమిషన్ ఢిల్లీలో 17వ తేదీన నిర్వహించిన మీడియా సమావేశంలో రాహుల్ గాంధీ పేర్కొన్న నిర్దిష్టమైన అభియోగాలను దాటవేసింది. రాహుల్ గాంధీ వారం రోజుల్లోగా ప్రమాణ పత్రాన్ని దాఖలు చేయాలని లేదా దేశానికి క్షమాపణ చెప్పాలని సిఇసి డిమాండ్ చేశారు. పాలక, ప్రతిపక్షాలు సమానమేనని సిఇసి ఒకవైపు చెబుతూనే 'ఇండియా' కూటమి నేతలు నకిలీ ఓట్లతోనే గెలుపొందారని ఆరోపణలు చేసిన బిజెపి నేత అనురాగ్ ఠాకూర్ అఫిడవిట్ దాఖలు చేయాలని ఎందుకు చెప్పలేదని పలువురు ప్రశ్నిస్తున్నారు.రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, అఖిలేష్ యాదవ్, అభిషేక్ బెనర్జీ గెలుపొందిన లోకసభ స్థానాలలో నకిలీ ఓటర్ల నమోదుతోనే గెలుపొందారని బిజెపి నేత చేసిన ఆరోపణలు ఎన్నికల కమిషన్ పట్టించుకోలేదు. ఎలక్ట్రోరల్ రూల్ 23బి కింద గడిచిన ఎన్నికల అభ్యంతరాలపై ఇసి అఫిడవిట్ అడగడం సరైంది కాదని పలువురు నిపుణులు పేర్కొంటున్నారు. ఎన్నికల ముందు ప్రచురించే ముసాయిదా ఓటర్ల జాబితాపై నియోజకవర్గంలోని ఓటర్లు ఫామ్ 6, 7, 8 ద్వారా, ఇతర వ్యక్తులు రూల్ 23 బి కింద ప్రమాణ పత్రం ద్వారా అభ్యంతరాలు వ్యక్తం చేయాలి. కాలాతీతమైన అంశంలో డిక్లరేషన్‌పై సంతకం చేసి ఇస్తేనే అభ్యంతరాలు పరిశీలిస్తామని ఎన్నికల కమిషన్ పదేపదే ప్రకటించడంలో ఆంతర్యమేమిటో ఎవరికి అంతుబట్టడం లేదు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 324 ప్రకారం ఎన్నికలను స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా నిర్వహించాల్సిన బాధ్యత ఎన్నికల కమిషన్‌పై ఉంది. లోకసభ ఎన్నికలపై ప్రధాన ప్రతిపక్ష నాయకుడు అభ్యంతరాలు, ఆరోపణలు వ్యక్తం చేస్తుంటే దానికి సరైన వివరణ ఇచ్చి ఎన్నికల కమిషన్ తన విశ్వసనీయతను నిరూపించుకుంటే బాగుండేది. ఒక వ్యక్తి పలుచోట్ల ఓటరుగా నమోదైనంత మాత్రాన తప్పేమిటి? అతను పలుచోట్ల ఓటేసినట్లా? అది ఓటు చోరీ ఎలా అవుతుంది అని ప్రధాన ఎన్నికల కమీషనర్ మాట్లాడటం రాజకీయ విశ్లేషకులను విస్మయపరుస్తోంది. సిసి కెమెరా ఫుటేజ్‌పై సమాధానంగా అది వ్యక్తుల ప్రైవసీకి సంబంధించిన విషయమని దానిని బయట పెట్టలేమని చెబుతున్నారు.పలుచోట్ల ఓటరుగా నమోదైన వ్యక్తి ఒకే చోట ఓటు వేస్తున్నాడా? లేదా అనేది ఎలా తెలియాలి? కోట్ల మందికి నివాస గృహాలు ఉండవని అటువంటి వారికి ఇంటి నెంబర్లు జీరో కింద నమోదు చేశామని చెప్పిన ప్రధాన ఎన్నికల కమిషనర్ ఓటర్ల తండ్రులు, భర్తల స్థానంలో ఎ, బి, సి, డిలు ఎందుకు వేయాల్సి వచ్చింది? ఓటర్ల వయసు 0, 00 ఎందుకు నమోదు చేశారు? జనాభా లెక్కలు ఇతర సర్వేలలో ఇంటి నెంబర్ లేని వారికి పక్కనున్న ఇంటి నెంబర్ ఆధారంగా బై నెంబర్లు నమోదు చేస్తారు కదా! మొదలు ప్రశ్నలకు సమాధానం లేకపోయింది. రాహుల్ గాంధీ ఆధారాలను దేశప్రజల ముందు పెట్టిన సందర్భంలో ఎన్నికల కమిషన్ స్పందించి సరైన సమాధానం ఇచ్చినట్లయితే ప్రజలకు దానిపట్ల నమ్మకం పెరిగేది. రాహుల్ గాంధీ ఐదు అంశాలలో ఓటుచోరీ జరిగినట్లు చూపెట్టిన ఆధారాలు తప్పు అని ఇసి నిరూపించిన పక్షంలో కేసు రిజిస్టర్ చేసి న్యాయస్థానాల ద్వారా శిక్షించడానికి, ప్రజల ముందు దోషిగా నిలబెట్టడానికి అవకాశం ఉండేది. రాహుల్ చెబుతున్న ఓట్ చోరీకి సంబంధించిన మాటలపట్ల ప్రజలు ఆసక్తిని ప్రదర్శిస్తున్నారు.

కారణం గత కొన్నేళ్లుగా అనేకచోట్ల పోలింగ్ బూతులలో ఓటు వేయడానికి బారులు తీరి ఓటు వేసే సమయంలో జాబితాలో ఓటు లేదని తిరస్కరించడంతో ఆగ్రహిస్తూ వెనుదిరిగిన వయోజనులు కోకొల్లలు. గత కొద్ది రోజులుగా ఓటు చోరీపై ఎన్నికల కమిషన్ లక్ష్యంగా రాహుల్ మాట్లాడుతున్న మాటలు, చేపడుతున్న కార్యక్రమాలు ప్రధాన మీడియా, సోషల్ మీడియాలో పతాక శీర్షికలుగా ఉంటున్నాయి. ఎన్నికల తప్పిదాలకు పాల్పడిన ప్రతి అధికారి తాము అధికారంలోకి వచ్చాక విచారణ ఎదుర్కోక తప్పదని హెచ్చరిస్తున్నారు.డిజిటల్ మిషన్ రీడబుల్ ఫార్మాట్లో ఓటర్ల జాబితాలను ఎందుకు ఇవ్వడం లేదు? వీడియో ఆధారాలను ఎందుకు ధ్వంసం చేస్తున్నారు? ఓటర్ల జాబితాలో ఎందుకు మోసాలకు పాల్పడుతున్నారు? లాంటి రాహుల్ లేవనెత్తిన ప్రశ్నలకు ఎన్నికల సంఘం ఇచ్చిన సమాధానాలు సామాన్య ప్రజలనే సంతృప్తి పరచలేకపోతున్నాయి. దొంగ ఓట్లకు అండగా ఇసి ఉంటోందని తెలియజేస్తూ పలు వీడియోలు విడుదల చేయటం ఆసక్తి రేపుతోంది. ఓటుచోరీ ఆరోపణలపై దేశవ్యాప్త ప్రచారానికి ఓట్‌చోరీ.ఇన్ అనే వెబ్ సైట్‌లో రిజిస్టర్ చేసుకోవాలని రాహుల్ దేశప్రజలకు పిలుపునిచ్చారు. బీహార్‌లో ఎస్ఐఆర్‌లో మరణించిన వారుగా పేర్కొన్న ఏడుగురు వ్యక్తులతో ఢిల్లీలో రాహుల్ టీ తాగుతూ ముచ్చటించిన వీడియో మీడియాలో సంచలనంగా మారింది. ఎస్ఐఆర్‌లో గల్లంతైన 65 లక్షల మంది ఓటర్ల పేర్లను వెల్లడించాలని సుప్రీంకోర్టు ఎన్నికల కమిషన్‌ను ఆదేశించింది. ఇసి విడుదల చేసే పత్రాలు సెర్చబుల్ ఫార్మాట్‌లో ఉండాలన్న సుప్రీం ఆదేశాలతో రాహుల్ గాంధీ వాదనకు బలం చేకూరినట్లయింది. ఓటుచోరీపై రాహుల్ గాంధీ 'ఇండియా' కూటమి పక్షాలతో కలిసి బీహార్ లో ఓట్ అధికార యాత్ర చేస్తున్నారు.

## శాయంపేటలో ఘనంగా పనుల జాతర కార్యక్రమం

### - పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే.

జయశంకర్ భూపాలపల్లి. తెలంగాణ ప్రజా ప్రభుత్వం రాష్ట్రంలో శుక్రవారం పనుల జాతర కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తోంది. అందులో భాగంగా భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు నియోజకవర్గంలోని శాయంపేట మండలంలో జరిగిన పనుల జాతరలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మండలంలోని యంజేపీ(బాలుర) పాఠశాలలో నరేగా నిధులు రూ.20 లక్షలతో కొత్తగా నిర్మించిన సీసీ రోడ్డును ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం వనమహోత్సవంలో పాల్గొని మొక్కలు నాటి నీరు పోశారు. ఎమ్మెల్యే పత్తిపాక గ్రామానికి చెందిన యంజేపీ స్కూల్ విద్యార్థి జగన్(8వ తరగతి) తాను తయారుచేసిన హ్యాండ్ క్రాఫ్ట్ ను ఎమ్మెల్యే కు అందజేశాడు. అనంతరం గ్రామ పంచాయతీ ఆవరణలో స్వచ్ఛ భారత్ మిషన్ నిధులు రూ.3 లక్షలతో కమ్యూనిటీ టాయిలెట్స్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పల్లెల సమగ్రాభివృద్ధికి ప్రజా ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. గత పదేళ్ల అధికారంలో ఉన్న బీఆర్ఎస్ గ్రామాలను నిర్వీర్యం చేసిందన్నారు. గ్రామీణ ప్రాంతాలకు నిధులు కేటాయించకుండా వివక్ష చూపించడంతో చాలా గ్రామాలు అభివృద్ధికి నోచుకోలేదని ఎమ్మెల్యే విర్వేదా చేశారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రజా ప్రభుత్వంలో ప్రతి గ్రామానికి ప్రత్యేక నిధులు కేటాయించి అభివృద్ధి చేస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంట పలువురు కాంగ్రెస్ నేతలు, అధికారులు, కార్యకర్తలు, గ్రామస్తులు ఉన్నారు.

# చంద్రయాన్ విజయోత్సవం భారతావనికి గర్వ కిరీటం

భారతదేశం శాస్త్రసాంకేతిక రంగంలో సాధించిన విజయాలలో అంతరిక్ష పరిశోధనకు ఒక ప్రత్యేక గౌరవ స్థానం ఉంది. ప్రపంచం లోని అగ్రరాజ్యాల సరసన నిలబడి, స్వంత ఉపగ్రహాలను ప్రయోగించి, చంద్రుడి వైపు దూసుకెళ్లిన భారత్, 2023 ఆగస్టు 23న ఒక అపూర్వ ఘట్టాన్ని సృష్టించింది. ఆ రోజు చంద్రయాన్–3 విజయవంతంగా చంద్రుడి దక్షిణ ధ్రువంపై దిగింది. ఇది భారత అంతరిక్ష పరిశోధన చరిత్రలో మాత్రమే కాకుండా, ప్రపంచ అంతరిక్ష చరిత్రలోనూ కొత్త అధ్యాయాన్ని ప్రారంభించిన ఘనత. ఈ సంఘటనకు గుర్తుగా భారత ప్రభుత్వం ప్రతి సంవత్సరం ఆగస్టు 23న "జాతీయ అంతరిక్ష దినోత్సవం"గా జరుపుకోవాలని నిర్ణయించింది. భారత అంతరిక్ష పరిశోధన ప్రయాణం 1962లో విక్రమ్ సారాభాయ్ దూరదృష్టితో ప్రారంభమైంది. 1975లో తొలి ఉపగ్రహం ఆర్యభటను కక్ష్యలో ప్రవేశపెట్టడం ద్వారా భారత్ అంతరిక్ష శాస్త్రంలో తన అడుగులు వేసింది. అప్పటి నుంచి ఇస్రో వందలాది ఉపగ్రహాలను ప్రయోగిస్తూ వాతావరణ అంచనాలు, టెలి కమ్యూనికేషన్, రిమోట్ సెన్సింగ్, వ్యవసాయం, విపత్తు నిర్వహణ వంటి రంగాల్లో అపారమైన సహకారం అందిస్తోంది. 2013లో మంగళ యాన్ మిషన్ విజయంతో అమెరికా, రష్యా, యూరప్ తరువాత మంగళ గ్రహాన్ని చేరుకున్న నాలుగో దేశంగా భారత్ నిలిచింది. ఈ మిషన్ కేవలం 450 కోట్ల రూపాయల వ్యయంతో పూర్తయి, ప్రపంచాన్ని ఆశ్చర్య పరిచింది. 2023లో చంద్రయాన్–3 మిషన్ ద్వారా భారత్ మరొక మైలురాయిని చేరుకుంది. అమెరికా, రష్యా, చైనా తరువాత చంద్రుడి మీద దిగిన నాలుగో దేశం భారత్. కానీ చంద్రుడి దక్షిణ ధ్రువంలో విజయవంతంగా ల్యాండింగ్ చేసిన ప్రపంచంలోనే మొదటి దేశం భారత్ కావడం ఈ విజయానికి అపూర్వతను తెచ్చింది. 3.84 లక్షల కిలోమీటర్ల దూరంలో ఉన్న చంద్రునిపై "విక్రం ల్యాండర్" క్షణాల్లో సాఫల్యంగా దిగడం, "ప్రజ్ఞాన్ రోవర్" పరిశోధనలకు శ్రీకారం చుట్టడం, చంద్రుని ఉపరితలంలో సల్ఫర్, అల్యూమినియం, కాల్షియం, ఇనుము వంటి మూలకాల జాడలు గుర్తించడం వంటి విజయాలు ప్రపంచాన్ని భారత ప్రతిభ వైపు మరల్చాయి. ఇది కేవలం 615 కోట్ల రూపాయల వ్యయంతో పూర్తవడం, అమెరికా లేదా రష్యా మిషన్ల ఖర్చుతో పోలిస్తే చాలా తక్కువ కావడం ఇస్రో సామర్థ్యానికి నిదర్శనం. ఈ విజయాన్ని గుర్తు చేసుకోవడమే కాక, దేశ భవిష్యత్తు తరాలకు ప్రేరణనివ్వడం కోసం ఆగస్టు 23న జాతీయ అంతరిక్ష దినోత్సవం జరుపుకోవడం నిర్ణయాత్మకం. ఈ దినోత్సవం శాస్త్రవేత్తల అంకితభావానికి గౌరవం మాత్రమే కాదు, దేశవ్యాప్తంగా విద్యార్థుల్లో శాస్త్రాసక్తిని పెంపొందించే అవకాశం కూడా. పాఠశాలలు, కళాశాలల్లో శాస్త్ర ప్రదర్శనలు, వ్యాసరచన పోటీలు, ఖగోళ పరిశీలన కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా యువతకు పరిశోధనా తపన కలిగించవచ్చు.అంతరిక్ష సాంకేతికత కేవలం శాస్త్ర ప్రగతికే పరిమితం కాదుబీ అది సామాజిక–ఆర్థిక అభివృద్ధికి మూల స్తంభం. ఉపగ్రహాల సహాయంతో గ్రామీణ ప్రాంతాల్లో టెలి మెడిసిన్, ఆన్‌లైన్ విద్య, వాతావరణ హెచ్చరికలు అందుబాటులోకి వచ్చాయి. వ్యవసాయ రంగంలో రిమోట్ సెన్సింగ్ ద్వారా పంటల స్థితి, నీటి వనరుల వినియోగం సమర్థవంతంగా జరుగుతోంది. భవిష్యత్తులో గగన యాన్ మిషన్ ద్వారా భారతీయ వ్యోమగాములు అంతరిక్షంలోకి అడుగుపెట్ట బోతున్నారు. అలాగే శుక్రయాన్, అదిత్య–ఎల్1 (సూర్య పరిశోధన), మరికొన్ని మార్స్, వెనస్ మిషన్లు కూడా రూపుదిద్దుకుంటున్నాయి. అందువల్ల జాతీయ అంతరిక్ష దినోత్సవం ఒక జ్ఞాపక దినం మాత్రమే కాదు, అది భారత శాస్త్ర స్ఫూర్తికి ప్రతీక, భవిష్యత్ తరాలకు ఒక దిక్సూచి. విక్రమ్ సారాభాయ్ ప్రారంభించిన యాత్రను ఏపీజే అబ్దుల్ కలాం వంటి మహానుభావులు కొనసాగించారు. ఇప్పుడు ఈ వారసత్వాన్ని ఇస్రో శాస్త్రవేత్తలు కొత్త ఎత్తులకు తీసుకెళ్తున్నారు. ఆగస్టు 23 మన జ్ఞాపకాల్లో ఎప్పటికీ నిలిచిపోయే "భారత అంతరిక్ష గౌరవ దినం".

# తొలి తెలుగు క్రైస్తవ కవి

ఆంధ్రక్రైస్తవ సంకీర్తనా పితా మహులు, తెలుగు క్రైస్తవ సంఘ పితామహుడు అని పిలువబడే కవిశేఖరుడు చౌదరి పురుషోత్తం పేరు వినని, ఆయన పాట గానం చేయని తెలుగు క్రైస్తవులు ఉండరంటే అతిశయోక్తి కాదేమో. ప్రముఖ వాగ్గేకారుల, ముఖ్యంగా త్యాగ రాయ కృతులతో గేయకవిత శిఖరాయమాన ప్రాభవాన్ని సంతరించుకొన్న 19వ శతాబ్దిలో, హిందూ దేవుళ్ళనే కీర్తించేందుకు కృతులుగాని, కీర్తనలు గాని కోకొల్లలుగా జన బాహుళ్యానికి అందుబాటులోకి వచ్చిన తరుణంలో 19వ శతాబ్ది పూర్వార్థం లోనే మొట్ట మొదటి సారిగా అన్య మతానికి చెందిన దేవుని కీర్తించేందుకు కీర్తనలను రచించిన కవి పురుషోత్తమ చౌదరి. 19వ శతాబ్దిలో క్రైస్తవ మతాన్ని స్వీకరించి, మనసా, వాచా, కర్మణా, క్రైస్తవ మత ప్రచారా ర్థం రచనలు చేసిన తొలి తెలుగు క్రైస్తవ కవి పురుషో త్తమ చౌదరి. అనేక క్రైస్తవ పద్య కృతులను, కీర్తనలను రచించి ఆంధ్ర క్రైస్తవ సార్వభౌముడు'గా ఖ్యాతి నొందారు. పురుషోత్తం చౌదరి (సెప్టెంబరు 5, 1803 – ఆగస్టు 23, 1890) తెలుగు క్రైస్తవ పదకవితా పితామహుడు. తొలి తెలుగు క్రైస్తవ వాగ్గేయకారులు. సి.పి. బ్రౌన్, త్యాగరాజుకు సమకాలి కులు. తాను రాసిన కీర్తనలను స్వయంగా గానం చేస్తూ ప్రజా బాహుళ్యానికి అందించారు. శ్రీకాకుళం జిల్లా తెంబూరు (పాతపట్నం) శివారు మదనా పురం (తెంబూరు (పాతపట్నం) లో 1803, సెప్టెంబరు 5 న బెంగాలీ బ్రాహ్మణ కుటుంబానికి చెందిన సుభద్రాదేవి, కూర్మా నాథ చౌదరి దంపతులకు జన్మించారు. తల్లి వీరి పూర్వీకులు పశ్చిమ బెంగాలు నుండి ఒరిస్సా ప్రాంతానికి వచ్చి స్థిరపడిన బెంగాల్ బ్రాహ్మణులు. తమ మతాచారాల ప్రకారం పురుషోత్తమ చౌదరికి ఏడు సంవత్సరాలప్పుడే ఉపనయన సంస్కారం జరిపి, గాయత్రీ మంత్రాన్ని ఉపదేశించారు. పురుషోత్తం చౌదరి బాల్యం నుండే మతనిష్ట కలిగి ఉండేవారు. నిరంతర విగ్రహారాధన, తీర్థ యాత్రలతో పాటు భుజాలపై వైష్ణవ మత సూచకాలైన శంఖు చక్రాల్ని కూడ కాల్పించు కొన్నారు. 1823 లో తన మేనమామ కుమార్తె యైన రాధామణి దేవిని వివాహం చేసికొన్నారు. సంస్కృతం, ఒరియా, తెలుగు భాషల్లో ప్రావీణ్యతను సంపాదించి, 20 సంవత్సరాలకే కవిత్వం రాయడం ఆరంభిం చారు. క్రైస్తవ్యాన్ని స్వీకరించక మునుపు చాలా హిందూ మత సంబంధిత భక్తి రచనల్ని చేశారు. ఆయన తన అన్న గారి పాఠశాలలో పనిచేస్తుండే వారు. అప్పుడే క్రైస్తవ్యం పట్ల ఆసక్తి కలిగి, దాని గురించి తెలుసు కోవాలనే తపనతో అన్వేషిం చడం మొదలు పెట్టారు. అదే సమయంలో ఆధునిక ప్రేషిత పితామహుడుగా పేరుగాంచిన విలియమ్ కేరీ తెలుగులో వ్రాసిన కరపత్రం ఒకటి పురుషోత్తంకు చేతికి అందింది. అది చదివిన పురుషోత్తంకు క్రీస్తు గురించి మరి యెక్కువగా తెలుసు కోవాలని పించింది. దైవ సంకల్పం ప్రకారం మిషనరీ హెలెన్ నాట్, విలియమ్ డాసన్ మొదలైన క్రైస్తవ ప్రముఖులతో పరిచయం కలిగటం, అప్పటికే రెవ. ప్రిచెట్ (1818) తెలుగు లో అనువదించిన నూతన నిబంధన తన చేతికందటంతో ఆయన ఆశ నెరవేరింది. పురుషోత్తం చౌదరి దాన్ని బాగా చదివారు. 1829 లో విశాఖ పట్నంలో క్రైస్తవ సాహిత్యాన్ని అధ్యయనం చేశారు.1833 అక్టోబరు 6 వ తేదీన క్రీస్తుని అనుసరించాలని నిర్ణయించు కొన్నారు.1833లో 'కులాచార పరీక్ష' అనే పత్రికను రాసి, కుల వ్యవస్థను ఖండించారు. 1833 అక్టోబరులో కటక్‌లో 'బాప్తిస్మం' తీసుకొని, క్రైస్తవ మత ప్రచారం ప్రారంభించారు. 18 రోజులు కాలినడకన పాటలు పాడు కుంటూ ప్రచారం చేస్తూ మద్రాసు వెళ్లారు.1833 అక్టోబరు 6 వ తేదీన అదే రోజు తన తోటి క్రైస్తవులతో కలిసి ఆరాధిస్తూ..."మా యేసుక్రీస్తుని – మరుగు గల్గెనురా, నా యాత్మ ఘన రక్ష – నగము నెక్కెనురా"...అనే కీర్తనను పాడారు. అది తెలుగులో వెలువడిన మొట్టమొదటి క్రైస్తవ గీతం. పురుషోత్తం క్రైస్తవుడవ్వడంతో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యుల నుండి ఎంతో వ్యతిరేక తను, మరెన్నో అవరోధాలను ఎదుర్కోవలసి వచ్చింది. కాని ఈ శోధనలన్నీ తనలో నిరాశను కలిగించడానికి బదులుగా తాను పొందిన రక్షణాను భవాన్ని ఇతరులకు ప్రకటించా లనే తృష్ణను పెంచాయి. 1836 ఏప్రిల్ 3 వ తేదీన ఆయన భార్య రాధామణి దేవి కూడా క్రైస్తవ్యాన్ని స్వీకరించారు. ఆ సంవత్సరమే చౌదరిని మిషనరీగా అభిషేకించారు. అనేక శ్రమలకు, తిరస్కారాలకు గురైనప్పటికీ, విశ్వాసంలో వెనుకడుగు వేయక, వేలకొలది మైళ్ళు కాలినడకను ప్రయాణిం చి, ఆంధ్ర దేశంలో అధికభాగం పర్యటిస్తూ విస్తృత సేవ చేసి, తెలుగు క్రైస్తవ సంఘ పితా మహుడయ్యారు. చౌదరి విరచిత ఆణిముత్యాల లాంటి పాటలన్నీ కేవలం భక్తిపూరిత మైనవే కాకుండా, సాహితీ సంపదతో తుల తూగు తుంటాయి. కేవలం కీర్తనల్ని మాత్రమే గాక " క్రైస్తవ నీతి ప్రకాశం, సత్య వేద సార సంగ్రహం, "కులాచార పరీక్ష" ఇత్యాది ఎన్నో గ్రంథాల్ని కూడా రచించారు. ఆయన రచనల్లో ఎక్కువగా విగ్రహారా ధనని ఖండించారు. ఆయన వ్రాసిన ప్రతి పాట స్వీయ జీవితానుభవ లోతుల్లో నుండి పెల్లుబికినదే. అందుకే అవి ఈ నాటికీ తెలుగు క్రైస్తవ సాహిత్యంలో సజీవ సంకీర్తన లుగా నిలిచి పోయాయి. 1882 లో కనుచూపు పూర్తిగా మందగించిన సమయంలో తన కుమార్తెను పిలిపించుకొని, "సకలేంద్రియములారా – చాలు మీ పనిదీరె" అనే పాటను పాడి, ఆమెచే వ్రాయించారు. చివరకు 1890, ఆగస్టు 23 న తన 87 వ యేట ప్రభువుని చేరుకొన్నారు. చౌదరి కవి ఎన్నో కీర్తనలు రచించారు. పద్య కావ్యాల రచనలలో పద్య కృతులు ఐదు లభిస్తున్నాయి. వాటిలో రెండు శతకాలు – ఒకటి 'యేసు నాయక శతకము'బీ రెండవది 'యేసు క్రీస్తు ప్రభు శతకము'. ఇక, 'పంచ చామర పన్నములు' పంచ చామర ఛందస్సులో మకుట సహితంగా యెహోరీవాను దలతున్" అన్న కీర్తనను పొందు పరిచాడు కవి. సాగిన అర్థశతి. 'పంచ రత్నములు' ఐదు సీస పద్యాల సంకలనం. క్రైస్తవ నీతి ప్రకాశము, 'సత్యవేద సార సంగ్రహము' అనేవి పద్య కావ్యాలు, వీటిలో క్రీ.శ. 1845లో వెలువడిన 'యేసు నాయక శతకము' తెలుగు శతక వ్మాయంలో మొట్ట మొదటి క్రైస్తవ శతకం. ప్రస్తుతం చౌదరి రాసిన కీర్తన వినిపించని చర్చి, క్రైస్తవుల ఇళ్లు లేవు. 1933లో చౌదరి శతజయంతి ఉత్సవాలు ఆంధ్రా – ఒరిస్సాలో ఘనంగా నిర్వహించారు. పురుషోత్తమ చౌదరి స్వహస్తాలతో శ్రీకాకుళం చిన్న బజారులోని తెలుగు బాప్తిస్టు చర్చిని దాదాపు 150 ఏళ్ల క్రితం నిర్మించారు. ఆయన భార్య శ్రీకాకుళంలోనే మరణించారు.

# ఆంధ్రులకు గర్వకారణం 'ఆంధ్రకేసరి'

టంగుటూరి ప్రకాశం పంతులు సుప్రసిద్ధ స్వాతంత్ర్య సమర యోధులు, ఆంధ్ర రాష్ట్రానికి మొదటి ముఖ్యమంత్రి. నిరుపేద కుటుంబంలో పుట్టి, వారాలు చేసుకుంటూ చదువుకుని, ఆంధ్ర రాష్ట్ర మొదటి ముఖ్యమంత్రి అయిన కృషీవలుడు. 1940, 50లలోని ఆంధ్ర రాజకీయాల్లో ప్రముఖంగా వెలుగొందిన వ్యక్తుల్లో ప్రకాశం ఒకరు. మద్రాసులో సైమన్ కమిషన్ వ్యతిరేక ప్రదర్శనలో తుపాకి కెదురుగా గుండెనుంచి ఆంధ్రకేసరి అని పేరు పొందినవారు. ప్రత్యేకాంధ్ర రాష్ట్ర సాధనలో నిర్ణాయక పాత్ర పోషించారు. టంగుటూరి ప్రకాశం 1872 ఆగష్టు 23 న ఇప్పటి ప్రకాశం జిల్లా వినోద రాయుని పాలెము గ్రామంలో నియోగి బ్రాహ్మణులైన సుబ్బమ్మ, గోపాల కృష్ణయ్య దంపతులకు జన్మించారు. పదకొండో యేట తండ్రి మరణించడంతో, పిల్లలను తీసుకుని తల్లి ఒంగోలు చేరింది. ఒంగోలులో ఆమె భోజనశాల నడప వలసి వచ్చింది. ఆ రోజుల్లో ఇలాంటి వృత్తి చేసే వారిని సమాజంలో చాలా తేలికగా చూసేవారు. పూటకూళ్ళ వ్యాపారం చేసే తల్లి సంపాదన చాలక, ప్రకాశం ధనికుల ఇళ్ళల్లో వారాలకు కుదిరారు. పిన్న వయసులోనే ప్రకాశం నాటకాలు వేసేవారు. వల్లూరులో ప్రకాశం ప్రాథమిక విద్య సాగింది. అల్లరి చిల్లరి సావాసాల వల్లా, నాటకాల వ్యాపకం వల్లా, ప్రకాశానికి మెట్రిక్ పాస్ అవడం కష్టమయ్యింది. మిషను పాఠశాల ఉపాధ్యాయుడైన ఇమ్మానేని హనుమంతరావు నాయుడు చలవతో ప్రకాశం ఫీజు లేకుండా ప్రీ మెట్రిక్ లో చదివారు. నాయుడు రాజమండ్రికి నివాసం మారుస్తూ, ప్రకాశాన్ని తనతో తీసుకువెళ్ళి, అక్కడ ఎఫ్.ఏ.లో చేర్పించారు. తరువాత మద్రాసుకు పంపించి, న్యాయశాస్త్రం చదివించారు. ప్రకాశం 1890లో తన అక్క కూతురైన హనుమాయమ్మను పెళ్ళి చేసుకున్నారు. ఆ తరువాత కొద్దికాలం పాటు ఒంగోలులో న్యాయవాద వృత్తి చేసి, 1894లో మళ్ళీ రాజమండ్రి చేరారు. వృత్తిలో పేరూ, పుష్కలంగా సంపద సంపాదించారు. తన 35వ ఏట రాజమండ్రి పురపాలక సంఘానికి అధ్యక్షుడయ్యారు. అప్పట్లో ప్రకాశం సెకండ్ గ్రేడ్ ప్లీడరు. కనుక పై స్థాయి కోర్టులలో వాదించడానికి అర్హత లేదు. బారిస్టరులకు మాత్రమే ఆ అర్హత ఉండేది. ఒకసారి ప్రకాశం ప్రతిభ గమనించిన ఒక బారిస్టరు ప్రకాశాన్ని కూడా బారిస్టరు అవమని ప్రోత్సహించారు. ఆ సలహా నచ్చి, ప్రకాశం 1904లో సాంప్రదాయాలను పక్కనపెట్టి, ఇంగ్లాండు వెళ్ళారు. వెళ్ళే ముందు మహాత్మా గాంధీ లాగానే మద్యం, మాంసం, పొగాకు ముట్టనని తల్లికి మాట ఇచ్చి ఒప్పించారు. దీక్షగా చదివి బారిస్టరు అయ్యారు. ప్రకాశం మద్రాసు హైకోర్టులో ప్రాక్టీసు ప్రారంభించారు. అప్పట్లో మద్రాసులో ప్రసిద్ధి చెందిన బారిష్టరులందరూ ఆంగ్లేయులు లేదా తమిళులు. పేరుపొందిన తెలుగు బారిష్టరులలో ఈయనే ప్రప్రథముడు. ప్రకాశం జాతీయోద్యమం పట్ల ఆకర్షితులయ్యారు. అప్పటికి ఇంకా భారత రాజకీయ రంగంలో గాంధీజీ ప్రవేశించనే లేదు. ప్రకాశం సత్యాగ్రహోద్యమంలో ముమ్మరంగా పాల్గొన్నారు. పలుమార్లు జైలుకు వెళ్లారు. గాంధీజీని సైతం లెక్క చేయని ఆంధ్ర నాయకులలో మొదటి వారు ప్రకాశం.1908లో ప్రముఖ జాతీయ నాయకుడు బిపిన్ చంద్రపాల్ మద్రాసుకు వచ్చారు. ఆయన సభకు అధ్యక్షత వహించుటకు ప్రముఖులు భయ పడ్డారు. పిడుగులు కురిసినట్లు, వడగండ్ల వానలా చేసిన, బిపిన్ పాల్ గంభీరోపన్యాసం మద్రాసు ప్రజల్లో నూతన చైతన్యం కల్గించింది. ఆనాటి నుండి ప్రకాశం తన జీవితాన్ని దేశసేవకు అంకితం చేశారు. జాతీయ భావాలను ప్రచారం చేయటానికి మద్రాసులో 'స్వరాజ్య' పత్రికను 1921 అక్టోబర్ 29న దినపత్రికగా ప్రారంభించారు. ఖాసా సుబ్బారావు, కోటంరాజు పున్నయ్య, జి.వి. కృపానిధి మున్నగు గొప్ప పాత్రికేయులు 'స్వరాజ్య' లో పని చేశారు."స్వరాజ్య" పన్నెండేళ్ళు నడిచింది. లక్షల్లో అప్పులు చేశారు ప్రకాశం. తన బంగళాలను అమ్మి అప్పులు తీర్చారు. ప్రభుత్వాన్ని నిశితంగా విమర్శించే వారాయన. "గాలితో నైనా పోట్లాడే స్వభావం కలవాడు ప్రకాశం"అన్నారు అయ్యదేవర కాళేశ్వరరావు.1929లో సైమన్ కమీషన్ మద్రాసుకు వచ్చింది. మద్రాసులో అతనిని బహిష్కరించటం వద్దన్నారు గాంధీజీ. గాంధీగారి ఆదేశం ప్రకాశంగారికి నచ్చలేదు. రాజాజీ తప్పుకున్నారు. ప్రకాశం పంతులు, దుర్గాబాయ్, రంగయ్య నాయుడు, వేలాది ప్రజలతో వూరేగింపు వెళ్తూ 'సైమన్ గోబ్యాక్' అని గర్జించారు. బ్రిటీష్ తొత్తులైన సైనికులు తుపాకులతో కాలుస్తాం అని కేకలు వేశారు. ఒక అజ్ఞాత దేశభక్తుడు తుపాకి గుళ్లకు బలి అయ్యాడన్న వార్త దావానలంలా వ్యాపించింది. ప్రకాశం సింహంలా ముందు కురికారు. చొక్కా గుండీలు విప్పి"రండిరా యిదె కాల్చు కొండిరా"అని గుండె చూపిన వేళ...తుపాకులు తలలు వంచాయి. అంతటితో ప్రకాశం పేరు దేశమంతటా మార్మోగింది. 1937లో కాంగ్రెసు అధికారం లోకి వచ్చినపుడు, రాజాజీ మంత్రి వర్గంలో ఆయన రెవిన్యూ మంత్రిగా ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు.1945లో జైలు నుండి విడుదలైన తర్వాత రాష్ట్రమంతటా పర్యటించారు. 1946లో మద్రాసు రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఎన్నికై, 13 నెలలపాటు ఆ పదవిలో కొనసాగారు. ఎన్నో అభివృద్ధి పనులు చేపట్టారు. స్వంత పార్టీలోని అంతర్గత రాజకీయాలకు ఆయన ప్రభుత్వం బలయ్యాక, పార్టీ నుండి బయటకు వచ్చి, స్వంతంగా ప్రజాపార్టీని స్థాపించారు.సామాన్య ప్రజల సంక్షేమార్థమై ప్రకాశం, తన వ్యక్తిగత భద్రతను, జవహర్ లాల్ నెహ్రూ చేసిన హెచ్చరికలనూ, లెక్కచేయకుండా 1948లో నిజాం పాలనలో ఉన్న హైదరాబాదు రాష్ట్రాన్ని సందర్శించారు. నిజాం సహాయ సహకారాలతో సామాన్య ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్న రజాకార్ల నాయకుడు ఖాసిం రిజ్వీని కలిసి, రిజ్వీ తన అదృష్టాన్ని చాలా దూరం లాగుతున్నాడని హెచ్చరిక చేశారు. ప్రకాశం ధైర్యానికి మెచ్చుకోలుగా రజాకార్లు ఆయనకు గౌరవ వందనం సమర్పించారు. 1953 అక్టోబర్ 1 న ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం ఏర్పడినప్పుడు దానికి తొలి ముఖ్యమంత్రిగా ప్రకాశం నియమితులు అయినారు. రాష్ట్రావతరణ మొదటి వార్షికోత్సవ సమయంలో 2000 మంది ఖైదీలకు క్షమాభిక్ష, తిరుపతిలో శ్రీ వేంకటేశ్వర విశ్వ విద్యాలయం స్థాపన, సేద్యపు నీటి ప్రాజెక్టుల నిర్మాణం, విజయవాడ వద్ద కృష్ణా నదిపై బారేజి నిర్మాణం వీటిలో ప్రముఖమైనవి. ప్రకాశం లక్షలార్జించినా, చివరికి ఏమీ దాచుకోలేదు. చరమ దశలో రాష్ట్ర ప్రభుత్వం ప్రకాశంకు నెలకు రు.750/– గౌరవభృతి సొంత వాడకానికి ఒక కారు ఇచ్చింది. దానిలో పెట్రోల్ పోయించు కోలేని దయనీయ స్థితి ఆయనది. ఆంధ్రజాతికి తిరుగులేని నాయకుడుగా వెలిగిన ప్రకాశం తెలుగు ప్రజల హృదయాలలో సుస్థిర స్థానాన్ని పొంది, 1957 మే నెల 20వ తేదీన దివంగతు లయ్యారు.

# భారత్ కు అండగా చైనా

న్యూఢిల్లీ, ఆగస్టు 22, భారతదేశంపై అమెరికా విధించిన 50% సుంకం విషయంలో చైనా భారతదేశానికి బహిరంగంగా మద్దతుగా నిలిచింది. ఇందుకు సంబంధించి చైనా తగిన సమాధానం ఇచ్చింది. అమెరికా సుంకాలపై భారతదేశంలోని చైనా రాయబారి జు ఫీహాంగ్ తీవ్రంగా స్పందించారు. "అమెరికా భారతదేశంపై 50% వరకు సుంకం విధించింది. ఇంకా ఎక్కువ సుంకాలు విధిస్తామని బెదిరించింది. చైనా దీనిని తీవ్రంగా వ్యతిరేకిస్తుంది. చైనా భారతదేశానికి అండగా నిలుస్తుంది" అని ఆయన అన్నారు.అమెరికాను బెదిరింపుదారుగా చైనా రాయబారి జు ఫీహాంగ్ అభివర్ణించారు. అమెరికా చాలా కాలంగా స్వేచ్ఛా వాణిజ్యాన్ని సద్వినియోగం చేసుకుంటోందని, కానీ ఇప్పుడు సుంకాలను బేరసారాల చిప్‌గా ఉపయోగిస్తోందని అన్నారు. అమెరికా భారతదేశంపై 50% వరకు సుంకాలను విధించిందని, ఈ చర్యను చైనా తీవ్రంగా వ్యతిరేకిస్తుందని ఆయన అన్నారు. మౌనంగా ఉంటే బెదిరింపులు పెరుగుతాయన్నారు. చైనా భారతదేశంతో దృఢంగా నిలబడుతుందని ఆయన స్పష్టం చేశారు.భారతదేశం కోసం చైనా మార్కెట్‌ను తెరవడంపై కీలక వ్యాఖ్యలు చేశారు. రెండు దేశాలు ఒకరి మార్కెట్లలో వస్తువులను మార్పిడి చేసుకోవడం ద్వారా చాలా పురోగతి సాధించవచ్చని ఫీహాంగ్ అన్నారు. "చైనా మార్కెట్‌కు మరిన్ని భారతీయ వస్తువులు రావడాన్ని మేము స్వాగతిస్తాము. భారతదేశం ఐటీ, సాఫ్ట్‌వేర్, బయోమెడిసిన్ రంగంలో బలంగా ఉంది. అయితే చైనా ఎలక్ట్రానిక్స్, పునరుత్పాదక ఇంధన రంగంలో వేగంగా అభివృద్ధి చెందుతోంది. రెండు ప్రధాన మార్కెట్లు అనుసంధానిస్తే, మరింత ప్రభావం ఉంటుంది" అని ఆయన అన్నారు. భారతీయ కంపెనీలు చైనాలో పెట్టుబడులు పెట్టాలని చైనా కోరుకుంటుందని, దేశంలో చైనా కంపెనీలకు అనుకూలమైన వాతావరణం ఉండాలని ఆశిస్తున్నట్లు ఫీహాంగ్ అన్నారు.ఇటీవల, ఎంపిక చేసిన భారతీయ వస్తువుల దిగుమతిపై అమెరికా 50 శాతం భారీ సుంకాన్ని ప్రకటించింది. ఇందులో 25 శాతం పరస్పర సుంకం, రష్యన్ చమురు కొనుగోలుపై 25 శాతం సుంకం ఉన్నాయి. ముడి చమురు కొనుగోలు చేయడం ద్వారా ఉక్రెయిన్‌తో యుద్ధంలో భారతదేశం రష్యాకు సహాయం చేస్తోందని అమెరికా విశ్వసిస్తుంది. ఈ సుంకాలు ఆగస్టు 27 నుండి అమల్లోకి వస్తాయి.

## డా.బి.ఆర్ అంబేద్కర్ ఓపెన్ డిగ్రీ ప్రవేశాల గడువు పెంపు



**హుజురాబాద్ అసెంబ్లీ నియోజకవర్గం ప్రజాబలం ప్రతినిధి ఆగస్టు 22** డా. బి. ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయంలో దూరవిద్య లో మొదటి సంవత్సరంలో బిఎ, బీకాం, బీఎస్సీ కోర్సులలో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదలైందని జమ్మికుంట ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇన్చార్జ్ ప్రిన్సిపల్ ఎస్ ఓదేలు కుమార్ తెలిపారు. దరఖాస్తులు ఆన్ లైన్ ద్వారా ఆగష్టు 30వ తేది లోపు చేసుకోవచ్చని తెలిపారు. అలాగే దివ్యాంగులకు, షెడ్యూలు తెగలకు, ట్రాన్స్ జెండర్స్ కి ఉచిత విద్య అందించబడుతుంది. అలాగే ద్వితీయ, తృతీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు ట్యూషన్ ఫీజు చెల్లించాలని తెలిపారు. పూర్తి సమాచారం కొరకు 7382929775 నంబరుకు సంప్రదించాలని సూచించారు.

# సీఈసీపై అభిశంసన...

ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేష్ కుమార్‌ను పదవి నుంచి తొలగించడానికి ఆయనపై అభిశంసన తీర్మానం తీసుకువచ్చే అంశాన్ని 'ఇండియా' కూటమి పరిశీలిస్తోంది. ఎన్నికల కమిషనర్‌పై అభిశంసన తీర్మానం తీసుకురావడానికి ప్రతిపక్షాలు సన్నాహాలు ప్రారంభించాయని శివసేన (యూబీటీ) ఎంపీ సంజయ్ రౌత్ అన్నారు.ఎన్నికల కమిషన్ 'ఓట్ల చోరీ' చేస్తోందని లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు, కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ ఆగస్టు 7న ఆరోపించారు.

అయితే, రాహుల్ గాంధీ ఆరోపణలు నిరాధారమైనవని ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ ఈనెల 17న జరిగిన విలేఖరుల సమావేశంలో స్పష్టంచేశారు. సీఈసీ మీడియా సమావేశం తర్వాత, సోమవారం ప్రతిపక్ష పార్టీల ఎంపీల సమావేశం జరిగింది."ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ, ఇతర పార్టీలు లేవనెత్తిన ప్రశ్నలకు మీడియా సమావేశంలో సీఈసీ సమాధానం ఇవ్వలేదు. బదులుగా, ప్రశ్నలు లేవనెత్తినందుకు ప్రతిపక్షాలను ఆయన ఎగతాళి చేశారు.

రాజకీయాల్లో పాల్గొనడం సీఈసీ పనా?" అని వేణుగోపాల్ ప్రశ్నించారు.సీఈసీపై అభిశంసన తీర్మానం తీసుకురావడానికి ప్రతిపక్షాలకు తగినంత సంఖ్యాబలం ఉందని వేణుగోపాల్ అన్నారు. ప్రధాన ఎన్నికల కమిషనర్, ఇతర ఎన్నికల కమిషనర్ల నియామకానికి సంబంధించిన చట్ట నిబంధనలను కూడా ఆయన ప్రశ్నించారు.ఇంతకీ, భారత ప్రధాన ఎన్నికల కమిషనర్‌ను ఆ పదవిలో నియమించడం, తొలగించే విధానం ఏంటి?దేశంలో స్వేచ్ఛగా, నిష్పాక్షికంగా ఎన్నికలు నిర్వహించడం ఎలక్షన్ కమిషన్ బాధ్యత. దీని అధికారులను అంటే చీఫ్ ఎలక్షన్ కమిషనర్ (సీఈసీ), ఎన్నికల కమిషనర్లను భారత రాష్ట్రపతి నియమిస్తారు.దీని కోసం, ముగ్గురు సభ్యుల ఎంపిక కమిటీ సిఫార్సులు చేస్తుంది. ఈ కమిటీలో ప్రధానమంత్రి, లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు లేదా లోక్‌సభలో అతిపెద్ద ప్రతిపక్ష పార్టీ నాయకుడు, కేంద్ర మంత్రి మండలి సభ్యుడు ఉంటారు.కేబినెట్ కార్యదర్శి నేతృత్వంలోని సెర్చ్ కమిటీ ఎంపిక కమిటీకి అభ్యర్థుల పేర్లను ప్రతిపాదిస్తుంది.ఎన్నికల కమిషనర్ నియామకం, వారి పదవీకాలం, తొలగింపు ప్రక్రియ రాజ్యాంగంలోని ఆర్టికల్ 324, 'చీఫ్ ఎలక్షన్ కమిషనర్ అండ్ అదర్ ఎలక్షన్ కమిషనర్స్(అపాయింట్మెంట్స్, కండీషన్స్ ఆఫ్ సర్వీస్ అండ్ టెన్యూర్) యాక్ట్, 2023' నిబంధనల ప్రకారం జరుగుతాయి.ఈ చట్టం ప్రకారం, ఈ పదవులకు ఎంపికైన వారు గతంలో ప్రభుత్వంలో కార్యదర్శి స్థాయి పదవుల్లో పనిచేసి ఉండాలి. ఎన్నికల నిర్వహణలో కూడా అనుభవం ఉండాలి.సదరు అధికారిని ఆరు సంవత్సరాల పదవీకాలం లేదా 65 సంవత్సరాల వయస్సు వరకు (ఏది ముందు అయితే అది) నియమిస్తారు. సుప్రీంకోర్టు న్యాయమూర్తులకు ఇచ్చే సౌకర్యాలు, ప్రయోజనాలను ప్రధాన ఎన్నికల కమిషనర్ పొందుతారు.ఈ ఏడాది ఫిబ్రవరిలో జ్ఞానేష్ కుమార్ ప్రధాన ఎన్నికల కమిషనర్‌గా నియమితులయ్యారు.

ఎన్నికల సంఘం సభ్యుల నియామకం కోసం రూపొందించిన కొత్త చట్టం ప్రకారం బాధ్యతలు స్వీకరించిన మొదటి సీఈసీ ఆయనే.2023 చట్టం రాకముందు, ఎన్నికల కమిషనర్ల నియామకం 1991 ఎలక్షన్ కమిషన్ (సర్వీస్ కండీషన్స్ అండ్ కండక్ట్ ఆఫ్ బిజినెస్ ఆఫ్ ఎలక్షన్ కమిషనర్స్)యాక్ట్ ప్రకారం జరిగేది. కానీ ఈ చట్టంలో ఎంపిక ప్రక్రియను నిర్వచించలేదు.ఫలితంగా, ప్రధానమంత్రి, మంత్రి మండలి సలహా మేరకు రాష్ట్రపతి ఎన్నికల కమిషనర్లను నియమించేవారు.ఎన్నికల కమిషనర్ల సంఖ్యను ఎప్పటికప్పుడు నిర్ణయించే అధికారం రాష్ట్రపతికి ఉండేది. పాత చట్టం ప్రకారం, ఎన్నికల కమిషనర్ల జీతం సుప్రీంకోర్టు న్యాయమూర్తులతో సమానంగా ఉండేది.రాజ్యాంగంలోని ఆర్టికల్ 324(5) ప్రకారం, ప్రధాన ఎన్నికల కమిషనర్‌ను "సుప్రీంకోర్టు న్యాయమూర్తి మాదిరిగానే, అదే కారణాలతో" పదవి నుంచి తొలగించవచ్చు. 2023 చట్టంలోని సెక్షన్ 11(2) కింద ఇలాంటి నిబంధన ఉంది.

ఆర్టికల్ ప్రకారం, "ప్రధాన ఎన్నికల కమిషనర్ సిఫార్సుపై తప్ప మరే ఇతర ఎన్నికల కమిషనర్ లేదా ప్రాంతీయ కమిషనర్‌ను పదవి నుంచి తొలగించకూడదు"రాజకీయ ఒత్తిడి నుంచి ఎన్నికల కమిషన్‌ను రక్షించడానికి, ప్రధాన ఎన్నికల కమిషనర్‌ను తొలగించే ప్రక్రియను ఉద్దేశపూర్వకంగా చాలా కష్టతరం చేశారు. 2023లో సుప్రీంకోర్టు ఈ అంశాన్ని సమీక్షించింది, ఎన్నికల కమిషనర్లను తొలగించే ప్రక్రియను మార్చడానికి రాజ్యాంగ సవరణ అవసరమని పేర్కొంది.సుప్రీంకోర్టు న్యాయమూర్తిని తొలగించే విధానాన్ని నిర్దేశించిన రాజ్యాంగంలోని ఆర్టికల్ 124 (4) ప్రకారం, "దుష్ప్రవర్తన లేదా అసమర్థత నిరూపితమైతే" మాత్రమే సీఈసీని తొలగించడానికి చర్య తీసుకోవచ్చు.దుష్ప్రవర్తనలో అవినీతి పద్ధతులు లేదా పదవీ దుర్వినియోగం ఉండవచ్చు. ప్రధాన ఎన్నికల కమిషనర్ పదవికి తగని చర్యలు లేదా అధికారిక విధులను నిర్వర్తించడంలో స్పష్టమైన వైఫల్యాలు కూడా ఇందులో ఉన్నాయని కాలానుగుణంగా కోర్టులు పేర్కొన్నాయి.ప్రధాన ఎన్నికల కమిషనర్ తొలగింపు ప్రక్రియను ప్రారంభించడానికి, పార్లమెంటు ఉభయ సభల సభ్యులు దుష్ప్రవర్తన లేదా అసమర్థతను స్పష్టంగా ఆరోపించే తీర్మానాన్ని ప్రవేశపెట్టాలి.ప్రతిపాదన ఆమోదం పొందిన తర్వాత, ఆరోపణల చెల్లుబాటును తనిఖీ చేస్తారు. దీని కోసం ఒక కమిటీని ఏర్పాటు చేస్తారు.సీఈసీని తన పదవి నుంచి తొలగించడానికి, పార్లమెంటు ఉభయ సభలలో మూడింట రెండు వంతుల మెజారిటీతో తీర్మానాన్ని ఆమోదించాలి. ఆ తర్వాత, తొలగింపు ఉత్తర్వుకు రాష్ట్రపతి తుది ఆమోదం ఇవ్వాలి.ఆగస్టు 7న జరిగిన ప్రెస్ కాన్ఫరెన్స్‌లో భారత ఎన్నికల సంఘంపై ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ ఆరోపణలు చేశారు.బీజేపీ, ఎన్నికల సంఘం కలిసి 'ఓట్ల చోరీ'కి పనిచేస్తున్నాయని, 'బిహార్‌లో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ అనేది ఓట్లను దొంగిలించే ప్రయత్నం' అని రాహుల్ గాంధీ ఆరోపించారు.హరియాణా, మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో ఆశ్చర్యకరమైన ఫలితాలు వచ్చిన తర్వాత ఈ సందేహాలు మరింత బలపడ్డాయని ఆయన చెప్పారు.ఇది 'ప్రజాస్వామ్య వ్యతిరేక కుట్ర'గా విమర్శిస్తూ, ఆధారాలంటూ కొన్ని వివరాలు కూడా చూపించారు రాహుల్. దీనికి సంబంధించి కొన్ని ఉదాహరణలిచ్చారాయన. రాహుల్ గాంధీ తాను చెబుతున్నది నిజమని నమ్మితే అఫిడవిట్‌పై సంతకం చేసి, ఫిర్యాదు చేయాలని ఎలక్షన్ కమిషన్ సూచించింది. అంతేకాదు, రాహుల్ ఆరోపణలపై ఎలక్షన్ కమిషన్ మీడియా సమావేశం ఏర్పాటుచేసింది.బిహార్‌లో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్)పై ప్రతిపక్షాల ఆరోపణలు 'గందరగోళాన్ని వ్యాప్తి చేసే ప్రయత్నం' అని కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేష్ కుమార్ అన్నారు.స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్)ను రాజకీయ పార్టీల డిమాండ్ మేరకే మొదలుపెట్టామని ఎన్నికల సంఘం తెలిపింది.ఎస్ఐఆర్‌కి సంబంధించిన డాక్యుమెంట్లను రాజకీయ పార్టీలు నామినేట్ చేసిన బూత్ స్థాయి ఏజెంట్లు ధ్రువీకరిస్తారని జ్ఞానేష్ కుమార్ చెప్పారు.

# మార్వాడీ గో బ్యాక్.. ఉద్యమం దారెటు...

హైదరాబాద్, ఆగస్టు 22, తెలంగాణలో మార్వాడీ వ్యతిరేక ఆందోళనలు, దానిపై విస్తృత చర్చలు జరుగుతున్నాయి. మార్వాడీ వ్యాపారుల వల్ల గ్రామీణ తెలంగాణలోని చిరు వ్యాపారులు నష్టపోతున్నారంటూ కొందరు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.అదే సమయంలో ఈ ఆందోళన వ్యాపార పరిధిని దాటి రాజకీయ, మత పరమైన అంశంగా మారింది.ఈ క్రమంలో రంగారెడ్డి జిల్లా ఆమనగల్లు పట్టణ వ్యాపారులు బంద్ పిలుపునివ్వడం రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించగా, తరువాత వారు ఆ నిర్ణయాన్ని వెనక్కు తీసుకున్నారు. కొన్నేళ్లుగా సోషల్ మీడియాలో తెలుగునాట గ్రామీణ ప్రాంతాల్లో మార్వాడీ దుకాణాల పెరుగుదల గురించి చర్చ నడుస్తూ ఉండేది. గత మూడు-నాలుగు వారాలుగా అది తీవ్రమైంది.అదే సమయంలో సికింద్రాబాద్‌లో జరిగిన ఓ పార్కింగ్ వివాదంలో మార్వాడీ వ్యక్తులు స్థానికులను కొట్టారని పగిడిపల్లి శ్యాంసన్ అనే ఆందోళనకారుడు ఆరోపణలు చేయడం, పిడమర్తి రవి వంటి ఒకప్పటి తెలంగాణ విద్యార్థి ఉద్యమకారులు ఈ అంశంపై ప్రసంగాలు ఇవ్వడం, వీటికి సంబంధించిన వార్తలను సోషల్ మీడియా వేదికగా కొందరు షేర్ చేయడం.. మార్వాడీలను ఘాటుగా విమర్శిస్తూ గోరేటి రమేశ్ అని వ్యక్తి పాట విడుదల చేయడం.. ఇవన్నీ ఈ చర్చను పెంచాయి.ఆమనగల్లు వ్యాపారుల బంద్ ప్రకటనతో ఇది తారస్థాయికి చేరింది. కాంగ్రెస్, బీజేపీలూ దీనిపై స్పందించాయి. ఆ క్రమంలో అంతే దీటుగా ఈ ఆందోళనలకు వ్యతిరేకంగా, మార్వాడీలకు మద్దతుగా హిందుత్వవాదులు మాట్లాడడం ప్రారంభమైందిహిందుత్వ రాజకీయాలను వ్యతిరేకించే కొందరు మార్వాడీ వ్యతిరేక ఆందోళనలకు మద్దతిస్తున్నారు."స్టాకిస్ట్, డీలర్, రీటెయిలర్.. అన్నీ మార్వాడీలే అయ్యారు. స్థానిక వ్యాపారులు వారితో కష్టంలో, తెలివిలో పోటీ పడగలరు కానీ మోసంలో పడలేరు. సొంత ఊరి కస్టమర్లను మార్వాడీల్లాగా మోసం చేయలేరు. వారి వల్ల ఆర్థిక వ్యవస్థలే దెబ్బతింటున్నాయి" అంటూ మార్వాడీలపై తీవ్రమైన ఆరోపణలు చేశారు ఆమనగల్లు వ్యాపారుల సంఘం అధ్యక్షుడు తిరుపతయ్య.ఆమనగల్లు వ్యాపారుల సంఘం చేసిన ఆరోపణలను స్వతంత్రంగా పరిశీలించలేదు.ఆ ఆరోపణలను మార్వాడీ సంఘాల వారు ఖండించారు.దుకాణాల అద్దెల ధరలు కావాలనే బాగా ఎక్కువ చెల్లిస్తున్నారు. దీంతో చిన్న వ్యాపారులకు దుకాణాలు దొరక్క నష్టపోతున్నారు. స్థానిక వ్యాపారులపై కిరాయి, అద్దెల భారం పెరిగిపోతోంది.వెయ్యి జనాభా ఉండే పల్లెల్లో నాలుగైదు చిన్న చిన్న దుకాణాలు ఉండేచోట, వీరు భారీ హంగులతో షాపులు పెడుతున్నారు. అక్కడ మొదట్లో చవకగా వస్తువులు అమ్మి, ఇతరవ్యాపారులను దెబ్బతీస్తున్నారు. సప్లై చైన్ మొత్తం వారి వర్గమే ఉండడం వల్ల వారికి వస్తువులు తక్కువకు దొరుకుతాయి.

బ్రాండెడ్ లాగానే కనిపించే నకిలీ వస్తువులూ వారు అమ్ముతారు.భారీ ఆర్థిక వనరులతో వ్యాపారాలు ప్రారంభిస్తారు. తక్కువ వనరులతో ప్రారంభించిన చిన్నవ్యాపారులు ఆ పోటీ తట్టుకోలేరు. పద్మశాలీ, కోమటి వారి షాపులు మూతపడుతున్నాయి.అక్కడి పనిచేయడానికి స్థానికులను పెట్టుకోరు. ఫ్యాన్సీ, చెప్పులు, స్టీల్.. ఇలా అన్నిట్లో వారే వస్తున్నారు.కర్ణాటక ఉడుపి హోటెళ్లున్నాయి. ఇక్కడ తమిళనాడు వారు ముగ్గురు వ్యాపారం చేస్తున్నారు. వారెవరితోనూ మాకు సమస్య లేదు.అమంగల్ పట్టణ పరిధిలో 230 షాపులు స్థానికులు నిర్వహిస్తుంటే, 12 మార్వాడీలు నిర్వహిస్తున్నారు. కానీ ఆమనగల్లు చుట్టుపక్కల తలకొండపల్లిలో ఆరు షాపులు, చిన్న గ్రామం గట్టి పిలకల్‌లో 4 షాపులు, సంగ్రగనంలో 3 షాపులు, పడకల్‌లో 3 షాపులు, కేశంపేటలో 8 షాపులు మార్వాడీలు పెట్టారు. ఇవన్నీ 20 కి.మీ. పరిధిలోనే.ఈ ఆరోపణలతోనే తాము బంద్‌కు పిలుపునిచ్చామని ఆమనగల్లు వ్యాపారుల సంఘం తెలిపింది. కానీ అనూహ్యంగా రాష్ట్రవ్యాప్త మద్దతు రావడంతో వారు వెనక్కు తగ్గారు."మాకు ఎక్కడెక్కడి నుంచో అన్ని రంగాల వారూ ఫోన్లు చేసి మద్దతిచ్చారు. మీరు తగ్గొద్దు, మేం వచ్చి మద్దతిస్తాం అన్నారు. దీంతో ఇది రాజకీయ రంగు పులుముకుంది. నిజంగా అంతమంది ఆమనగల్లు వచ్చిన తరువాత ఏదైనా జరగకూడని ఘటన జరిగితే మా వ్యాపారులే నష్టపోతారు. అందుకే ప్రస్తుతానికి బంద్ వాయిదా వేశాం. కానీ మార్వాడీ వ్యాపారులపై మా పోరాటం కొనసాగుతుంది. ఇది హిందువులకు వ్యతిరేకం కాదు" అన్నారు తిరుపతయ్య. మార్వాడీ వ్యతిరేక ఆందోళనకారులు వెలిబుచ్చిన అభిప్రాయాల్లో ఒక విషయం ఉమ్మడిగా కనిపించింది. అది మార్వాడీలు పెద్ద నగరాలు, హోల్ సేల్ వ్యాపారాలు చేయడం కన్నా, చిన్న చిన్న పల్లెల్లో, రీటెయిల్ దుకాణాలు నడపడంపై చాలా మందికి అసంతృప్తి ఉందని తెలుస్తోంది.'హోల్‌సేల్ వ్యాపారాలు చేయవద్దనడం లేదు. కానీ రీటెయిల్ వ్యాపారాలు స్థానికులకు వదిలేయాలి. పల్లెటూరొచ్చి అక్కడ కూడా మేమే హిందీ మాట్లాడాలంటే ఎలా?" అంటూ ప్రశ్నించారు పిడమర్తి రవి."వీరి వల్ల తెలంగాణలో ఉత్పత్తి కులాలు దెబ్బతింటున్నాయి.

వారు నాసిరకం సరకు అమ్ముతున్నారు. తెలంగాణలో స్వర్ణకారుల ఆత్మహత్యలు జరుగుతున్నాయి. తెలంగాణ వ్యాపారులు దుకాణాల కోసం లక్ష అడ్వాన్స్ ఇస్తే వీరు అదే చోట 5 లక్షలు ఇచ్చి ఇతరులకు దుకాణం దక్కనివ్వకుండా చేస్తున్నారు. ఈ ఆందోళన తెలంగాణ ప్రజల ఐక్యత కోసం. తెలంగాణవారు ఇతర రాష్ట్రాలకు ఉపాధికి వెళ్లినా, వ్యాపారాలకు వెళ్లినా అక్కడ సాంస్కృతిక పెత్తనం చేయడం లేదు. అక్కడి స్థానికులను కొట్టడం లేదు. ఆధిపత్యం చెలాయించడం లేదు. మాది ఒకటే డిమాండ్ ఇక్కడ వ్యాపారాలు చేసేవారు 80 శాతం స్థానికులకు ఉపాధి కల్పించాలి" అని చెప్పారు పగిడిపల్లి శాంసన్."మార్వాడీలు ఇక్కడ 250 ఏళ్లకు పైబడి ఉంటున్నారు. వారు ఇక్కడి రాజుల ఆహ్వానం మేరకు వచ్చారు. ఈ మధ్య గ్రామీణ ప్రాంతంలో మార్కెట్ కాస్త నెమ్మదించడం వల్ల, రియల్ రంగం దెబ్బతిని డబ్బు సర్క్యులేషన్ తగ్గింది. దానికి కారణం కొత్తగా వచ్చిన వ్యాపారులే అని, వీరి వల్ల తమ వ్యాపారం తగ్గిపోతోందని మార్వాడీలపై వ్యతిరేకత పెంచుకోవడం కనిపిస్తోంది. కానీ ఇలాంటి దారుణమైన భాషతో పాట రాయడం సరికాదు. వారితో ఏదైనా సమస్య ఉంటే కూర్చుని మాట్లాడవచ్చు. కానీ గోబ్యాక్ నినాదం సరికాదు" అని హైదరాబాద్‌కు చెందిన న్యాయవాది జయ్ సోలంకి అన్నారు. ఆయన ఓ మార్వాడీ."ఇక్కడి నుంచి ఎవర్నీ వెళ్లిపొమ్మనడం లేదు. కానీ స్థానికులకూ ఉపాధి ఇవ్వమంటున్నాం" అన్నారు శాంసన్.తామిక్కడ తెలంగాణను సొంతం చేసుకుని, ఈ నేలతో మమేకం అయ్యామంటున్నారు మార్వాడీలు."మా కుటుంబం ఇక్కడకు వచ్చి 90 ఏళ్లైంది. మా నానమ్మ, నాన్న ఇక్కడే పుట్టారు. నేను, నా కొడుకు ఇక్కడే పుట్టాం. మేం ఈ సమాజానికి ఎంతో కంట్రిబ్యూట్ చేశాం. కానీ ఇప్పుడు మమ్మల్ని భయపెడుతున్నారు. ఇది ప్రమాదకరంగా మారుతుంది. గోబ్యాక్ అని మొదటిసారి వింటున్నాను. మేం దీన్ని మా సొంత ప్రాంతంగా భావించాం. మేం ఎప్పుడైనా రాజస్థాన్ వెళ్తే అక్కడ మమ్మల్ని హైదరాబాదీలనే అంటారు. కానీ ఇక్కడి తెలంగాణవారు మమ్మల్ని కాదు అంటున్నారు. మరి మేం ఎవరం?" అన్నారు జయ్.వ్యాపార పరంగా కూడా మార్వాడీలపై చేసిన ఆరోపణలను మార్వాడీ వ్యాపారులు ఖండిస్తున్నారు.'ఎక్కడైనా వ్యాపారం చేయడం రాజ్యాంగం ఇచ్చిన హక్కు. రాజస్థాన్‌లో నిర్మాణ రంగం నుంచి గుజరాత్‌లో వస్త్ర వ్యాపారం వరకూ తెలుగువారు, తెలంగాణవారు ఉన్నారు. ఇక్కడ మార్వాడీలు ఏళ్ల నుంచి ఉన్నారు. ఇక్కడి రెవెన్యూకి, జీడీపీకి మేం కంట్రిబ్యూట్ చేశాం. విదేశీ పెట్టుబడులను ఆహ్వానిస్తున్నప్పుడు, మార్వాడీ పెట్టుబడులు ఎందుకు వద్దు? ఇక్కడి భాష, సంస్కృతి మాకు తెలుసు. కానీ కొందరు నాయకులు తమ స్వార్థ రాజకీయాల కోసం సికింద్రాబాద్‌లో జరిగిన వ్యక్తిగత గొడవను మొత్తం వర్గానికి ఆపాదిస్తున్నారు" అని హైదరాబాద్ కిరాణ మర్చంట్స్ అసోసియేషన్ ఆనరరీ కార్యదర్శి, ఆల్ ట్రేడర్స్ అసోసియేషన్ కన్వీనర్ అవినాశ్ దేవ్డా అన్నారు."మేం ఈ రాష్ట్రవాసులుగా గర్విస్తాం. గుజరాత్, రాజస్థాన్‌లలో భూములు అమ్ముకుని ఇక్కడకు వచ్చి వ్యాపారం చేస్తున్నవారు ఉన్నారు. చాలా కష్టపడుతున్నారు. మేం కస్టమర్లతో బాగా మాట్లాడతామని నా తెలంగాణ స్నేహితులే నాకు చెప్పారు" అని చెప్పారు అవినాశ్"మార్వాడీలకు చెందిన అనేక కంపెనీలలో తెలంగాణ వారు పెద్ద సంఖ్యలో ఉపాధి పొందుతున్నారు. ఇక్కడకు మా కుటుంబం వచ్చి 108 ఏళ్లవుతోంది. మూడో తరం మాది. రాజకీయాల్లో ఎదగడం కోసం కొందరు ఇలా చేస్తున్నారు" అన్నారు అవినాశ్తెలుగునాట మార్వాడీలు అనగానే ఒకే కులం వారు అనే అభిప్రాయం ఎక్కువ మందిలో కనిపిస్తుంది. ప్రస్తుత రాజస్థాన్‌లోని మార్వార్ ప్రాంతానికి చెందిన వారినే మార్వారీ లేదా మార్వాడీ అంటారు. జోధ్‌పూర్, జైసల్మేర్, బికనేర్, అజ్మీర్ వంటి నగరాలలో విస్తరించిన ప్రదేశం ఇది. వీరు మాట్లాడే భాషను మార్వాడీ అంటారు. అది స్థూలంగా రాజస్థానీ భాషల సముదాయంలోకి వస్తుంది.ఈ ప్రాంతంలో అనేక కులాల వారు ఉంటారు. ప్రధానంగా హిందు, జైన మతాల వారు ఉంటారు. థార్ ఎడారి ఉండే ప్రాంతం ఇదే. మార్వాడీ అనే పదం కూడా ఎడారి ప్రాంతంలో ఉండేవారు అనే అర్థం నుంచి వచ్చింది.హిందూ రాజుల కాలంతో పాటు, మొఘలులు, బ్రిటిష్ వారి హయాంలో కూడా వారు అప్పటి రాజులతో మంచి సంబంధాలు నెరపుతూ భారత్ వ్యాప్తంగా వ్యాపార రంగంలో బాగా విస్తరించినట్టు కొందరు చరిత్రకారులు రాశారు.ఆ నగరాలతో పాటు హైదరాబాద్‌లో కుతుబ్ షాహీల కాలంలోనే మార్వాడీ-గుజరాతీ వ్యాపారులు ఉన్నట్టు అనేకమంది చరిత్రకారులు చెబుతున్నారు. హైదరాబాద్‌లోని బేగం బజార్, సుల్తాన్ బజార్, మోండా మార్కెట్, గోషా మహల్ వంటి చోట్ల వీరు కనిపిస్తారు.బంగారం, బట్టల వ్యాపారాల్లో వారు ఎక్కువగా కనిపించినా, తినుబండారాలు, రెస్టారెంట్లు, ఎలక్ట్రికల్, పెయింట్, సిమెంట్, శానిటరీ వంటి షాపుల్లోనూ వారి సంఖ్య క్రమంగా పెరుగుతోంది.వలస వచ్చిన మార్వాడీలలో ఎక్కువ మంది వ్యాపారులే కనిపించినా, ఇతర వృత్తుల వారు కూడా ఉంటారు. సంప్రదాయ వ్యాపార కులాలైన బనియా వంటి వారే కాక ఇతర కులాలకు చెందిన మార్వాడీలు కూడా వ్యాపారాల్లో కనిపిస్తారు.2011 జనాభా లెక్కల ప్రకారం, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 76,480 మంది మార్వారీ భాష మాట్లాడేవారు ఉన్నట్టు తెలుస్తోంది. దేశంలో మార్వారీలు దాదాపు 78 లక్షల మంది ఉండగా, వారిలో ఎక్కువ మంది రాజస్థాన్‌లోనే ఉంటారు. ఆ తరువాత అత్యధికంగా మహారాష్ట్ర, గుజరాత్, కర్ణాటక, ఆ తరువాత ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో వారు ఉన్నారు. దేశవ్యాప్తంగా మాట్లాడేవారి సంఖ్య ప్రకారం, మార్వారీ భాష 20వ స్థానంలో ఉంటుంది.జాతీయ రాజకీయ పార్టీలు కాంగ్రెస్, బీజేపీ రెండూ కూడా మార్వాడీలకు మద్దతుగా నిలిచాయి."మార్వాడీలు ఈ రాష్ట్రంలో భాగం. ఏళ్ల నుంచి ఉన్నారు.

ఎవరూ వారిని ఇక్కడ నుంచి వెళ్లగొట్టే పరిస్థితి ఉండదు. దాన్ని కాంగ్రెస్ పార్టీ సమర్థించదు" అని పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు.మార్వాడీలు సంపద సృష్టిస్తారు తప్ప ఎప్పుడూ దోచుకోలేదని కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు. మార్వాడీ గో బ్యాక్ నినాదం హిందూ సమాజాన్ని చీల్చే కుట్ర అని ఆరోపించారాయన. వారు వ్యాపారం చేసుకుంటే తప్పులేదని, వారు తెలంగాణ నుంచి ఎందుకు వెళ్లాలని ప్రశ్నించారు. రోహింజ్యాల గురించి, ముస్లిం వ్యాపారుల గురించి ఎవరూ ఎందుకు మాట్లాడరని ఆయన ప్రశ్నించారు"రోహింగ్యాల బాధ్యత ప్రభుత్వం, పోలీసులది. బంగ్లాదేశ్, బెంగాల్ దాటి వారు ఇక్కడ వరకూ వచ్చేదాకా ఎవరు చూశారు? ఎవరూ పాకిస్తాన్ వారిని, రోహింజ్యాలను స్వాగతించరు. మీ ప్రభుత్వమే ఉంది.

వారిని పంపించేయండి" అన్నారు రవి.



# షర్మిళకు దారేదీ...

కడప, ఆగస్టు 22, ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ చీఫ్ వైఎస్ షర్మిల పునరాలోచనలో పడ్డారా? కాంగ్రెస్ లో కొనసాగితే ఇక రాజకీయ భవిష్యత్ ఉండదని ఆమె ఒక క్లారిటీకి వచ్చినట్లు తెలిసింది. అందుకే అప్పుడప్పుడు అలా వచ్చి ఇలా వెళుతున్నారంటున్నారు. ఆంధ్రప్రదేశ్ లో ఎటు చూసినా కాంగ్రెస్ పార్టీకి రాజకీయ భవిష్యత్ లేదు. రాష్ట్ర విభజన జరిగిన తర్వాత ఆంధ్రప్రదేశ్ లో కాంగ్రెస్ కు దాదాపుగా నూకలు చెల్లినట్లే. అసలు ఓటు బ్యాంకు కూడా లేదు. కాంగ్రెస్ ఓటు బ్యాంకు మొత్తం వైసీపీ అధినేత జగన్ కొల్లగొట్టుకుని వెళ్లిపోయారు. ఆ ఓటు బ్యాంకును తిరిగి సాధించడం మాత్రం జరిగే పని కాదు. ఒకవైపు అనాలోచితంగా రాష్ట్ర విభజన చేసిన కాంగ్రెస్ ను క్షమించకూడదని ప్రజల్లో బలంగా సెంటిమెంట్ నాటుకుపోయింది. అదే సమయంలో జగన్ పార్టీకి దాదాపు పదేళ్ల నుంచి అలవాటుపడిపోయిన ఓటు బ్యాంకు తిరిగి కాంగ్రెస్ వైపునకు చూసే ఛాన్స్ లేదు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర విభజన చేసిన తర్వాత ఎన్ని మార్పులు చేసినా ఫలితం లేకుండా పోయింది. చివరకు వైఎస్ కుమార్తె అయిన షర్మిలను తెచ్చిపెడితే కనీసం కొన్ని సీట్లు అయినా రకపోతాయా? అని భావించి ఆమెకు పీసీసీ చీఫ్ పదవి ఇచ్చింది. అయితే గత ఎన్నికల్లో సేమ్ సీన్ రిపీట్ అయింది. షర్మిల కూడా పోటీ చేసి ఓటమి పాలు కావడంతో ఇక పార్టీ కేంద్ర నాయకత్వానికి కూడా ఆంధ్రప్రదేశ్ పై ఆశలు వదిలేసుకుంది. అందుకే పెద్దగా ఏపీ పాలిటిక్స్ ను పార్టీ నాయకత్వం పట్టించుకోవడం లేదని అంటున్నారు.ఎమ్మెల్యేలకు, కొందరు మంత్రులకు వార్నింగ్ కాంగ్రెస నాయకులు కూడా... రాహుల్ గాంధీ ఓటు చోరీ అంటూ దేశమంతా అన్ని రాష్ట్రాల పేర్లు ప్రస్తావిస్తున్నప్పటికీ ఏపీ పేరును ఎత్తకపోవడం ఇందుకు ఉదాహరణగా చూపుతున్నారు. మరొకవైపు వైఎస్ షర్మిల నాయకత్వంపై కూడా చాలా మంది నేతలలో ఉన్న అపోహలు తొలిగిపోయాయంటున్నారు. షర్మిల తన పదవిని అడ్డం పెట్టుకుని కేవలం తన సోదరుడు జగన్ పై విమర్శలు చేయడానికే ఎక్కువ సమయం కేటాయిస్తున్నారని, వ్యక్తిగత విభేదాలకే పెద్దపీట వేస్తున్నారని అంటున్నారు. అందుకే పార్టీలో సీనియర్ నేతలు హర్షకుమార్, చింతామోహన్ వంటి నేతలు కూటమి ప్రభుత్వంపై గళం విప్పాల్సి వస్తుందంటున్నారు. ఈ సమయంలో వైఎస్ షర్మిల వేరే దారి వెతుక్కోవాల్సిందేనా? అన్న అభిప్రాయం ఆమె అనుచరుల నుంచి వినిపిస్తుంది. కాంగ్రెస్ లో ఎన్నాళ్లున్నా ఇంతే పరిస్థితి అని వారు షర్మిలకు నచ్చచెప్పే ప్రయత్నం చేస్తున్నట్లు తెలిసింది. మరి వైఎస్ షర్మిల ఏం నిర్ణయం తీసుకుంటారన్నది ఆసక్తికరంగా మారింది.

# అరుణ చుట్టూ రాజకీయం

నెల్లూరు, ఆగస్టు 22, వైసీపీలో వైభోగం అనుభవించింది, కూటమి వచ్చాక పాత పరిచయాలతో రెచ్చిపోయింది. చివరకు జైలుకెళ్లింది. సింపుల్ గా ఇదీ అరుణ స్టోరీ. ఆమె జైలుకెళ్లడంపై రెండు పార్టీల నేతలు తీవ్ర వాదోపవాదాలు చేసుకుంటున్నారు. ఆమె వైసీపీ అంటే కాదు, టీడీపీ అంటున్నారు. మీ పార్టీ ఆమెను పెంచి పోషించిందంటే, మీ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ఆమె ఆటలు సాగాయంటూ ఒకరిపై ఒకరు నిందలు వేసుకుంటున్నారు. ఆమెకు సహకరించిన నేతలు మాత్రం తేలుకుట్టిన దొంగల్లా సైలెంట్ అయ్యారు. నిడిగుండ అరుణ సోషల్ మీడియా అకౌంట్లు చూస్తే మాత్రం ఆమె ఏ పార్టీనో, ఏ పార్టీకి మద్దతిస్తారో, ఏయే అధికారులతో ఫొటోలు దిగారనేది స్పష్టంగా తెలిసిపోతుంది. వైసీపీ హయాంలో వైభోగం.. నిడిగుండ అరుణ అలియాశ్ దిశ అరుణ.. వైసీపీ హయాంలో ఆమె తనను తాను దిశ వెల్ఫేర్ ప్రొటెక్షన్ ఫోర్స్ అధ్యక్షురాలిగా చెప్పుకునేది. అందుకే ఆమె దిశ అరుణ అయ్యారు. దిశ అరుణగా రాజకీయ నాయకులతో కలసి మెలసి తిరిగేది, వారి బర్త్ డే వేడుకలకు హాజరై కేక్ తినిపించేది. ఆ వీడియోలు, ఫొటోలన్నీ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ గా మారాయి. వైసీపీ ఆఫీస్ లో ఆమె పెట్టిన ప్రెస్ మీట్ వీడియోలు కూడా ఇప్పుడు వైరల్ గా మారాయి. వైసీపీ పార్టీ నేతగా అరుణ ప్రచారం చేసుకున్నారని, ఆ పార్టీ నేతలు కూడా ఆమెకు సహకరించారని టీడీపీ వెటకారం చేస్తోంది. అయితే ఇక్కడ వైసీపీకి తప్పించుకునే అవకాశం కూడా లేదు. ఫొటోలు, వీడియోలు, అన్నీ పగడ్బందీగా ఉండటంతో సోషల్ మీడియా దెబ్బకి వైసీపీ తేలు కుట్టిన దొంగలా మారింది. టీడీపీ సంగతేంటి..? వైసీపీ హయాంలో ఆమె తప్పులు చేసింది సరే, మరి కూటమి వచ్చాక అయినా ఆ తప్పులకు లెక్కలు చెప్పాలి కదా. కానీ ఇప్పుడు కూడా అదే జరిగింది. వాస్తవానికి అరుణ ప్రియుడు శ్రీకాంత్ పెరోల్ పై విడుదల కావడం మరింత సంచలనంగా మారింది. మీడియా హడావిడి వల్ల అసలు విషయం బయటకు పొక్కడంతో ప్రభుత్వం నష్టనివారణ చర్యలు తీసుకుంది. శ్రీకాంత్ పెరోల్ రద్దయింది, బెదిరింపుల కేసులో అరుణ అరెస్టై జైలుకెళ్లింది. అయితే ఈ పెరోల్ కోసం టీడీపీ ఎమ్మెల్యేలు కొందరు కృషి చేశారనే ఆరోపణలు పార్టీని ఇబ్బంది పెట్టాయి. తనకే సంబంధం లేదని, తన నియోజకవర్గానికి చెందిన వారు వస్తే పెరోల్ కోసం సిఫారసు చేశానని, అయినా తన లేఖ వల్ల పెరోల్ రాలేదంటూ గూడూరు ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ ప్రెస్ మీట్ పెట్టి మరీ వివరణ ఇచ్చారు. మరికొందరు నేతల పేర్లు వినపడుతున్నా వారు బయటకు రావడానికి జంకుతున్నారు. అంతా ఆ ఫోన్లలోనే.. అరెస్ట్ సమయంలో నిడిగుండ అరుణ నుంచి పోలీసులు రెండు ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఆ ఫోన్లలో అసలు వ్యవహారం అంతా ఉందని తెలుస్తోంది. పోలీస్ అధికారుల వ్యవహారాలు కూడా అందులో ఉన్నాయట. అదే సమయంలో రాజకీయ నాయకులతో ఆమె దిగిన ఫొటోలు, ఆడియో కాల్స్ రికార్డింగ్ లు కూడా ఉన్నాయని ప్రచారం జరుగుతోంది. ఇందులో నిజం ఎంతున్నా.. అందులోనీ సమాచారం అంతా బయటకు వస్తుందని ఆశించలేం. ఈ విషయంలో తలాపాపం తిలా పిడికెడు అన్నట్టుగా ఉంది వ్యవహారం. ఆమె బాధితులు అన్ని పార్టీల్లోనూ, చివరకు ప్రభుత్వ విభాగాల్లో కూడా ఉండటం విశేషం. సో అందరూ దొంగలే కాబట్టి, అందరూ సైలెంట్ గానే ఉన్నారు. ఈ వ్యవహారంలో ఒకరిపై ఒకరు దుమ్మెత్తి పోసుకోవడం మినహా ఇంకో అడుగు ముందుకు వేయడం లేదు.

# పాపం...కమ్మ నేతలు

విజయవాడ, ఆగస్టు 22 తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చి ఏడాది గడుస్తుంది. అయితే ప్రస్తుత మంత్రి వర్గంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అసంతృప్తిగా ఉన్నారు. ఇటీవల జరిగిన మంత్రివర్గ సమావేశంలో మంత్రులపై చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేసిన నేపథ్యంలో కొందరు నేతలు విస్తరణపై ఆశలు పెట్టుకున్నారు. సీనియర్ నేతలతో పాటు గుంటూరు, కృష్ణా జిల్లాకు చెందిన కమ్మ సామాజికవర్గం నేతలు కూడా తమ వంతు ప్రయత్నాలు చేస్తున్నారు. అయితే ఈ రెండు జిల్లాలకు చెందిన కమ్మ సామాజికవర్గానికి చెందిన నేతలకు కేబినెట్ లో ఐదేళ్లు అవకాశం దక్కే ఛాన్స్ లేదంటున్నారు. కమ్మ సామాజికవర్గానికి చెందిన వారు కావడమే మంత్రి వపదవి దక్కకపోవడానికి ప్రధాన కారణంగా చెప్పాలి.. ఇప్పటికే చంద్రబాబు నాయుడు మంత్రివర్గంలో ఐదు గురు కమ్మ సామజికవర్గం నేతలు ఉండటమే అందుకు కారణం. ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు మంత్రులుగా నారా లోకేశ్, నాదెండ్ల మనోహర్, పయ్యావుల కేశవ్, గొట్టిపాటి రవికుమార్ లు కేబినెట్ లో ఉన్నారు. ఇందులో నలుగురు టీడీపీకి చెందిన వారు కాగా, ఒక్కరు జనసేనకు చెందిన వారు. ఇప్పుడు మంత్రి వర్గ విస్తరణ జరిగినా చంద్రబాబును తప్పిస్తే మిగిలిన నలుగురిని కేబినెట్ నుంచి తప్పించే అవకాశాలు లేవనే చెప్పాలి. ఎందుకంటే వీరు యాక్టివ్ గా ఉండటంతో పాటు ప్రాంతాల వారీగా పట్టున్న నేతలు. రాయలసీమలో పయ్యావుల కేశవ్, గుంటూరు జిల్లాలో నాదెండ్ల మనోహర్, నారా లోకేశ్, ప్రకాశం జిల్లా నుంచి గొట్టిపాటి రవికుమార్ లు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఈ నలుగురిని తప్పించే అవకాశం లేకపోవడంతో గుంటూరు జిల్లా కమ్మ సామాజికవర్గం ఎమ్మెల్యేలు ఇక మంత్రి పదవిపై ఆశ వదులకోవాల్సిందే. గుంటూరు జిల్లాలో సీనియర్ నేతలు ధూళిపాళ్ల నరేంద్ర కుమార్, ప్రత్తిపాటి పుల్లారావు, యరపతినేని శ్రీనివాసరావు, ఎమ్మెల్సీగా ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ లాంటి వాళ్లున్నారు. గుంటూరు జిల్లాలో ఇప్పటికే నారా లోకేశ్, నాదెండ్ల మనోహర్ ఉండటంతో మరొకరికి మంత్రి పదవి దక్కే అవకాశం లేదు. అందుకే వీరిలో కొందరికి మాత్రం ఏదో ఒక కేబినెట్ ర్యాంక్ పదవి దక్కే అవకాశాలున్నాయంటున్నారు. గుంటూరు జిల్లాకు చెందిన కమ్మ సామాజికవర్గం ఎమ్మెల్యేలు మాత్రం ఈ దఫా కేబినెట్ లో చోటు దక్కడం కష్టంగానే ఉంది. ఇక కృష్ణా జిల్లాలో కమ్మ సామాజికవర్గం నేతలున్నప్పటికీ వారిలో పెద్దగా సీనియర్లు లేకపోవడం కొంత కలసి వచ్చే అంశమే. గుడివాడ, గన్నవరం ఎమ్మెల్యేలు తొలిసారి ఎమ్మెల్యేగా గెలిచిన వారే. మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్ ఒకరకంగా సీనియర్ అనే చెప్పుకోవాలి. రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. ఇక బీజేపీ నుంచి కైకలూరు ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్, సుజనా చౌదరి కూడా ఆ సామాజికవర్గమే అయినా బీజేపీ కేంద్ర నాయకత్వం విస్తరణలో వీరిద్దరికీ చోటు కల్పిస్తుందని చెప్పలేని పరిస్థితి. ఇందులో కామినేని సీనియర్. సుజనా చౌదరి తొలిసారి ఎమ్మెల్యే అయ్యారు. కృష్ణా జిల్లాలో బీసీ వర్గానికి చెందిన కొల్లు రవీంద్ర, కొలుసు పార్థసారథి కూడాఉండటంతోకూటమిలోనికమ్మ సామాజిక వర్గం నేతలకు కేబినెట్ లో చోటు దక్కే ఛాన్స్ లేదు.

# వార్నింగ్ లతో దారికొచ్చేనా

విజయవాడ, ఆగస్టు 22, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కసి మీద ఉన్నారు. పార్టీ నేతల మధ్య విభేదాలను తొలగించేందుకు ఆయన నేరుగా రంగంలోకి దిగుతున్నారు. వచ్చే ఏడాది స్థానిక సంస్థల ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో నేతల మధ్య తగాదాలను పరిష్కరించాలన్న భావనలో ఉన్నారు. నేతల మధ్య తలెత్తుతున్న విభేదాలు చివరకు పార్టీ ఉనికికే ప్రశ్నార్థకంగా మారనున్నాయి. క్యాడర్ కూడా రెండుగా విడిపోవడం వల్ల ప్రత్యర్థులు లాభపడతారు. ఆ అవకాశం ఇవ్వకూడదన్న విషయం చంద్రబాబుకు తెలియంది కాదు. అందుకే ఎక్కడ ఏ చిన్న వివాదం తలెత్తినా ఆయన నేరుగా ఎంట్రీ ఇచ్చి విభేదాలను పరిష్కరించేందుకు సిద్ధమవుతున్నారు. నివేదికలు కోరుతున్నారు. అనంతపురం అర్బన్ నియోజకవర్గంలో... అనంతపురం అర్బన్ నియోజకవర్గంలో అక్కడ ప్రభాకర్ చౌదరికి, ఎమ్మెల్యే దగ్గుబాటి ప్రసాద్ కు మధ్య విభేదాలు తీవ్రమయ్యాయి. సీటు దక్కకపోయినా తాను దగ్గుబాటి ప్రసాద్ విజయం కోసం పనిచేసినా గెలిచిన తర్వాత తన అనుచరులను అణగదొక్కుతున్నారన్న అభిప్రాయం ప్రభాక్ చౌదరిలో ఉంది. అదేసమయంలో ఆయన జూనియర్ ఎన్టీఆర్ సినిమాపై చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ గా మారి పార్టీకి ఇబ్బందికరంగా మారాయి. రాష్ట్రంలోని జూనియర్ ఎన్టీఆర్ అభిమానులంతా ఏకమై అనంతపురం ఎమ్మెల్యే నివాసం ఎదుట ఆందోళనకు దిగారు. దీని వెనక ప్రభాకర్ చౌదరి ఉన్నారంటూ దగ్గుబాటి ప్రసాద్ ఆరోపించారు. ఈ నేపథ్యంలోనే ఇద్దరినీ పిలిచి చంద్రబాబు నాయుడు క్లాస్ పీకినట్లు తెలిసింది. ...ఎమ్మెల్యేలకు, కొందరు మంత్రులకు వార్నింగ్ కూన రవికుమార్ విషయంలోనూ... ఇక శ్రీకాకుళం జిల్లా ఆముదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ కూడా వివాదాల్లో చిక్కుకుంటున్నారు. ఆయనకు అక్కడ మంత్రి అచ్చెన్నాయుడుకు మధ్య పొసగడం లేదు. అదే సమయంలో తాజాగా ఒక ప్రిన్సిపల్ బదిలీ వివాదంలో కూన రవికుమార్ చిక్కకున్నారు. ప్రిన్సిపల్ ఆత్మహత్యాయత్నం చేయడంతో అది పార్టీకి ఇబ్బందికరంగా మారింది. కూన రవికుమార్ కొంత దూకుడుగా ఉంటారు. ఇసుక దందాలు, కేజీబీవీ ప్రిన్సిపల్ సౌమ్య వివాదంతో ఆయన పార్టీని ఇబ్బందుల పాటు చేస్తున్నారు. మంత్రి పదవి ఆశించిన కూన రవికుమార్ కు కనీసం కేబినెట్ ర్యాంక్ పదవి దక్కకపోవడంతో ఆయన అసహనంతో ఉన్నారు. ఈ నేపథ్యంలో కూన రవికుమార్ నుంచి కూడా చంద్రబాబు నివేదికను కోరినట్లు తెలిసింది. దీనిపై త్వరలో కూనను పిలిచి చంద్రబాబు మాట్లాడతారని తెలిసింది.

చదవకుండా సంతకాలు పెట్టేస్తారా

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మంత్రి వర్గ సమావేశంలో మంత్రుల పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఫైళ్లను పరిశీలించి దానిపై సంతకం చేయాలని అన్నారు. అధికారులు మాటగా కాకుండా లోతుగా అధ్యయనం చేయాలని, ఫైలు పూర్వాపరాలను కూడా తెలుసుకుని క్లియర్ చేయడం మంచిదని సూచించినట్లు తెలిసింది. అలాగే తమకు ఇన్ ఛార్జి పదవి అప్పగించిన జిల్లాల్లో ఎమ్మెల్యేల పనితీరును కూడా గమనించాలని ఆయన కోరినట్లు తెలిసింది. కొందరు ఎమ్మెల్యేల వ్యవహార శైలి పార్టీకి, ప్రభుత్వానికి తలనొప్పిగా తయారైందని, వారిని కంట్రోల్ చేసే బాధ్యత మంత్రులు తీసుకోవాలని సూచించినట్లు సమాచారం. ప్రధానంగా ఎమ్మెల్యేలు తీరు మార్చుకోకుంటే తానే స్వయంగా జోక్యం చేసుకోక తప్పదని హెచ్చరించినట్లు తెలిసింది. తప్పు చేసిన వారు ఎవరైనా వదిలేది లేదని, వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని చెప్పారు. చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎమ్మెల్యేలు తమ పనితీరును మెరుగుపర్చుకోవాలని, జనంలో ఉండాలని, అంతే తప్ప నిత్యం వివాదాల్లో కాదన్న విషయం గుర్తుంచుకోవాలని చంద్రబాబు అభిప్రాయపడ్డారు. ఏమాత్రం నిర్లక్ష్యంగా ఉన్న విపక్షాలు జనంలోకి తీసుకెళ్లి పార్టీతో ప్రభుత్వం కూడా అభాసుపాలు జేసేలా వ్యవహరిస్తారని చంద్రబాబు అన్నారు. అలాగే మహిళల పట్ల కూడా జాగ్రత్తగా ఉండాలని, ప్రభుత్వ సిబ్బంది, అధికారుల పట్ల మర్యాదపూర్వకంగానే వ్యవహరించాలని, ఏదైనా తప్పు జరిగితే అది ఎత్తి చూపే అవకాశం వేరే మార్గాల ద్వారా ఉంటుందని ఆయన అభిప్రాయపడినట్లు తెలిసింది. సోషల్ మీడియా ప్రజల్లోకి విస్తృతంగా వెళుతున్న ఈ సమయంలో ఏ మాత్రం అజాగ్రత్తగా వ్యవహరించినా నష్టం వాటిల్లేది వ్యక్తిగతంగా మాత్రమే కాదని, కూటమి ప్రభుత్వానికి అని గుర్తుంచుకోవాలని చంద్రబాబు సీరియస్ గా వార్నింగ్ ఇచ్చినట్లు తెలిసింది. రోడ్డు మీదకువచ్చి దాడులు చేసే సంస్కృతి ఏంటని ఆయన అభిప్రాయపడినట్లు సమాచారం. ఎమ్మెల్యేలు తమ పనితీరు మార్చుకోకుంటే చర్యలు తప్పవని,పార్టీ పరంగా కాకుండా భవిష్యత్ లో వారికి రాజకీయం చేసేందుకు కూడా అవకాశం ఉండదని ఒకింత గట్టిగానే చంద్రబాబు నాయుడు హెచ్చరించినట్లు చెబుతున్నారు. మొత్తం మీద మంత్రి వర్గ సమావేశంలో చంద్రబాబు లైన్ దాటుతున్న ఎమ్మెల్యేలకు వార్నింగ్ ఇచ్చారన్నది పార్టీ వర్గాల నుంచి అందుతున్న సమాచారం

# ఎన్డీయేకు జగన్ మద్దతు



విజయవాడ, ఆగస్టు 22, రాజకీయాల్లో ప్రత్యర్థి ఎవరో తెలుసుకోకపోతే మొదటికే మోసం వస్తుంది. వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఇప్పుడు తన ప్రత్యర్థి ఎవరో తేల్చుకోలేకపోతున్నారు. ఏపీలో అధికారంలో ఉన్న కూటమికి ఢిల్లీలో మద్దతు పలికారు. ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో తాము బీజేపీ అభ్యర్థికే మద్దతు ఇస్తామని ఆ పార్టీ నేత బొత్స సత్యనారాయణ ప్రకటించారు. నెంబర్ గేమ్ ఉండొద్దన్నది తమ విధానమని అందుకే గతంలో ప్రణబ్ ముఖర్జీకి కూడా మద్దతిచ్చామని ఇప్పుడు బీజేపీకి మద్దతిస్తామని ప్రకటించారు. బొత్స ప్రకటన వైసీపీ వర్గాలను సైతం తీవ్రంగా నిరాశపరిచిందని చెప్పుకోవచ్చు.గత ఎన్నికల్లో జగన్ ఎవరి చేతిలో ఓడిపోయారు ?. ఎన్డీఏ చేతిలో ఓడిపోయారు. బీజేపీ నేతలు రాష్ట్రానికి వచ్చి జగన్ పై తీవ్ర విమర్శలు చేశారు. అవినీతి ఆరోపణలు చేశారు. చివరికి మూడు పార్టీల కూటమి ఆయనకు ప్రతిపక్ష నేత హోదా కూడా లేకుండా ఓడించింది. అయినా ఇప్పుడు ఎన్డీఏకే ఢిల్లీలో మద్దతు ప్రకటించారు. పోనీ ఇప్పుడు కాకపోతే తర్వాత అయినా బీజేపీతో పొత్తులు పెట్టుకునే అవకాశాలు ఉన్నాయా అంటే అలాంటి చాన్సే లేదని రాజకీయ సమీకరణాలను బట్టి అర్థం చేసుకోవచ్చు. జగన్ మోహన్ రెడ్డి ఓటు బ్యాంకు దళితులు, ముస్లింలు.. అంటే పూర్తిగా కాంగ్రెస్ ఓటు బ్యాంక్.ఆయన బీజేపీతో పొత్తులు పెట్టుకున్న మరుక్షణం ఆయన ఓటు బ్యాంక్ ఆయనకు దూరమైపోతుంది. అది రాజకీయంగా ఆత్మహత్యాసదృశం అవుతుంది. అందుకే గత ఎన్నికలకు ముందు బీజేపీతో పొత్తులు పెట్టుకోకుండా ఉండేందుకు జగన్ ఎన్ని ప్రయత్నాలు చేసినా బీజేపీ పట్టించుకోలేదని చెబుతారు. ఎప్పుడూ పొత్తులు పెట్టుకోలేనప్పుడు.. ఇప్పుడు మద్దతు ఇవ్వడం ఎందుకన్న ప్రశ్న సహజంగానే వస్తుంది. జగన్మోహన్ రెడ్డి తీవ్రమైన అవినీతి ఆరోపణల్లో ఇరుక్కున్నారు. ఆయనపై ఉన్న సీబీఐ కేసులకు తోడు లిక్కర్ స్కాం సహా పలు కేసులు మెడకు చుట్టుకునే అవకాశాలు ఉన్నాయి. వివేకానందరెడ్డి హత్య కేసులో తదుపరి దర్యాప్తునకు సుప్రీంకోర్టు అనుమతి ఇస్తే..అది కూడా ఆయనకు చిక్కులు తెచ్చి పెడుతుదని చెబుతున్నారు. ఇలాంటి సమయంలో ఆయన బీజేపీకి మద్దతు పలకడం.. పూర్తిగా భయంతోనేనని.. కేసుల భయంతోనేనని ప్రజలు అనుకునే పరిస్థితి ఏర్పడింది. ఎంత ప్రాంతీయ పార్టీ అయినా జాతీయ స్థాయిలో ఓ వ్యూహం ఉండాలి. గత ఎన్నికల్లో ఓడిపోయిన తర్వాత జగన్ తమ పార్టీ వారిపై దాడులు జరుగుతున్నాయని ఢిల్లీలో ధర్నా చేశారు. ఆ సమయంలో కాంగ్రెస్ పార్టీ తప్ప ఇండీ కూటమి నేతలంతా వచ్చి సపోర్టు చేశారు. ఇక జగన్ తమ కూటమితో కలిసి వస్తారని వారు అనుకున్నారు. కానీ జగన్ మాత్రం వారి నమ్మకాన్ని వమ్ము చేశారు. తమను ఓడించిన బీజేపీకే మద్దతుగా ఉండటంతో ఇక వారు జగన్ ను పట్టించుకునే పరిస్థితి లేదు. ఇప్పుడు జగన్ ఢిల్లీకి వెళ్లి ఏపీలో ఏదో జరుగుతోందని చెప్పుకుందామన్నా ఎవరూ వినేవారు లేరు. ప్రచారం జరుగుతున్నట్లుగా లిక్కర్ స్కాంలో ఆయనను అరెస్టు చేస్తే.. ఖండించేందుకు ఒక్క జాతీయ స్థాయి నాయకుడు కూడా సిద్దం కాకపోవచ్చు. జగన్ బీజేపీకి భయపడి చేస్తున్న రాజకీయాల వల్ల ఆయన పూర్తి స్థాయిలో రాజకీయంగా నష్టపోతున్నారన్న అభిప్రాయం వినిపిస్తోంది.

# డ్రోన్లతో ఆటకట్టిస్తున్నారు...

విశాఖపట్టణం, ఆగస్టు 22, ఏపీ పోలీసులు దూకుడుగా వ్యవహరిస్తున్నారు. కేసులను ఛేదించడంలో టెక్నాలజీని వాడుకుంటున్నారు. ముఖ్యంగా డ్రోన్ల సహకారంతో నేరస్తుల గుండెల్లో రైళ్లు పరిగెత్తిస్తున్నారు. డ్రగ్స్, గంజాయి సహా పలు నేరాలను అరికట్టడానికి పోలీసులు డ్రోన్లను ఉపయోగిస్తున్నారు. డ్రోన్లతో నేరాలు సైతం తగ్గుముఖం పడుతుండడం విశేషం. తాజాగా చిత్తూరు జిల్లాలో పోలీసులు డ్రోన్ల సాయంతో అంతర్ జిల్లా జూద ముఠా ఆట కట్టించారు. పొదల్లో పేకాట ఆడుతున్న వారిని డ్రోన్ల సాయంతో పట్టుకున్నారు. వారి నుంచి భారీగా నగదు, సెల్ ఫోన్ లను స్వాధీనం చేసుకున్నారు. చిత్తూరు జిల్లా ముసలి పేడు పొలాల్లో గుంపుగా కొంతమంది పేకాట ఆడుతున్నారు. దీనిపై సమాచారం రావడంతో పదిమంది పోలీసులు డ్రోన్ల సాయంతో వెతుకులాట ప్రారంభించారు. ఓ పొలం సమీపంలోని పొదల్లో ఎవరికీ కనిపించకుండా వారు పేకాట ఆడుతున్నారు. ఆ లోపలికి వెళ్లిన డ్రోన్.. అక్కడ పదుల సంఖ్యలో మనుషులు పేకాట ఆడుతున్నట్లు గుర్తించింది. పోలీసులకు సమాచారం రావడంతో ఆ పొదల్లోకి వెళ్లి రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు. తిరుపతికి చెందిన ఇద్దరు, కడప జిల్లాకు చెందిన ఐదుగురు, రాజంపేటకు చెందిన ఇద్దరు, మరో ఇద్దరు స్థానికులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.2,36,740 నగదు తో పాటు 12 సెల్ ఫోన్లు, నాలుగు బైక్ లను స్వాధీనం చేసుకున్నారు. మరో 9 మంది పరారీలో ఉండడంతో వారి కోసం గాలిస్తున్నారు.కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత పోలీసుల చేతికి డ్రోన్ వచ్చింది. డ్రోన్ టెక్నాలజీని వాడుకొని నేరాలు, చట్ట వ్యతిరేక కార్యకలాపాలను పోలీసులు అరికడుతున్నారు. పట్టణంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో నిఘా పెంచారు. దొంగతనాలు, గంజాయి వినియోగం, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం, అసాంఘిక కార్యకలాపాలు జరిగే ప్రదేశాలను డ్రోన్ల ద్వారా గుర్తిస్తున్నారు. డ్రోన్ల సాయంతో పోలీసులు నేరాలను నియంత్రిస్తున్నారు. ఊరికి దూరంగా ఉండే ఖాళీ స్థలాలు, శిథిల భవనాల్లో గంజాయి తాగుతున్న వారిని పట్టుకుంటున్నారు. బహిరంగంగా మద్యం తాగే వారిని, అసాంఘిక శక్తులు గుమిగూ డే ప్రాంతాలను సైతం గుర్తించి వేగంగా అక్కడకు చేరుకుంటున్నారు. వారిని అదుపులోకి తీసుకోగలుగుతున్నారు.

విశాఖ జిల్లాలో మన్య ప్రాంతంలో విపరీతంగా గంజాయి సాగు అవుతోంది. దేశంలో ఎక్కడ గంజాయి పట్టుబడుతున్న దాని మూలాలు విశాఖను చూపిస్తున్నాయి. దీంతో డ్రోన్ల సాయంతో గంజాయి సాగుపై దృష్టి పెట్టారు పోలీసులు. మన్య ప్రాంతంలో గంజాయి సాగుతున్న ప్రాంతాలను గుర్తించి దహనం చేస్తున్నారు. అప్పటినుంచి పోలీస్ శాఖలో డ్రోన్ల వినియోగాన్ని మరింత పెంచాలని నిర్ణయించారు. జిల్లాల్లో ప్రధాన పోలీస్ స్టేషన్లకు ఇప్పటికే డ్రోన్లు అందించారు. మిగతా పోలీస్ స్టేషన్లకు సైతం అందించనున్నారు.

జాతరలతో పాటు పండగ సమయాల్లో కూడా డ్రోన్లు ఎగురవేసి నిరంతర నిఘ పెడుతున్నారు. కోడిపందాలు, జూద మాటలు లేకుండా నియంత్రిస్తున్నారు.

# జిల్లాల పర్యటనకు జనసేనాని

విశాఖపట్టణం, ఆగస్టు 22, జనసేన పార్టీ ఈ నెల 30వ తేదీన విశాఖపట్నంలో పార్టీ కార్యకర్తల సమావేశం పెడుతుంది. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఈ సమావేశానికి హాజరవుతారు. అయితే విశాఖపట్నం నుంచి ఇక కార్యకర్తల్లో జోష్ నింపేందుకు పవన్ కల్యాణ్ సిద్ధమయినట్లు కనిపిస్తుంది. రాష్ట్రంలో నెలకొన్న రాజకీయ పరిణామాలతో పాటు కూటమిపైన తన పట్టు నిలుపుకునే ప్రయత్నంలో భాగంగానే ఆయన వరసగా కార్యకర్తల సమావేశాలు పెట్టాలని నిర్ణయించుకున్నట్లు తెలిసింది. కూటమి ప్రభుత్వం ఏర్పాటయి ఏడాది పూర్తయిన తర్వాత సరైన పదవులు రాకపోవడంతో పాటు, కూటమిలోని ఇతర పార్టీల నేతల నుంచి సహకారం అందడం లేదని కార్యకర్తలు కొంత అసంతృప్తితో ఉన్నారు.. ఈ సమయంలో క్యాడర్ లో జోష్ నింపేందుకు పవన్ కల్యాణ్ జిల్లాల పర్యటనలు పెట్టుకున్నట్లు తెలిసింది. త్వరలోనే స్థానిక సంస్థల ఎన్నికలు కూడా జరగనున్నాయి. వచ్చే ఏడాది స్థానిక సంస్థల ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఈసారి ఎక్కువ స్థానాల్లో పోటీ చేసేందుకు పవన్ కల్యాణ్ కార్యకర్తలను ముందుగా ప్రిపేర్ చేయడానికి ఈ కార్యక్రమం భుజానకెత్తుకున్నట్లు తెలిసింది. ప్రతి జిల్లాలో కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేసి వారికి సరైన భరోసా ఇవ్వడంతో పాటు భవిష్యత్ లో తన ప్రణాళిక ఏంటన్నది కూడా పవన్ వివరించే అవకాశముందని తెలుస్తుంది. దీనివల్ల పార్టీకి, క్యాడర్ కు మధ్య ఉన్న గ్యాప్ తొలిగిపోతుందని ఆయన భావిస్తున్నారు.ఎమ్మెల్యేలకు, కొందరు మంత్రులకు వార్నింగ్ ఎందుకు సర్దుకుపోతున్నానని... నిజానికి వచ్చే నెల నుంచి పవన్ కల్యాణ్ జిల్లాల పర్యటన చేయాలని నిర్ణయించారు. క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతం చేయడానికి జిల్లాల పర్యటనను సెప్టంబరు నుంచి చేస్తానని ఇటీవల మీడియాకు తెలిపారు. అందులో భాగంగానే ఈ నెలాఖరులోనే ఆయన విశాఖ జిల్లా కార్యకర్తల సమావేశానికి హాజరు కానున్నారు. కూటమి ప్రభుత్వంలో పవన్ కల్యాణ్ ఇప్పటికే సర్దుకుపోతున్నారన్న అభిప్రాయం కలిగింది. అయితే తాను ఎందుకు సర్దుకుపోతున్నానో కార్యకర్తలకు వివరించే అవకాశముంది. అలాగే జిల్లాలో టీడీపీ నేతలు సహరించకపోతే పార్టీ నాయకత్వానికి తెలియచేయడానికి ఒక నాయకుడిని కూడా నియమించే ఆలోచనను పవన్ కల్యాణ్ చేస్తున్నట్లు సమాచారం. మొత్తం మీద పవన్ కల్యాణ్ జిల్లాల పర్యటన విశాఖ తో ప్రారంభమయినట్లేనని అంటున్నారు.

## నిరాశ్రయులకు చపాతీలు పంపిణీ.......

బ్రహ్మంగారిమఠం మైదుకూరు పరిధిలో బస్టాండు ఆలయాల వద్ద ఆకలితో అలమటిస్తున్న వృద్ధులు నిరాశ్రయులు, బాటసారులకు నేస్తం సేవా సంస్థ ఆధ్వర్యంలో గురువారం రాత్రి 50 చపాతీలు ,వాటర్ బాటిల్స్ అందించి వారి ఆకలి తీర్చడం జరిగింది. కార్యక్రమానికి దాత. మైదుకూరు కు చెందిన సాయికుమార్ శ్రీమతి సంధ్యారాణి కుమారుడు పిండి జెశ్విన్ పుట్టినరోజు సందర్భంగా సహాయ సహకారాలు అందించారు.ఈ కార్యక్రమంలో కె. కొండారెడ్డి, వి.ఉపేంద్ర కుమార్,తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీవో మల్లిబాబుకు అస్వస్థత ఆసుపత్రికి తరలింపు

పెద్దాపురం శనివారం నాడు జరిగనున్న సీఎం చంద్రబాబు పెద్దాపురం పర్యటన సందర్భంగా ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న కాకినాడ ఆర్డిఓ మల్లిబాబు అస్వస్థత గురయ్యారు. సామర్లకోట బహిరంగ సభ ఏర్పాట్లను పర్యవేక్షిస్తుండగా అయన కళ్ళు తిరిగిపోకపోయారు. సామర్లకోట రెవిన్యూ సిబ్బంది హుటాహుటిన ఆర్డీవో మల్లిబాబును సామర్లకోట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సామర్లకోట హాస్పటల్లో ఆర్డిఓ మల్లి బాబుకు చికిత్స అందిస్తున్నారు.

# తెలంగాణలో త్వరలో హెలీ టూరిజం

## హెలీ టూరిజం కాన్సెప్ట్ దిశగా తొలి అడుగు
## హైదరాబాద్ - సోమశిల - శ్రీశైలం మధ్య సేవలు
## ప్రతిపాదనలు రూపొందిస్తున్నాం: పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు
## సోమశిల, నల్లమల, అమరగిరి ఐలాండ్, ఈగలపెంట ప్రాంతాల్లో వెల్‌నెస్ & స్పిరిచువల్ రిట్రీట్ ప్రాజెక్ట్ కు మంత్రి జూపల్లి కృష్ణారావు శంకుస్థాపన
## రూ.68.10 కోట్ల అంచనా వ్యయంతో అభివృద్ధి పనులు

త్వరలోనే తెలంగాణలో హెలీ టూరిజాన్ని అభివృద్ధి చేయనున్నట్లు పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. పర్యాటకులను విశేషంగా ఆకర్షించే విధంగా హెలీ టూరిజం నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. గగనతలంలో కొద్దిసేపు విహరింపజేసి పర్యాటకులకు అహ్లాదాన్ని, అనుభూతిని కల్పించేందుకు హెలీ టూరిజం నిర్వహించాలని నిర్ణయించినట్లు చెప్పారు. ఇందులో భాగంగా ఈజ్ మై ట్రిప్ సంస్థ సహకారంతో హైదరాబాద్ నుంచి సోమశిల అక్కడి నుంచి శ్రీశైలం మీదుగా హైదరాబాద్ కు హెలి టూరిజం నిర్వహణకు ప్రతిపాదనలు రూపొందిస్తున్నట్లు వెల్లడించారు. దీని వల్ల మన పర్యాటక రంగం కూడా కొత్తమలుపు తిరుగుతుందని, దీనికి సంబంధించిన వివరాలను త్వరలోనే వెల్లడిస్తామని ప్రకటించారు.

రూ. 68.10 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న సోమశిల వెల్‌నెస్, స్పిరిచ్యువల్ రిట్రీట్ నల్లమల ప్రాజెక్టు అభివృద్ధి పనులకు పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు శుక్రవారం శ్రీకారం చుట్టారు. కొల్లాపూర్ నియోజకవర్గంలో అమరగిరిలో రూ. 45.84 కోట్ల వ్యయంతో అమరగిరి ఐలాండ్ వెల్‌నెస్ రిట్రీట్ నిర్మాణ పనులు, రూ. 1.60 కోట్లతో సోమశిల విఐపీ ఘాట్ %-% బోటింగ్ పాయింట్ కోసం ట్రెంచింగ్ పనులకు మంత్రి జూపల్లి భూమిపూజ చేశారు.

ఈ సందర్భంగా మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ%ో% పర్యాటక ఆతిథ్యానికి తెలంగాణ అత్యంత ప్రాధాన్యత ఇస్తోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో రాష్ట్రంలో పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం అనేక పర్యాటక ప్రాజెక్ట్ లు చేపడుతోంది. టూరిజం అభివృద్ధికి తెలంగాణలో అనుకూల పరిస్థితులు ఉన్నప్పటికీ గత పదేండ్లలో టూరిజం నిర్లక్ష్యానికి గురైంది. స్వదేశీ, విదేశీ పర్యాటకుల సంఖ్యను పెంచాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.

విదేశీ పర్యాటకుల సంఖ్యను పెంచేందుకు మౌలిక వసతుల కల్పనతో పాటు విస్తృత ప్రచారం నిర్వహిస్తాం. తద్వారా ఉద్యోగ కల్పనతోపాటు ఆయా ప్రాంతాల్లో మౌలిక వసతులు మెరుగవుతాయి. వాటర్ స్పోర్ట్స్, అడ్వెంచర్ టూరిజానికి పెద్దపీట వేస్తాం.

అమరగిరి ఐలాండ్ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసుకోవడం సంతోషంగా ఉంది. ఏడాది లోగా పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటాం.

నీటి ప్రవాహం తగిన, పర్యాటకులను ఐలాండ్ తీసుకువచ్చేలా ఫ్లోటింగ్ జెట్టి ఏర్పాటు చేస్తున్నాం. కొత్త పర్యాటక ప్రాజెక్ట్ ల అభివృద్ధి వల్ల పర్యాటకుల సందర్శన మరింత పెరగనుంది. నల్లమల్ల అడవుల మధ్యలో కృష్ణా నది ఒడ్డున ఉన్న సోమశిల, అమరగిరి అందాలను చూసేందుకు పర్యాటకులు పెద్ద సంఖ్యలో వస్తారు. టూరిజం ప్రాజెక్టుల అభివృద్ధి వల్ల రాష్ట్ర ఆదాయం పెరుగుతుందని, ఉపాధి అవకాశాలు మరింత పెరుగుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

సోమశిల- సిద్దేశ్వరం ఐకానిక్ బ్రిడ్జి నిర్మాణం పూర్తైతే దూరాభారం తగ్గడంతో పాటు పర్యాటకుల సంఖ్య పెరుగుతుంది.

పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యాటక అభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని, తెలంగాణలో పర్యాటకంలో అగ్ర స్థానంలో నిలబెట్టడానికి కృషి చేస్తున్నారని అన్నారు. నల్లమల సర్క్యూట్ అభివృద్ధితో ఈ ప్రాంతం పర్యాటక హబ్ గా మారుతుందని చెప్పారు. పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఈ ప్రాంతంలో పర్యాటక అభివృద్ధికి ప్రత్యేక దృష్టి సారించారని తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ దామోదర్ రెడ్డి, కలెక్టర్ బదావత్ సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

ఏమేమి పనులు చేపట్టనున్నారంటే%ొ.

%అమరగిరి ఐలాండ్ వెల్‌నెస్ రిట్రీట్ రూ. 45.84 కోట్లు

యోగా డెక్, పావిలియన్, స్పా ఏరియా, కాటేజీలు, సిబ్బంది వసతి, స్విమ్మింగ్ పూల్, ఇండోర్ %ఐ% అవుట్‌డోర్ యాక్టివిటీస్, వ్యూయింగ్ డెక్, స్టోర్ రూమ్, జెట్టీ, ధ్యానాలయం, గార్డెనింగ్, %ూ%, నీటి పారుదల %ఐ% ఎలక్ట్రికల్ పనులు.

సోమశిల విఐపీ ఘాట్ రూ. 1.60 కోట్లు బోటింగ్ పాయింట్ కోసం ట్రెంచింగ్ పనులు

## యువతికి అసభ్యకర మెయిల్స్ పంపి వేధిస్తున్న వ్యక్తి అరెస్ట్
### మహిళల భద్రతకు పోలీసుల శాఖ అధిక ప్రాధాన్యత
### మందమర్రి సర్కిల్ ఇన్స్పెక్టర్ కె. శశిధర్ రెడ్డి



**ప్రజాబలం చెన్నూరు నియోజకవర్గ రిపోర్టర్ ఆగస్ట్ 22:** మందమర్రి పట్టణంలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగినిని నకిలీ ఈమెయిల్ ఐడి ద్వారా అసభ్యకర, అశ్లీల సందేశాలు పంపిస్తూ మానసికంగా వేధిస్తున్న ఒక వ్యక్తిని మందమర్రి పోలీసులు అరెస్ట్ చేశారు. మందమర్రి పట్టణానికి చెందిన ఒక యువతి, ప్రస్తుతం ఇంటి నుండి (వర్క్ ఫ్రమ్ హోమ్) సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నారు. ఆమెకు మార్చి 2025 నుండి, గుర్తు తెలియని వ్యక్తి ఒక నకిలీ ఈమెయిల్ ఐడి సృష్టించి, ఆమె స్నేహితులను ట్యాగ్ చేస్తూ, పదేపదే అసభ్యకరమైన మరియు అశ్లీలమైన సందేశాలు పంపుతూ తీవ్రంగా వేధించడం ప్రారంభించాడు. ఈ వేధింపులు రోజురోజుకు ఎక్కువవడంతో, బాధితురాలు తేది 07.06.2025 నాడు మందమర్రి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు, మందమర్రి ఎస్సై రాజశేఖర్ ఐటీ చట్టం కింద కేసు నమోదు చేశారు. అనంతరం, మందమర్రి సిఐ శశిధర్ రెడ్డి ఆధ్వర్యంలో ఒక ప్రత్యేక బృందం దర్యాప్తు చేపట్టింది. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి, నకిలీ ఈమెయిల్ ఐడి మూలాలను గుర్తించి, ఈ నేరానికి పాల్పడింది హైదరాబాద్‌కు చెందిన నెల్లి నిఖిల్ బాబు అని నిర్ధారించారు. శుక్రవారం నిందితుడిని హైదరాబాద్‌లో అదుపులోకి తీసుకుని మందమర్రికి తరలించామని. విచారణలో నిందితుడు తన నేరాన్ని అంగీకరించాడన్నారు. నేరానికి ఉపయోగించిన మొబైల్ ఫోన్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నామన్నారు.

సిఐ శశిధర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం, బాధితురాలు గతంలో హైదరాబాద్‌లో పనిచేస్తున్నప్పుడు నిందితుడు నిఖిల్ బాబు ఆమె సహోద్యోగి. అతను బాధితురాలిని ప్రేమిస్తున్నానని చెప్పగా, ఆమె తిరస్కరించింది. ఆ కోపంతో ఆమెపై పగ పెంచుకుని, ఆమె ప్రతిష్టకు భంగం కలిగించాలనే దురుద్దేశంతో ఈ నీచమైన చర్యకు పాల్పడ్డాడన్నారు. మహిళల భద్రతకు తెలంగాణ పోలీస్ శాఖ అధిక ప్రాధాన్యత ఇస్తుందని, ఆన్‌లైన్‌లో వేధించే వారిని ఎంతటివారైనా వదిలిపెట్టేది లేదని సిఐ శశిధర్ రెడ్డి హెచ్చరించారు. ఈ సంఘటన నేపథ్యంలో, సైబర్ నేరాల బారిన పడకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. మీ ఈమెయిల్ ఐడి, ఫోన్ నంబర్, వ్యక్తిగత ఫోటోలు మరియు ఇతర సున్నితమైన సమాచారాన్ని అపరిచితులతో లేదా నమ్మకం లేని వ్యక్తులతో పంచుకోవద్దన్నారు. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ వంటి సోషల్ మీడియా ఖాతాలలో మీ ప్రైవసీ సెట్టింగ్‌లను 'ఫ్రెండ్స్ ఓన్లీ' లేదా 'ప్రైవేట్'గా ఉంచుకోవాలన్నారు. మీ ఫ్రెండ్ లిస్ట్‌ను కూడా ఇతరులకు కనబడకుండా చూసుకోండన్నారు. మీ ఆన్‌లైన్ ఖాతాలన్నింటికీ ఊహించడానికి వీలు లేని, బలమైన పాస్‌వర్డ్‌లను ఉపయోగించండనీ. అన్ని ఖాతాలకు ఒకే పాస్‌వర్డ్ వాడరాదన్నారు. ఎవరైనా ఆన్‌లైన్‌లో మిమ్మల్ని వేధిస్తుంటే, వారికి తిరిగి సమాధానం ఇవ్వవద్దన్నారు. వారి సందేశాలకు స్పందించడం వల్ల వేధింపులు మరింత పెరిగే అవకాశం ఉందన్నారు. వేధింపులకు సంబంధించిన ఈమెయిల్స్, మెసేజ్‌లు, ఫోటోలు లేదా కామెంట్లను స్క్రీన్‌షాట్‌లు తీసి భద్రంగా దాచుకోండన్నారు. ఇవి పోలీసులకు ఫిర్యాదు చేయడానికి కీలకమైన సాక్ష్యాలుగా ఉపయోగపడతాయి.

మిమ్మల్ని వేధిస్తున్న వ్యక్తి యొక్క ఖాతాను వెంటనే బ్లాక్ చేయండి మరియు సంబంధిత సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌కు రిపోర్ట్ చేయండన్నారు. ఎటువంటి

## వైటీపీఎస్ నిర్వాసితులకు ఉద్యోగ నియామకపత్రాలు అందించిన మంత్రి కోమటిరెడ్డి

యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్ భూ నిర్వాసితుల ఉద్యోగ నియామక పత్రాల పంపిణీ కార్యక్రమంలో రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి పాల్గోన్నారు.మంత్రి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే కరెంట్ ఉండదని నాడు అబద్ధపు ప్రచారం చేశారు. గతంలో స్వయంగా నేను సబ్ స్టేషన్ వెళ్లి లాగ్ బుక్ లు చెక్ చేస్తే 12 గంటలు మాత్రమే ఇస్తున్నాం అని అన్నారు..కానీ 24 గంటలు అని గత ప్రభుత్వం ప్రచారం చేసుకుందని అన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఇప్పుడు 24 గంటల నాణ్యమైన కరెంట్ ఇస్తున్నాం.. వరి ధాన్యం ఉత్పత్తి లో తెలంగాణ నంబర్ వన్ గా నిలిచింది. ఈ థర్మల్ ప్రాజెక్ట్ లో తాతల కాలం నుండి వచ్చిన భూమిని త్యాగం చేసిన వారు వున్నారు..వారి త్యాగాన్ని వెలకట్టలేం. ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో నిర్వాసితులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నాం. ఆ ప్రాంతంలో మెరుగైన రోడ్లు వేసుకోబోతున్నాం..ఇప్పటికే ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నల్గొండలో నిర్మిస్తున్నాం..ఈ ప్రాంతంలో కూడా యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ ఏర్పాటు చేయాలని డిప్యూటీ సీఎం ను కోరుతున్ననని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో మేము ఇస్తున్న ఉద్యోగ నియామక పత్రాలపై దుష్ప్రచారం చేస్తున్నారు. మీరు ఉద్యోగాలు ఇచ్చి,నియామక పత్రాలు ఇస్తామంటే మేము ఏమైనా అడ్డుకున్నామా..? మీరు ఇవ్వలేదు కాబట్టి..సిఎం రేవంత్ రెడ్డి,డిప్యూటీ సీఎం భట్టి ప్రత్యేక చొరవతో నేడు ఉద్యోగ నియామక పత్రాలు ఇచ్చుకుంటున్నాం. ఇప్పుడు ఉద్యోగం పొందిన వారు 10 నుండి 5గంటల వరకు జాబ్ లాగా ఉండకూడదు. భవిష్యత్ లో పొల్యూషన్ ను ఎదుర్కొనేలా ఇన్నోవేటివ్ గా ఆలోచించాలి..టెక్నాలజీ ఎంత పెరిగిన మానవ మేధస్సు అవసరం ఉన్నదని అన్నారు.

## మైదుకూరు ప్రభుత్వ ఆసుపత్రి నీ ఆకస్మిక తనిఖీ చేసిన ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్...

మైదుకూరు ప్రభుత్వ ఆసుపత్రి స్థానిక శాసనసభ్యుడు పుట్టా సుధాకర్ యాదవ్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రికి వచ్చిన రోగులతో ఎమ్మెల్యే ఆప్యాయంగా మాట్లాడారు. ప్రభుత్వ ఆసుపత్రికి అవుట్ పోస్ట్, డయాలసిస్ సెంటర్, పోస్టుమార్టం ఏర్పాటుకు శాసనసభ్యుడు పుట్టా సుధాకర్ యాదవ్ స్థలాన్ని పరిశీలించారు. ఆస్పత్రి మౌలిక సదుపాయాలను సమకూర్చేందుకు డాక్టర్లను ఎమ్మెల్యే నివేదిక ఇవ్వాలని కోరారు. ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యుల పనితీరు చాలా బాగా ఉందని ఎమ్మెల్యే పుట్టా ప్రశంసించారు..ఆస్పత్రిలో ఎక్స్రే మిషన్ కంప్యూటర్లు, రక్త పరీక్ష లేపను పరిశీలించారు.ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షులు దాసరి బాబు ,మార్కెట్ కమిటీ చైర్మన్ ఏపీ రవీంద్ర, మిల్లుశీను, అన్నవరం సుధాకర్ రెడ్డి, తుపాకుల రమణ, బండి అమర్నాథ్ ,రేనాటి తదితరులు పాల్గొన్నారు...

## దేశానికే రోల్ మోడల్ గా నైపుణ్యం పోర్టల్ అభివృద్ధి!

### ఏడాదికి 50వేల మంది యువతకు నైపుణ్య శిక్షణకు అవకాశం!
### పీఎం ఇంటర్న్‌షిప్ స్కీమ్ తో నైపుణ్యం పోర్టల్ అనుసంధానం
### నైపుణ్యాభివృద్ధి శాఖపై మంత్రి నారా లోకేష్ సమీక్ష
### పోర్టల్ డెమోను పరిశీలించిన మంత్రి



ఉండవల్లి: ఉద్యోగ, ఉపాధి కల్పన కోసం యువత, పరిశ్రమలను అనుసంధానించేలా కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకురానున్న నైపుణ్యం పోర్టల్ ను దేశానికే రోల్ మోడల్ గా నిలిచేలా తీర్చిదిద్దాలని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ అధికారులను ఆదేశించారు. ఉండవల్లి నివాసంలో నైపుణ్య విభాగం అధికారులతో మంత్రి నారా లోకేష్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా నైపుణ్యం పోర్టల్ ను మెరుగ్గా తీర్చిదిద్దేందుకు చేపడుతున్న చర్యలను అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ.. సెప్టెంబర్ లో నైపుణ్యం పోర్టల్ ప్రారంభానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పీఎం ఇంటర్న్‌షిప్ స్కీమ్ తో నైపుణ్యం పోర్టల్ ను అనుసంధానించాలని సూచించారు. నైపుణ్యం పోర్టల్ డెమోను ఈ సందర్భంగా మంత్రి పరిశీలించారు. దేశంలో ఎక్కడా ఇలాంటి పోర్టల్ ను అభివృద్ధి చేయలేదని, రాష్ట్రంలోని నైపుణ్య కేంద్రాలతో పాటు న్యాక్, సీడాప్ ను పోర్టల్ తో అనుసంధానించనున్నట్లు అధికారులు వివరించారు. ఏడాదికి 50వేల మంది యువతకు శిక్షణ ఇచ్చేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. ఇప్పటికే 36 రంగాలకు సంబంధించి 3వేలకు పైగా జాబ్ కేటగిరీలను పోర్టల్ లో ఎన్ రోల్ చేసినట్లు వివరించారు. పరిశ్రమ అవసరాలకు తగ్గట్లుగా యువతను సన్నద్ధం చేసేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా మంత్రి ఆదేశించారు. ఇదే సమావేశంలో ఇంటర్ విద్యకు సంబంధించిన పలు అంశాల పై చర్చించారు. దృష్టి లోపం గల విద్యార్థులు ఎంపీసీ, బైపీసీ గ్రూపుల్లో చేరేందుకు అనుమతి మంజూరు చేసారు. వారికి మరిన్ని సదుపాయాలు కల్పించాలని మంత్రి ఆదేశించారు. అక్షర ఆంధ్రలో భాగంగా 16 లక్షల మందిని గుర్తించామని అధికారులు మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. వారందరికీ వయోజన విద్యా శిక్షణ తక్షణమే ప్రారంభించాలని మంత్రి అన్నారు. ఈ సమావేశంలో నైపుణ్యాభివృద్ధి, శిక్షణ విభాగం కార్యదర్శి కోన శశిధర్, ఏపీ స్కిల్ డెవలప్ మెంట్ కార్పోరేషన్ ఎండీ, సీఈవో జి.గణేష్ కుమార్, ఏపీఎస్ఎస్ డీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కె.రఘు, ఏపీఎస్ఎస్ డీసీ అసోసియేట్ డైరెక్టర్ కుమార పురుషోత్తం, ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ కృతికా శుక్లా తదితరులు పాల్గొన్నారు.

## అపర భగీరథుడు ఏపీ సీఎం చంద్రబాబు...

### హంద్రీ-నీవా జిలాలతో కుప్పం సస్యశ్యామలం
### 30న కుప్పంలో కృష్ణా జలాలకు హారతినివ్వనున్న రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు
### ఎన్నికల హామీని నిలబెట్టుకున్న కూటమి ప్రభుత్వం
### చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు



చిత్తూరు (ఢిల్లీ) రాయలసీమ ప్రాంతంలోని ప్రతి ఆయికట్టుకు నీరందించి, వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చి.., అన్నదాతలను ఆదుకోవడమే లక్ష్యంగా .. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అపర భగీరథుడిలా అహర్నిశలు శ్రమిస్తున్నారని చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావు కొనియాడారు. కుప్పం నియోజకవర్గాన్ని హంద్రీ-నీవా జిలాలతో సస్యశ్యామలం చేయడమే తన సంకల్పంగా భావించి, ముందుకు సాగుతుండడం ఏపీ సీఎం చంద్రబాబు చిత్తశుద్ధికి నిదర్శనం అన్నారు.పార్లమెంట్ సమావేశాలకు హాజరై.., దేశరాజధాని ఢిల్లీలో ఉన్న చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు.., ఈ నెల 30న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కుప్పంలో కృష్ణా జలాలకు హారతి పట్టనున్న నేపథ్యంలో...., సీఎం చంద్రబాబు కృషిని.., పాలనా దక్షతను శుక్రవారం ఓ ప్రకటనలో కొనియాడారు.2024 సార్వత్రిక ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు చిత్తూరు పార్లమెంటు పరిధిలోని కుప్పం నియోజకవర్గానికి కృష్ణా జలాలు చేరుకోవడం పై హర్షం వ్యక్తం చేశారు. దీనికి కారణమైన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడికి కృతజ్ఞతలు తెలియజేసిన చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ.., ఆయన నిత్య శ్రామికుడనీ.., ఇచ్చిన మాట నిలబెట్టుకున్న గొప్ప పరిపాలనాదక్షుడంటూ ప్రశంసించారు. అంతేకాకుండా ఇటు అధికారులు..,అటు కూటమి నాయకులు, కార్యకర్తలకు సీఎం స్ఫూర్తిగా నిలవడం అభినందనీయమన్నారు.వైసిపి ప్రభుత్వం హయాంలో ఆగిపోయిన హంద్రీ-నీవా ప్రాజెక్టు పనులను కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే పరుగులు తీయించిందన్నారు. సీఎం చంద్రబాబు, జల వనరుల శాఖ మంత్రి రామానాయుడు ఎప్పటికప్పుడు పనులను పర్యవేక్షిస్తూ.., నిర్ణీత గడువులోగా హంద్రీ-నీవా ప్రాజెక్టు పనులను పూర్తి చేశారని తెలిపారు. 530 కోట్ల వ్యయంతో 265 కిలోమీటర్ల కాల్వ విస్తరణ, అభివృద్ధి పనులను శరవేగంగా పూర్తి చేసి, కృష్ణా జలాలు కుప్పానికి చేరుకునేందుకు శ్రమించిన అధికారులను ఈ సందర్భంగా చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు అభినందించారు.

# 16 లక్షల 75 వేల విద్యార్థుల ఫీజుల బకాయిలు చెల్లించాలి..

**సంక్షేమ భవన్ వద్ద విద్యార్థుల మహాధర్నా.. దద్దరిల్లి న సంక్షేమ భవన్ ..**
**8000 వేలకోట్ల స్కాలర్షిప్ ల బకాయిలు చెల్లించాలని డిమాండ్..**
**రాష్ట్రవ్యాప్త ఆందోళనలు తప్పవని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు ఆర్ కృష్ణయ్య హెచ్చరిక**

**ప్రజాబలం ప్రతినిధి: హైదరాబాద్ ఆగస్టు 22**
16 లక్షల 75 వేల విద్యార్థుల 8000 వేలకోట్ల స్కాలర్షిప్ ఫీజుల బకాయిలు చెల్లించాలని డిమాడ్ చేస్తూ జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు ఆర్ కృష్ణయ్య నేతృత్వం లో శుక్రవారం సంక్షేమ భవన్



వద్ద విద్యార్థుల మహాధర్నా నిర్వహించారు. .. సంక్షేమ భవన్ దద్దరిల్లి పోయింది ఈ సందర్భంగా ఆర్ కృష్ణయ్య మాట్లాడుతూ ప్రభుత్వం తన మొద్దు నిద్రని వీడకపోతే రాష్ట్రవ్యాప్త ఆందోళనలు తప్పవని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు ఆర్ కృష్ణయ్య హెచ్చరిక.నిధుల విడుదలకు అడ్డుకట్ట వేస్తూ గాల్లో దీపంగా మారిన విద్యార్థులు చదువులు.. కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లిస్తున్నారు విద్యార్థుల స్కాలర్షిప్లు చెల్లించరా? మూడు సంవత్సరాలుగా విద్యార్థుల స్కాలర్షిప్ బకాయిలు చెల్లించడం లేదుపది నెలలుగా విద్యార్థులు రోడ్డు మీద వచ్చి ఉద్యమాలు చేస్తున్న ప్రభుత్వం పట్టించుకోవడం లేదు ఆర్థిక శాఖ కాంట్రాక్టర్లు అంటే చాలా ప్రేమ ఉంది కానీ అంటే పట్టించుకోవడం లేదు... ఆర్థిక శాఖ వైఖరి మార్చుకోకపోతే తీవ్ర తిరుగుబాటు తప్పదని హెచ్చరించారు..జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్. కృష్ణయ్య మాట్లాడుతూ, విద్యార్థులు స్కాలర్షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌లపై ఆధారపడి చదువుకుంటున్నారని, కానీ ప్రభుత్వం ఆలస్యం చేయడంతో యాజమాన్యాలు విద్యార్థులపై ఒత్తిడి తెస్తున్నాయని విమర్శించారు. దీని వల్ల విద్యార్థులు మానసిక ఒత్తిడికి గురవుతున్నారని ఆయన తెలిపారు.ఫీజు బకాయిలను వెంటనే చెల్లించకపోతే తీవ్ర స్థాయి ఉద్యమాలకు దిగుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమణం లో ు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## నృసింహుని భక్తుడను... ధర్మకర్తకు అర్హుడను
## దేవస్థానం అభివృద్ధిలో ఉమ్మడి సుడుగు కుటుంబాల త్యాగ చరిత్ర మాది: జీవన్ రెడ్డి



**యాదగిరిగుట్ట, ఆగస్టు 22 ప్రజాబలం ప్రతినిధి:** శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం అభివృద్ధిలో పంట పొలాలు, భూములు ,ఇండ్లు త్యాగం చేసిన... విరాళాలు ఇచ్చిన దాతలుగా ఉమ్మడి సుడుగు కుటుంబాల చరిత్ర తమదని సుడుగు జీవన్ రెడ్డి అన్నారు. శ్రీ స్వామివారి సేవలో తమ సుడుగు కుటుంబాలు తరతరాలుగా పునీతం అవుతున్నాయని... ధర్మకర్తగా అవకాశం ఇస్తే మరింతగా దేవస్థానం అభివృద్ధికి ,భక్తుల మౌలిక సదుపాయాల కల్పనకు ధర్మబద్ధంగా, నిస్వార్థంగా , ఒక భక్తుడిగా అంకితభావంతో పనిచేస్తానని ఆయన అన్నారు. ఆనాడు శ్రీ స్వామివారి పూజలకు తులసివనం , పూల మొక్కలు పెంచడానికి, యాత్రికుల వసతికి కాటేజీలు నిర్మించడానికి పది ఎకరాల విలువైన భూమిని ఇచ్చామని... అదే నేడు తులసి కాటేజిగా దేవస్థానం చరిత్రలో ప్రసిద్ధి చెందిందని అన్నారు. ఇటీవల దేవాలయ పునర్నిర్మాణంలో కోట్లాది రూపాయల విలువైన రెండున్నర ఎకరాల భూమిని తమ సుడుగు కుటుంబాలు ఇచ్చాయని సుడిగు జీవన్ రెడ్డి చెప్పుకొచ్చారు. ఇక కొండ చుట్టూ నిర్మించిన రింగ్ రోడ్డు లో తమ సుడుగు కుటుంబాలు అత్యంత విలువైన ఇండ్లు, దుకాణాలు కోల్పోవడం జరిగిందని చెప్పారు. గత ప్రభుత్వం పునరావాసం కింద ప్రత్యామ్నాయ ఉపాధి నిమిత్తం ఇతరులకు ఇచ్చిన విధంగా తమ కుటుంబాలకు షాపులు ఇవ్వకపోవడం విచారకరమని అన్నారు. తమ ఇంటి పక్కనే దేవస్థానం విద్యుత్ జనరేటర్ ఉందని... నిరంతరం జనరేటర్ చప్పుడుతో తమ కుటుంబాలలో పిల్లలు సజావుగా చదువుకునే వీలు లేకుండా పోయిందని తన చిన్ననాటి రోజులను గుర్తు చేసుకున్నారు. సంపూర్ణ భక్తి భావంతో శ్రీ స్వామివారి అంతరాలయంలో బంగారు తాపడం నిమిత్తం ఒక లక్ష వెయ్యి నూట పదహారు రూపాయలు విరాళంగా తాను స్వయంగా సమర్పించానని తెలిపారు. ధర్మకర్తగా తనకు పని చేసే మహద్భాగ్యం కల్పించాల్సిందిగా ప్రభుత్వానికి త్వరలో విజ్ఞప్తి చేస్తానని జీవన్ రెడ్డి దేవునికి నమస్కరిస్తూ చెప్పారు . ధర్మకర్తల మండలి ఏర్పాటు సందర్భంగా తన పేరును తప్పక పరిశీలిస్తారని ఆశిస్తున్నట్లు తెలిపారు

## ఎన్.డి.ఏ. ప్రభుత్వం తొలగించిన అర్హులైన విభిన్న ప్రతిభావంతుల పెన్షన్లు వెంటనే పునరుద్ధరించాలి...
## సిపిఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్ డిమాండ్.

బ్రహ్మం గారి మఠం మండలం కేంద్రమైన బ్రహ్మంగారి మఠంలోని, సిపిఎం మండల కార్యాలయంలో భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్ట్), సిపిఎం కడప జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జి.శివకుమార్ , బ్రహ్మంగారిమఠం మండల సిపిఎం కార్యదర్శి జి.సునీల్ కుమార్ సంయుక్తంగా శుక్రవారం ఉదయం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్ మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని టీడీపీ,జనసేన,బిజెపి సంకీర్ణ ఎన్డీఏ ప్రభుత్వం అర్హులైన, విభిన్న ప్రతిభావంతులైన వికలాంగుల పెన్షన్లు తగ్గించాలని వివిధ జిల్లాల అధికారులకు ఆదేశాలు ఇవ్వడం ప్రజావిరుద్ధ చర్య అని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజల, శ్రామికులు మరియు అణగారిన వర్గాల అభివృద్ధి కోసం పని చేస్తామని ఒకవైపు నమ్మ పలుకుతూ వాస్తవంగా ఆచరణలో సంపన్నులు మరియు కార్పొరేట్ల, ఇండస్ట్రీల అధిపతుల ప్రయోజనాల కోసం క్విట్ ప్రోకో అంతర్గత పాలసీని అమలు చేస్తోందని విమర్శించారు. వికలాంగుల పెన్షన్లుకు కోత విధించడం క్రూరమైన చర్య అని దానిని తక్షణం ఉపసంహరించుకోవాలన్నారు. విభిన్న ప్రతిభావంతుల పెన్షన్లు ఎవరి దయాదాక్షిన్యాలతో వచ్చినవి కావని, పోరాటాల, ఉద్యమల కృషితో విభిన్న ప్రతిభావంతులైన వికలాంగులు సంపాదించుకున్న కనీస హక్కులు అని తెలిపారు. ఈ హక్కులు ప్రజా ఉద్యమాలు, ప్రజాస్వామ్య పోరాటాల ఫలితంగా అందబడ్డాయి అని గుర్తు చేశారు. పెన్షన్లను తగ్గించడం ద్వారా ప్రభుత్వం వికలాంగుల్లో అత్యధికమైన అణగారిన వర్గాలపై, నేరుగా దాడి చేస్తోందని ఆరోపించింది. ఇది వారిని ఇంకా అధిక పేదరికంలోకి నెట్టడం, చిన్న చూపు చూపడమని పేర్కొన్నారు. ఎన్డీఏ ప్రభుత్వం "సామాజిక న్యాయం", "అవసరమైన వారికి మద్దతు" అనే మాటలతో వచ్చిందని, ఒకటిన్నర ఏడాది పూర్తి కాకముందే ప్రభుత్వం నిజమైన ప్రజా వ్యతిరేక ఎజెండా బయటపడిందని విమర్శించారు. పేదల సబ్సిడీలను తగ్గిస్తూ, కాంట్రాక్టర్లు, రియల్ ఎస్టేట్ లాబీలు, కార్పొరేట్ మిత్రులకు రాయితీలు అందించడం. పన్నుల మినహాయింపులు, పెద్ద పారిశ్రామికవేత్తలకు ఉచిత సదుపాయాలు ఇవ్వడం "ఆర్థిక నియంత్రణ" పేరిట పేదలపై చేస్తున్న కుట్రపూరిత దాడిగా పేర్కొన్నారు. ఇది కేవలం సంక్షేమ సమస్య కాదని, పేద, మధ్యతరగతి ప్రజలపై భారాలు వేసి పన్నుల రూపంలో తీసుకుని, ధనవంతులకు ఇవ్వాలన్న నెయోలిబరల్ పాలసీలకు వ్యతిరేకంగా పోరాటం చేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. పిల్లల చదువు, వైద్యం ఖర్చులు తీవ్రంగా ప్రతి పేద మధ్యతరగతి కుటుంబాలలో పెరిగిపోవడంతో, కార్మికులు, రైతులు, మహిళలు, యువత ఇప్పుడు నలిగిపోతున్నారని వివరించారు. ప్రభుత్వం తక్షణమే పెన్షన్లను బేశరత్తుగా పునరుద్ధరించాలి, పెంచిన పర్సంటేజీ వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు. పేద, దిగువ మధ్యతరగతి అన్ని వర్గాలకు న్యాయం కల్పించాలని డిమాండ్ చేశారు.విభిన్న ప్రతిభావంతులైన వికలాంగుల హక్కుల కోసం పోరాడుతున్న సంస్థలతో కలిసి సిపిఎం పోరాటం చేస్తుందని తెలిపారు. రాష్ట్రంలో కొలువుతీరి ఉన్న ఎన్డీఏ ప్రభుత్వంలోని ప్రజా వ్యతిరేక విధానాలను తీవ్రంగా ఖండించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు బుడ్డెనబోయిన హరి, యర్రంపల్లి అజయ్, లక్ష్మీనారాయణ లు పాల్గొన్నారు

## క్రీడా కార్యక్రమాల్లో అన్ని వర్గాలను భాగస్వామ్యం చేయాలి
## జాతీయ క్రీడ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలి
### క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి



**హైదరాబాద్ ఆగస్టు 22 ప్రజాబలం ప్రతినిధి:** శనివారం నుండి తొమ్మిది రోజులపాటు జాతీయ క్రీడా ఉత్సవాలలో క్రీడాకారులు క్రీడాభిమానులు అధిక సంఖ్యలో పాల్గొనే విధంగా తగిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర క్రీడలు యువజన సర్వీసుల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి క్రీడా శాఖ అధికారులను ఆదేశించారు. ఈరోజు రాష్ట్ర సచివాలయంలో తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి తో కలిసిక్రీడా శాఖ పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దేశంలో ఏ రాష్ట్రం నిర్వహించినంత ఉత్సాహభ రితంగా జాతీయ క్రీడ వేడుకలను 9 రోజులపాటు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించిందని దానికి అనుగుణంగా అందరూ ఈ కార్యక్రమాల్లో భాగస్వాములయ్యే విధంగా చర్యలు చేపట్టాలని అధికారులను ఆయన ఆదేశించారు . ఈ సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం రూపొందించిన క్రీడా విధానము అంశాలను క్రీడా. సమాజానికి చేరువయ్యే విధంగా వివిధ కార్యక్రమాల ద్వారా విస్తృత ప్రచారం చేయాలని ఆయన సూచించారు. తొమ్మిది రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమంలో వివిధ స్వచ్ఛంద సంస్థలు విద్యాసంస్థలు క్రీడాకారులు క్రీడాభిమానులు యువకులు, విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొనే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. జిల్లాల లో కూడా జాతీయ క్రీడా దినోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించాలని ఆయన సూచించారు. గ్రామీణ క్రీడా మౌలిక సదుపాయాలకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలన్న రాష్ట్ర ప్రభుత్వ సంకల్పానికి అనుగుణంగా అధికారులు పనిచేయాలని ఆయన కోరారు. తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో ఉన్న అకాడమీలు స్పోర్ట్స్ స్కూల్ లను బలోపేతం చేయాలని, తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ క్రీడా మైదానాలలో శిక్షణ పొందుతున్న రెగ్యులర్ ట్రైని లలో ప్రతిభ కలిగిన క్రీడాకారులను గుర్తించి ప్రోత్సహించాలని ఆయన సూచించారు. క్రీడారంగం బలోపేతం కావాలి అంటే పీఈటీలు ఫిజికల్ డైరెక్టర్లు మరియు కోచుల సంఖ్య పెరగాల్సిన అవసరం ఉందని, క్రీడా శాఖ విద్యాశాఖ మధ్య సమన్వయం తో గ్రామీణ స్థాయి నుండి అంచలంచలుగా క్రీడాభివృద్ధికి కృషి జరగాలని ఇందుకోసం అవసరమైన చర్యలు చేపట్టాలని ఆయన అధికారులను ఆదేశించారు.

# హుజురాబాద్‌లో బీఆర్ఎస్ జోష్‌బీ కాంగ్రెస్‌కు భారీ షాక్!

**- కేటీఆర్, ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి సమక్షంలో భారీ చేరికలు**
**- కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి గులాబీ కండువాలు కప్పుకున్న మాజీ సర్పంచులు, కీలక నేతలు**
**- ప్రజలు తిరిగి కేసీఆర్ పాలన కోరుకుంటున్నారు: చేరిన నాయకులు**



**హుజురాబాద్ ప్రజాబలం ప్రతినిధి:** హుజురాబాద్ నియోజకవర్గంలో రాజకీయాలు రోజురోజుకు వేడెక్కుతున్నాయి. నిన్న బిజెపి నుంచి ఈటెల ముఖ్య అనుచరులు పార్టీని వీడి ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ కండువా కప్పుకోగా, ఇప్పుడు ఒక్కరోజు వ్యవధిలోనే అటు కాంగ్రెస్ పార్టీ నుంచి కూడా పలువురు మాజీ సర్పంచులు, కీలక నేతలు బీఆర్ఎస్‌లో చేరారు. ఈ చేరికలు నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీకి కొత్త ఊపునిచ్చాయి.

కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చడంలో విఫలం కావడం, ప్రజల్లో ఆ పార్టీపై పూర్తిస్థాయిలో వ్యతిరేకత రావడం వంటి కారణాలతో జమ్మికుంట మండలానికి చెందిన పలువురు మాజీ సర్పంచులు, కీలక నేతలు కాంగ్రెస్‌కు రాజీనామా చేసి బీఆర్ఎస్‌లో చేరారు. ఈ చేరికలు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మరియు స్థానిక ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి సమక్షంలో జరిగాయి.

బీఆర్ఎస్‌లో చేరిన వారిలో తనుగుల మాజీ సర్పంచ్ రామస్వామి, శంభునిపల్లి మాజీ సర్పంచ్ వెంకట్ రెడ్డి, పాపక్కపల్లి మాజీ సర్పంచ్ మహేందర్, శాయంపేట మాజీ సర్పంచ్ భద్రయ్య, నాగంపేట మాజీ సర్పంచ్ కృష్ణ రెడ్డి,



రాచపల్లి సదానందం, జైద శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

తెలంగాణ అభివృద్ధి బీఆర్ఎస్ హయాంలోనే..

ఈ సందర్భంగా గులాబీ కండువాలు కప్పుకున్న నాయకులు మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి బీఆర్ఎస్ హయాంలోనే జరిగిందని, రాష్ట్రం మరింత అభివృద్ధి చెందాలంటే తిరిగి కేసీఆర్ ముఖ్యమంత్రి కావాలని అన్నారు. కాంగ్రెస్ పార్టీలో కొనసాగితే తమకు రాజకీయ భవిష్యత్తుతో పాటు కనీస గౌరవం కూడా ఉండదని గ్రహించి, తెలంగాణ అభివృద్ధి కోసం నిరంతరం పోరాడుతున్న బీఆర్ఎస్ పార్టీలో చేరామని వివరించారు. స్థానిక ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి నియోజకవర్గంలోని అన్ని వర్గాల ప్రజలకు న్యాయం చేకూరేలా ప్రభుత్వంతో పోరాడుతున్నారని, ఇకనుంచి తాము కూడా ఆయన బాటలోనే నడుస్తామని హామీ ఇచ్చారు.

కాంగ్రెస్ పాలన రాక్షస పాలన..

అనంతరం ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి మాట్లాడుతూ, ప్రజలు కాంగ్రెస్ పార్టీ మోసపూరిత పాలనతో విసిగిపోయారని అన్నారు. ముఖ్యంగా రైతులు సహా అన్ని వర్గాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. కేసీఆర్ పాలనలో తెలంగాణలో 'రామరాజ్యం' నడిచిందని, కానీ ఇప్పుడు 'రాక్షస పాలన' నడుస్తోందని విమర్శించారు. పదేళ్ల కేసీఆర్ పాలనలో తెలంగాణ సస్యశ్యామలమై, దేశంలోనే అన్ని రంగాల్లో ప్రథమ స్థానంలో ఉందని గుర్తు చేశారు.

తెలంగాణ ప్రజలంతా తిరిగి కేసీఆర్ పాలన కోరుకుంటున్నారని, భవిష్యత్తులో తప్పక కేసీఆర్ ముఖ్యమంత్రి అవుతారని ఆయన ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రజలంతా బీఆర్ఎస్ పార్టీ వైపే చూస్తున్నారని, ఇకనుంచి రాబోయే అన్ని ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ జయకేతనం ఎగురవేస్తుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ తక్కెళ్లపల్లి రాజేశ్వర్ రావు, ఇతర నాయకులు పాల్గొన్నారు.

## కోళ్ల ఫామ్ లో భారీ కొండ చిలువ?
## భయభ్రాంతుల్లో కోళ్ల వ్యాపారి

భద్రాద్రి చుంచుపల్లి మండలం గౌతంపూర్ కాలనీలో రాజు అనే వ్యక్తి నివాసము ఉండే కోళ్ల ఫారం లో 13 అడుగుల భారీ కొండచిలువ కోళ్లను తినేసింది. కోళ్ల ఫామ్ యజమాని రాజు ఒక్కసారిగా కొండ సిలువను చూసి భయ భ్రాంతులకు గురై వెంటనే స్నేక్ క్యాచర్ మహేష్ కి సమాచారం అందించాడు సమాచారం అందుకున్న స్నేక్ క్యాచర్ మహేష్ హుటాహుటిన గౌతంపూర్ కి వెళ్లి కోళ్ల ఫామ్ లో ఉన్న 13 అడుగుల కొండచిలువను చాకచక్యంగా పట్టుకోవడం జరిగింది. దీంతో అక్కడున్న కాలనీవాసులు స్నేక్ క్యాచర్ మహేష్ ను అభినందించారు. తరువాత కొండచిలువను రేగళ్ల అడవిలోకి వదిలేసిన స్నేక్ క్యాచర్ మహేష్. చిన్నపిల్లలు ఎక్కువగా ఉండే గౌతమ్ పూర్ కాలనీలో కొండచిలువ రావడంతో ఒక్కసారిగా భయభ్రాంతులకు గురవయ్యారు. చివరకు కొండచిలువను స్నేక్ క్యాచర్ మహేష్ పట్టుకోవడం తో గౌతంపూర్ కాలనీవాసులు ఊపిరి పీల్చుకున్నారు...

# రైతును అరిగోస పెడుతున్న కాంగ్రెస్ పతనం ప్రారంభమైంది: కేటీఆర్

**చేతగాని పాలకుల వల్ల యూరియా సంక్షోభం: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఆగ్రహం**

**కేసీఆర్ దూరదృష్టి, ముందుచూపు ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వానికి లేకపోవడం వల్లే రైతుల కష్టాలు**

**గతంలో కేంద్రం, రాష్ట్ర వ్యవసాయ శాఖలు, రైల్వే, రవాణా శాఖలను సమన్వయం చేసిన ఘనత కేసీఆర్‌ది**



రైతులకు యూరియా సరఫరాలో ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న అసమర్థ విధానాలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. రైతులను అరిగోస పెడుతున్న ప్రస్తుత కాంగ్రెస్ పాలకుల పతనం ప్రారంభమైందని ఆయన సంచలన వ్యాఖ్యలు చేశారు. పరిపాలన అంటే ఏమిటో తెలియని అసమర్థులు రాజ్యమేలడం వల్లే రైతులకు ఈ కష్టాలు, కన్నీళ్లు వచ్చాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కేసీఆర్ నాయకత్వం, ముందుచూపు, పకడ్బందీ పాలన అంటే ఏమిటో ఇప్పుడు తెలంగాణ సమాజానికి అర్థమైందని కేటీఆర్ పేర్కొన్నారు.

యూరియా సంక్షోభం పైన ఆయన స్పందిస్తూ, "చిల్లర రాజకీయాలు తప్ప పరిపాలన తెలియని అసమర్థులు రాజ్యమేలడం వల్లే రైతులకు ఈ కష్టాలు, కన్నీళ్లు వచ్చాయి" అని ధ్వజమెత్తారు. ఒకవైపు బూతులు మాట్లాడడం తప్ప చేతలు రాని ఢిల్లీ పార్టీల నాయకులకు, మరోవైపు 'వందేళ్ల విజన్‌కు నిలువెత్తు రూపమైన కేసీఆర్ గారికి' ఉన్న స్పష్టమైన తేడా నాలుగు కోట్ల తెలంగాణ సమాజానికి ఇప్పుడు అర్థమైపోయిందని ఆయన అన్నారు.

గతంలో ముఖ్యమంత్రి కేసీఆర్ సారథ్యంలో యూరియాను సకాలంలో తెప్పించడానికి ఎన్నెన్ని ప్రణాళికలు, కసరత్తులు జరిగాయో ఆయన వివరించారు. వ్యవసాయ అధికారులతో కేసీఆర్ వరుస సమీక్షలు నిర్వహించేవారని, కేంద్రానికి ప్రతి సీజన్‌కు ముందే లెక్కలతో సహా వినతులు సమర్పించేవారని గుర్తు చేశారు. అంతేకాకుండా, ఏపీలోని నౌకాశ్రయాలకు మన అధికారులను పంపి, సరఫరాను పర్యవేక్షించేలా ఆదేశాలు జారీ చేసేవారని తెలిపారు. యూరియా సరఫరా కోసం దక్షిణ మధ్య రైల్వే అధికారులకు స్వయంగా కేసీఆర్ ఫోన్ చేసి, 25 స్పెషల్ గూడ్స్ ట్రెయిన్‌లను ఏర్పాటు చేయాలని ప్రత్యేకంగా విజ్ఞప్తులు చేసేవారని పేర్కొన్నారు. అవసరమైతే పక్క రాష్ట్రాల రవాణా శాఖ మంత్రులతో నేరుగా సంప్రదింపులు జరిపి, ఏకంగా 4 వేల లారీలను రంగంలోకి దించేలా సన్నాహాలు చేసేవారని కేటీఆర్ తెలిపారు. పోర్టుల నుంచి నేరుగా మండలాలకు యూరియాను తరలించే వ్యూహాలను రచించి, ప్రతి రైతుకు సమయానికి అందేలా చర్యలు తీసుకునేవారని చెప్పారు. యూరియా సరఫరాలో ఏ ప్రాంతంలోనూ కొరత రాకుండా, నేరుగా గ్రామాల్లోనే సరఫరా చేసేలా పకడ్బందీ ఏర్పాట్లు చేసేవారని ఆయన స్పష్టం చేశారు. కేసీఆర్‌కు ఉన్న ఈ ముందుచూపు, దక్షత కాంగ్రెస్ ప్రభుత్వానికి లేకపోవడం వల్లే రాష్ట్ర ప్రభుత్వం రైతులను కష్టాల పాలు చేస్తోందని కేటీఆర్ తీవ్రంగా ఆరోపించారు. పరిపాలనలో కేసీఆర్‌కు ఉన్న అనుభవం, స్పష్టత ప్రస్తుత పాలకులకు లేవని, అందుకే రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఆయన పేర్కొన్నారు.

# వివిధ గ్రామాలలో పశువుల పాక భూమి,పశువుల పాక ప్రారంభోత్సవం చేసిన ఆర్ టి ఎ నెంబర్ అంకతి శ్రీనివాస్





**ప్రజాబలం మంచిర్యాల నియోజకవర్గ రిపోర్టర్ ఆగస్టు 22 :** వివిధ గ్రామాలలో పశువుల పాక భూమి మంచిర్యాల ఆర్ టి ఐ నెంబర్ అంకతి శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆర్ టి ఎ అంకతి శ్రీనివాస్ మంచిర్యాల జిల్లాలోని లక్షెటిపేట మండలంలో ఎల్లరం తిమ్మాపురం బలరావుపేట, వెంకటరావుపేట గ్రామలల్లో పశువుల పాక భూమి పూజ మరియు పశువుల పాకలను ప్రారంబోత్సవ కార్యక్రమలు చెప్పట్టి లబ్దిదారులు కు చెక్కులు ఇవ్వడం జరిగింది అదేవిదంగా జెండా వెంకటపూర్ లో అంగన్వాడీ పాఠశాల కు భూమి పూజా పోత పల్లి పాఠశాల ప్రహరీ గోడ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. వ్యవసాయ మార్కెట్ వైస్ చైర్మన్ ఆరిఫ్ స్థానిక ఎంపీడీఓ సరోజ వారికి సబందిత అధికారులు,కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పింగళి రమేష్,బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు నలిమెల రాజు, జిల్లా నాయకులు ముత్తే సుధాకర్,పార్టీ ఉప అధ్యక్షులు కందుల మోహన్,ఎల్తాపు రాము చిన్నయ్య ఆయా గ్రామల కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# పి.ఎం.కే.ఎస్.వై ప్రతిపాదనలు 3 రోజులలో అందించాలి :: జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ

## ప్రధాన మంత్రి కృషి సించాయే యోజన 3.0 ప్రతిపాదనల పై రివ్యూ నిర్వహించిన జిల్లా కలెక్టర్



**రాజన్న సిరిసిల్ల జిల్లా, ఆగస్టు 22 (ప్రజాబలం ప్రతినిధి)**పి.ఎం.కే.ఎస్.వై ప్రతిపాదనలు 3 రోజులలో అందించాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ తెలిపారు.

శుక్రవారం జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ సమీకృత జిల్లా కలెక్టరేట్ లోని మినీ సమావేశ మందిరంలో ప్రధాన మంత్రి కృషి సించాయే యోజన 3.0 ప్రతిపాదనల పై సంబంధిత అధికారులతో రివ్యూ నిర్వహించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ మాట్లాడుతూ, జిల్లాలో ఉన్న 255 గ్రామ పంచాయతీ పరిధిలో క్లస్టర్ వాటర్ షెడ్ నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వ నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం క్రైటిరియా, వేయిటేజ్ ఎంపిక చేయాలని అన్నారు.

ప్రతి నీటి చుక్కను సమర్ధవంతంగా వినియోగించుకుంటూ పంట పోలాలకు సాగు నీరు అందించాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వంలిహార్ కేత్ కో పానీలి నినాదంతో ప్రధాన మంత్రి కృషి సించాయే యోజన 3.0 పథకం ప్రవేశ పెట్టిందని అన్నారు. గ్రామాల్లో ప్రధాన మంత్రి కృషి సించాయే యోజన 3.0 క్రింద నూతన ప్రతిపాదనలు శాఖల వారీగా 3 రోజులలో తయారు చేసి డి.ఆర్.డి.ఏ కు అందించాలని కలెక్టర్ ఆదేశించారు.

ఈ సమావేశంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి శేషాద్రి, సిపిఓ మల్లేశం, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఆఫజలి బేగం, జిల్లా హార్టికల్చర్ అధికారి లత సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# దమ్మాయిగూడ అహ్మద్‌గూడ 2బిహెచ్‌కే కాలనీ అభివృద్ధి సమస్యల పరిష్కారానికి కలెక్టర్ మను చౌదరి దిశానిర్దేశం





**ప్రజాబలం ప్రతినిధి మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఆగస్టు 22:**దమ్మాయిగూడలోని అహ్మద్ గూడ 2 బిహెచ్ కె కాలనీలలోని సమస్యలను ప్రాధాన్యత క్రమంలో అత్యవసరమైన సమస్యలను ముందుగా పరిష్కరించాలని సంబంధిత శాఖల అధికారులను మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరు మను చౌదరి ఆదేశించారు.

శుక్రవారం కలెక్టరేట్ విసి హాల్ లో అహ్మద్ గూడ 2 బిహెచ్ కె కాలనీ సమస్యల పై సంబంధిత శాఖల అధికారులతో జిల్లా అదనపు కలెక్టరు రాధిక గుప్తాతో కలిసి జిల్లా కలెక్టరు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ 2బిహెచ్ కె ఇళ్లలో నివసిస్తున్న ప్రజలు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారని వారి సమస్యలను పరిష్కించాలని అధికారులకు సూచించారు. స్థానికులు కోరిన విధంగా అక్కడ ప్రైమరీ స్కూలు ఏర్పాటు చేయాలని అందుకు జిల్లాలో జీరో ఎన్ రోల్ మెంట్ పాఠశాలను అక్కడ ఏర్పాటు చేయడానికి అవసరమైన ప్రతిపాదనలను పంపాలని జిల్లా విద్యాశాఖాధికారికి కలెక్టరు సూచించారు. 2 బిహెచ్ కె సముదాయంలో బస్తీ దవాఖాన ఏర్పాటుకు అవసరమైన గదులు అందుబాటులో ఉన్నాయని, తక్కువ ఒపి ఎన్రోల్ మెంట్ ఉన్న బస్తీ దవఖానా లోని సిబ్బందిని ప్రత్యామ్నాయంగా ఇక్కడ ఏర్పాటు చేయాలని అందుకు అవసరమైన పరిపాలన మంజూరుకై నివేదికలు పంపాలని డిఎంహెచ్ ఓ కు సూచించారు. అంగన్ వాడీ సెంటర్ కావాలని స్థానికులు కోరారని, అందుకు శిథిలావస్థలో ఉన్న తక్కువ మంది చిన్నారులు ఉన్న సెంటర్ ను ఇక్కడికి మార్పించడానికి చర్యలు తీసుకోవాలి జిల్లా సంక్షేమ శాఖ అధికారిని సూచించారు. సుమారు 24 బ్లాకులు ఉన్న 2 బిహెచ్ కె కాలనీలో రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ ను ఏర్పాటు చేసి ఎలక్షన్ నిర్వహించి అధ్యక్షులను, సభ్యులను ఎన్నుకొని వారి ద్వారా చిన్న చిన్న సమస్యలను ఎప్పటికప్పుడు తీర్చుకునే విధంగా, సామాజిక బాధ్యతగా వ్యవహారించేలా చర్యలు తీసుకోవాలన్నారు. అంతే కాకుండా అసోసియోషన్ కు ఒక బ్యాంక్ అకౌంట్ ఓపెన్ చేయించాలని జిల్లా కోఆపరేటివ్ అధికారి కలెక్టరు ఆదేశించారు. 2 బిహెచ్ కె కాలనీకి సమీపంలో ఒకరేషన్ షాపును ఏర్పాటు చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా సివిల్ సప్లై అధికారిని ఆదేశించారు. జిహెచ్ఎంసి హౌజింగ్‌ఈఈ తో కలెక్టరు మాట్లాడుతూ 2 బిహెచ్ కె కాలనీని క్షేత్రస్థాయిలో పరిశీలించాలని ఆదేశించారు. డ్రైనేజి, వర్షం నీరు నిలవకుండా పైప్ లైన్ ఏర్పాటు చేయాలని, అన్ని బ్లాకులకు రూఫ్ డ్యామేజీని చిప్పింగ్ చేయించాలని, ట్యాంక్ వాటర్ లీకేజీ, ప్రహరీ నిర్మాణం, ఆట స్థలం వద్ద ఉన్న సంపుకు ఫెన్సింగ్, పిల్లలకు ఆట వస్తువుల ఏర్పాటు , లిఫ్ట్ సమస్యలను పరిష్కరించాలని అందుకు అవసరమైన ప్రతిపాదనలను తనకు పంపాలని కలెక్టరు వివరించారు. ఎలక్ట్రిసిటి పోల్స్, ట్రాన్స్ ఫార్మర్లు ఇళ్లకు దగ్గరగా ఉన్నాయని వాటి వల్ల ప్రమాదం జరిగే అవకాశాలు ఉన్నాయని, పోల్స్, ట్రాన్స్ ఫార్మర్లకు కేసింగ్ లేక ఫెనిసింగ్ ఏర్పాటు చేయాలని విద్యుత్తు శాఖ అధికారులకు సూచించారు. 2 బిహెచ్ కె కాలనీ వాసులకు గృహజ్యోతి పథకం అమలు కావడం లేదని అందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

2 బిహెచ్ కె కాలనీలో రోడ్డు మలుపు దగ్గర ఫ్లాష్ లైట్లు, అవసరమైన మేరకు స్పీడ్ బ్రెకర్లు, అదే విధంగా భద్రత మేరకు సిసి టివిల ఏర్పాటు చేయాలని ఆర్ అండ్ బి అధికారులకు కలెక్టరు సూచించారు. పారిశుద్య కార్మికులు రోజు వచ్చి చెత్త సేకరించేలా, స్ట్రీట్ లైట్లు ఎర్పాటు చేసే విధంగా మున్సిపల్ కమీషనర్ ను కలెక్టర్ ఆదేశించారు. 2 బిహెచ్ కె కాలనీ వాసులకు ఏదైన ఉపాధికై చిన్న చిన్న వ్యాపారాలు చేసుకునేందుకు బ్యాంకు ద్వారా లోన్ ఇచ్చేలా ఒక మేళా ఏర్పాటు చేసి వారి నుండి దరఖాస్తులు తీసుకోవాలని ఎల్డిఎంను కోరారు. ఈ సమస్యలను తీర్చేందుకు సంబంధిత శాఖల అధికారులు జాప్యం లేకుండా చర్యలు చేపట్టి వారి సమస్యలను త్వరిగతిన తీర్చాలని అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు.

ఈ సమావేశంలో డిఈఓ విజయ కుమారి, డిఎంహెచ్ఓ ఉమాగౌరి, డిఎస్ఓ శ్రీనివాస్ రెడ్డి, డిడబ్ల్యుఓ శారద, జిల్లా హౌజింగ్ అధికారిరమణ మూర్తి, జిహెచ్ఎంసిఈఈ, ఆర్ అండ్ బి అధికారి, దమ్మాయిగూడ మున్సిపల్ కమీషనర్ వెంకట్ రెడ్డి, డిసిఓ, తదితరులు పాల్గొన్నారు.

# సిరిసిల్ల ఆర్టీసి డిపో బస్సును ఢీ కొట్టిన బైక్, యువకుడికి తీవ్రగాయాలు.



**వేములవాడ టౌన్, ( ప్రజాబలం),** శుక్రవారం రాత్రి వేములవాడ పట్టణంలో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. సిరిసిల్ల టిఎస్ఆర్టిసి డిపోకు చెందిన బస్సు నెంబర్ టీఎస్ 21 జెడ్ 0030, సిరిసిల్ల నుండి వేములవాడకు వెళ్తుండగా, వేములవాడ టిఎస్ఆర్టిసి డిపో వద్ద వెనుక నుంచి ద్విచక్ర వాహనం నెంబర్ టీఎస్ 16 ఎఫ్ఏ 7393 ఢీ కొట్టింది. ఈ ఘటనలో బైక్ పై ఉన్న యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు వెంటనే స్పందించి గాయపడిన వ్యక్తిని వేములవాడ ప్రభుత్వా ఏరియా ఆసుపత్రికి తరలించారు. గాయపడ్డ యువకుడు ముష్టిపల్లి గ్రామం ( చంద్రంపేట) కు చెందిన రాజు (27) గా పోలీసులు గుర్తించారు. ప్రస్తుతం క్షతగాత్రునికి వైద్యులు చికిత్స అందిస్తున్నారు. పోలీసుల సంఘటన స్థలానికి చేరుకుని క్షేత్రస్థాయిలో పరిశీలించి, దర్యాప్తు ప్రారంభించారు.

# రంగంపేటలో మన గ్రోమోర్ సెంటర్ ఓపెన్



**ప్రజాబలం కొల్చారం మండలం ఆగస్టు 22** మెదక్ జిల్లా కొల్చారం మండలం రంగంపేటలో మన గ్రోమోర్ సెంటర్ ఓపెన్ చేయడం జరిగింది దీనికి ముఖ్య అతిథులుగా రైతులు అనగా ఉత్తమ రైతు అవార్డు పొందిన నరేందర్ రెడ్డి రంగంపేట పిఎసిఎస్ చైర్మన్ అరిగి రమేష్ గారు సంగాయిపేట ఎఫ్ యు చైర్మన్ వెంకటరామిరెడ్డి గారు అదేవిధంగా రైతులందరూ వారితో పాటు మన గ్రోమోర్ సెంటర్ ఎంప్లాయిస్ అయిన ఏరియా మేనేజర్ శంకర్ ఏరియా మార్కెటింగ్ మేనేజర్ శ్రీశైలం గ్రోమో సంస్థ ఉద్యోగులుగా మల్లికార్జున్ రిటైల్ స్టోర్ మేనేజర్ శివకుమార్ అకౌంటెంట్ శ్రీనివాస్ ఫీల్డ్ అసిస్టెంట్ రైతులు తదితరులు పాల్గొన్నారు

# ఎస్సైని సన్మానించిన మాజీ సర్పంచ్ నెల్లికిష్టయ్య

**ప్రజాబలం ఆగస్టు 22 కొల్చారం మండలం** మెదక్ జిల్లా కొల్చారం మండలం నూతన ఎస్సై మహమ్మద్ మొహీనుద్దిన్ ను వెంకటాపూర్ మాజీ సర్పంచ్ నెల్లి కిష్టయ్య మాజీ వార్డ్ మెంబర్లు షేకులు పోచయ్య సత్తయ్య శాలువాతో సన్మానించారు శుక్రవారం రోజున మర్యాదపూర్వకగా కలిశారు ఈకార్యక్రమంలో పోచయ్య షేకులు పెద్దోళ్ల శేకులు లక్ష్మణ్ మల్లేశం శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు



## టీయూడబ్ల్యూజే హెచ్ -143 ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన.

### ఆరోగ్యానికి మించిన సంపద మరొకటి లేదు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్.




**వేములవాడ టౌన్, ( ప్రజాబలం ),** వేములవాడ ప్రెస్ క్లబ్ - మెడి కవర్ ఆస్పత్రి సంయుక్త ఆధ్వర్యంలో వేములవాడ పట్టణంలోని రెండవ బైపాస్ రోడ్ లోని మహాలింగేశ్వర గార్డెన్ లో శుక్రవారం నిర్వహించిన మెగా ఉచిత వైద్య శిబిరం విజయవంతంగా ముగిసింది. సుమారు ఈ వైద్య శిబిరంలో 300 మంది వరకు వివిధ వైద్య పరీక్షలు నిర్వహించినట్లు వైద్య సిబ్బంది, టీయూడబ్ల్యూజే హెచ్ -143 వేములవాడ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు మమ్మద్ రఫీ వెల్లడించారు.

ఈ కార్యక్రమానికి వేములవాడ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, బిఆర్ఎస్ సీనియర్ నాయకులు, మాజీ ఏఎంసీ చైర్మన్ ఏనుగు మనో రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.

శుక్రవారం ఉదయం తొమ్మిది గంటల 30 నిమిషాలు నుండి సాయంత్రం ఐదు గంటల వరకు మహాలింగేశ్వర గార్డెన్లో జరిగిన ఈ శిబిరంలో మెడికవర్ ఆస్పత్రి వైద్యులు డాక్టర్ అనీష్ పబ్బ , ( కార్డియాలజిస్ట్), డాక్టర్ లోకేష్ ( జనరల్ ఫిజీషియన్), డాక్టర్ రాకేష్ ( ఆర్థోపెడిక్ సర్జన్ ), వైద్య సేవలందించారు. ఈ సందర్భంగా బిపి, షుగర్, ఈసీజీ, టుడీకో వంటి పరీక్షలు నిర్వహించారు. ఆరోగ్యపరంగా ఇబ్బందులు ఉన్న వారిని మేడి కవర్ హాస్పిటల్ కరీంనగర్ కు వచ్చి వైద్యం చేయించుకోవాలని డాక్టర్ల బృందం సూచించారు. ఈ సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ టి యు డబ్ల్యు జె హెచ్ -143 ప్రెస్ క్లబ్, మెడికవర్ హాస్పిటల్ సంయుక్తంగా నిర్వహించిన ఉచిత వైద్య శిబిరం పేద, మధ్యతరగతి వారికి లాభం చేకూరేలా పరీక్షలు నిర్వహించడం వారి సేవాభావానికి అభినందనీయమని కొనియాడారు. గ్రామీణ ప్రాంతాల్లో సైతం ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి సేవలందించాలని మెడికవర్ వైద్య సిబ్బంది నిర్వాహకులకు ప్రభుత్వ విప్ సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో రాజీవ్ ఆరోగ్య శ్రీ పరిమితిని 5 లక్షల రూపాయల నుండి 10 లక్షల రూపాయల పెంచి ప్రజా ఆరోగ్య భద్రతపై ప్రభుత్వం ఉన్న చిత్తశుద్ధిని చాటుకున్నాము అని తెలిపారు. వైద్య పరంగా పేదలకు మెరుగైన వసతులు కల్పించడం లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. పేద, మధ్యతరగతి వారు ఆరోగ్యం పట్ల గ్రామీణ ప్రజలు నిర్లక్ష్యం, అజాగ్రత్తగా వ్యవహరిస్తారని, వారికి అవగాహన కల్పించేందుకు ఉచిత వైద్య శిబిరం ఏర్పాటుకు కృషి చేసిన ప్రెస్ క్లబ్ - మెడికవర్ ఆస్పత్రి వారిని అభినందించారు. అనంతరం వేములవాడ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు రఫీ మాట్లాడుతూ నియోజకవర్గ, పట్టణ ప్రజలు పెద్ద ఎత్తున ఈ కార్యక్రమంలో పాల్గొని సద్వినియోగం చేసుకున్నారని తెలిపారు. ప్రైవేట్ ఆస్పత్రిలో అధిక ఖర్చుతో లభించే వైద్య పరీక్షలు ఇక్కడ ఉచితంగా అందించడం ద్వారా పేద, మధ్యతరగతి ప్రజలకు మేలు జరిగిందని మహమ్మద్ రఫీ తెలిపారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ మార్కెటింగ్ హెడ్ శ్రీకాంత్, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు. మెడికవర్ వైద్య సిబ్బంది మరియు వర్కింగ్ ప్రెసిడెంట్ కొలిపాక నరసయ్య, ప్రధాన కార్యదర్శి ఆయాచితుల జితేందర్ రావు, వైస్ ప్రెసిడెంట్ సయ్యద్ అలీ, కోత్వాల్ శ్రీనివాస్, కోశాధికారి కమలాకర్, సంఘ సభ్యులు కోరగంటి విష్ణు, దేవరకొండ ప్రసాద్, పంపరి నాగరాజు, దేవరాజు, వేణు, హరీష్, ప్రవీణ్ కుమార్, సంతోష్, సంటి రాజేందర్, తదితర ప్రెస్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.



## వ్యవసాయ రంగంతో పాటు పాడి పరిశ్రమ అభివృద్ధి పై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది.

### రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్.
### కోనరావుపేట మండలం ఎగ్లాస్ పూర్ గ్రామంలో పాడి గేదెలను పంపిణీ చేసిన విప్.



**రాజన్న సిరిసిల్ల ప్రతినిధి, కోనరావుపేట, ( ప్రజాబలం ),** వ్యవసాయ రంగంతో పాటు పాడి పరిశ్రమ అభివృద్ధి పై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని వేములవాడ ఎమ్మెల్యే రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం రోజున తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న పనుల జాతరలో భాగంగా రాజన్న సిరిసిల్ల జిల్లా షెడ్యూల్ కులాల సహకార సంఘం వారి ఆధ్వర్యంలో కోనరావుపేట మండలం ఎగ్లాస్పూర్ గ్రామంలో లబ్ధిదారులకు పాడి గేదెల పంపిణీ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా హాజరై పార్టీ గేదెలను రైతులకు పంపిణీ చేశారు.

ఈ కార్యక్రమంలో ఎగ్లాస్పూర్ ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ కార్యకర్తలు, గ్రామస్తులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## ఎల్లారెడ్డిపేటలో మార్వాడి హటావో, తెలంగాణ బచావో నిరసన కార్యక్రమం.

### మార్వాడిల వ్యాపారం పై చర్యలు తీసుకోవాలంటూ తాసిల్దార్ కు వినతిపత్రం.




**రాజన్న సిరిసిల్ల ప్రతినిధి, ఎల్లారెడ్డిపేట, ( ప్రజాబలం ),** శుక్రవారం రోజున ఓయూ జేఏసీ పిలుపు మేరకు మార్వాడి హఠావో తెలంగాణ బచావో కార్యక్రమంలో భాగంగా రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో వ్యాపారవేత్తలు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా తాసిల్దార్ కార్యాలయం వద్ద ఫ్లెక్సీలు ప్రదర్శించి కార్యాలయం ముట్టడించారు. అనంతరం తాసిల్దార్ కు వినతి పత్రాన్ని సమర్పించారు.

ఈ సందర్భంగా వ్యాపారవేత్తలు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో మార్వాడీలు వివిధ రంగాలలో వ్యాపారాలు చేపట్టి స్థానిక వ్యాపారులకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బంగారం, వెండి, రాగి, ఇత్తడి, ఇనుము, ఫర్నిచర్, ఎలక్ట్రానిక్ వస్తువులు, బ్యాంగిల్స్ తదితర రంగాల్లో నాణ్యతలేని డూప్లికేట్ వస్తువులు సరఫరా చేస్తూ ప్రజలను మోసం చేస్తున్నారని స్థానిక వ్యాపారస్తులు ఆరోపించారు.

తెలంగాణ ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకొని మార్వాడీల వ్యాపారాలపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, తెలంగాణ వ్యాపారులను కాపాడాలని వారు డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో ఎల్లారెడ్డిపేట మండలంలోని పలువురు వ్యాపారవేత్తలు పాల్గొన్నారు.

## వేములవాడలో ఘనంగా ప్రపంచ జానపద దినోత్సవం.



**వేములవాడ టౌన్, ( ప్రజాబలం), తేదీ:22-08-2025** శుక్రవారం రోజున వేములవాడ అని నృత్య కళానికేతన్ సేవా సంస్థ, జిల్లా సంస్కృతిక సంస్థల సమైక్య తెలంగాణ ఉద్యమకారుల ఫోరం కళాకారుల విభాగం ప్రధాన కార్యాలయం వేములవాడ నందు తెలంగాణ ఉద్యమ కళాకారుల విభాగం రాష్ట్ర కన్వీనర్ ఎల్లా పోశెట్టి ప్రపంచ జానపద దినోత్సవం సందర్భంగా మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమకారుల ఫోరం కళాకారుల విభాగం రాష్ట్ర కమిటీ పక్షాన కళాకారులు, కళాకారునిలకు ప్రజలందరికీ జానపద దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేస్తూ విజ్ఞానంతో పాటు వినోదాన్ని అందిస్తూ సాంస్కృతి సాంప్రదాయాలను ముందు తరాలకు అందజేసే జానపద కళలు వాటిని కాపాడుకోవడం మన అందరి బాధ్యత అని తెలియజేస్తూ కళాకారులందరికి ప్రపంచ జానపద దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఉత్తర తెలంగాణ కళాకారుల విభాగం కోఆర్డినేటర్ బోర్దు రాములు మరియు ఉమ్మడి వరంగల్ జిల్లా కళాకారల విభాగం కన్వీనర్ ఉత్తమ ఉద్యమ నంది అవార్డు గ్రహీత వెన్నమల్ల వెంకటేష్ గారిని ఘనంగా సత్కరించడం జరిగింది.

ఈ కార్యక్రమంలో నక్క వేణు, మారుపాకముండయ్య, మారుపాక బుగులయ్య, తదితర కళాకారులు పాల్గొన్నారు.

## ప్రజా సంక్షేమం కోసం ప్రజా ప్రభుత్వం

### రాష్ట్ర కార్మిక,ఉపాధి శిక్షణ, గనులు భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేకానంద





**ప్రజాబలం మంచిర్యాల జిల్లా ప్రతినిధి ఆగస్టు 22 :** రాష్ట్రంలోని ప్రజల సంక్షేమం కోసం ప్రజా ప్రభుత్వం కొనసాగుతుందని రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ,గనులు భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేకానంద అన్నారు.శుక్రవారం జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తో కలిసి జిల్లాలోని కోటపల్లి మండలం దేవులవాడ గ్రామంలో సి.సి.రోడ్డు, సెంట్రల్ లైటింగ్ సిస్టం,భారీ వర్షాలకు దెబ్బతిన్న పంట పొలాలు పరిశీలించి కొల్లూరు గ్రామంలో పనుల జాతరలో భాగంగా అంగన్వాడీ కేంద్రానికి భూమి పూజ చేశారు. సందర్భంగా రాష్ట్ర మంత్రి మాట్లాడుతూ ప్రజా సంక్షేమం దిశగా ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతుందని తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు కరకట్టలు నుంచి వరదలను నియంత్రించి, బ్యాక్ వాటర్ రాకుండా చర్యలు తీసుకుంటామని,ఇప్పటికే దెబ్బతిన్న పంట పొలాలను గుర్తించి సర్వే చేయాలని,ఒక ఎంక్వయిరీ కమిషన్ ఏర్పాటు చేసి విచారణ జరిపి తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు. గ్రామపంచాయతీల పరిధిలో 20 లక్షల రూపాయల వ్యయంతో పంచాయితీ కార్యాలయాలు, 12 లక్షల రూపాయల వ్యయంతో అంగన్వాడీ కేంద్రాలు నిర్మాణం చేపట్టడం జరుగుతుందని తెలిపారు.చెన్నూర్ మండలం సుందరశాల గ్రామంలో ఇటీవల కురిసిన వర్షాలకు నష్టపోయిన పంట పొలాలను పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.2 కోట్ల రూపాయలు మంజూరు చేసి డిగ్రీ కళాశాల భవన నిర్మాణ పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నామని,200 కోట్ల రూపాయల వ్యయంతో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ ఏర్పాటుకు ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు.విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు నిష్ణాతులైన ఉపాధ్యాయుల నియామకం జరిగిందని తెలిపారు.అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ ఆధ్వర్యంలో అన్ని ప్రభుత్వ పాఠశాలలలో త్రాగునీరు,విద్యుత్,మూత్రశాలలు ఇతర మౌలిక సదుపాయాలు కల్పించి నాణ్యమైన విద్య అందించేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని,నూతన మెనూ ప్రకారం పోషక విలువలు కలిగిన ఆహారాన్ని అందించడం జరుగుతుందని తెలిపారు. విద్యార్థులకు ఆర్.ఓ.ప్లాంట్ల ద్వారా శుద్ధమైన త్రాగునీటిని అందిస్తున్నామని తెలిపారు. కార్పొరేట్ స్థాయిలో ప్రభుత్వ పాఠశాలలలో సౌకర్యాలు కల్పించడం జరుగుతుందని, జిల్లాలో ప్రైవేట్ పాఠశాలల నుండి విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలో చేరుతున్నారని,ఉపాధ్యాయులు పాఠశాలలలో విద్యార్థుల సంఖ్య పెంపొందించాలని తెలిపారు.లంబడిపల్లి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలకు 8 లక్షల 50 వేల రూపాయలతో నిర్మించిన ప్రహరీ గోడను ప్రారంభించడం జరిగిందని,20 లక్షల రూపాయల నిధులతో పంచాయతీ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేయడం జరిగిందని తెలిపారు. గ్రామంలో సోలార్ హైమాస్ లైట్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని,ప్రతి ఇంటికి త్రాగు నీటిని అందించేందుకు మిషన్ భగీరథ పథకం ద్వారా కృషి చేయడం జరుగుతుందని తెలిపారు. పేద ప్రజల అవసరాలను తీర్చేందుకు ప్రభుత్వం కార్యచరణ ప్రకారం చర్యలు తీసుకుంటుందని తెలిపారు.చెన్నూరు నియోజకవర్గంలో పనుల జాతరలో భాగంగా 50 కోట్ల రూపాయలతో అన్ని గ్రామాలను కలుపుతూ సి.సి. రోడ్లు, మురుగు నీటి వ్యవస్థ ఏర్పాటు,గ్రామ పంచాయతీ కార్యాలయాలు,ఉపాధి హామీ పథకం క్రింద అభివృద్ధి పనులు చేపట్టడం జరుగుతుందని తెలిపారు.అర్హత కలిగిన ప్రతి లబ్ధిదారుడికి ఇందిరమ్మ ఇండ్లు కేటాయించి నిర్మాణ దిశగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని,ఈ క్రమంలో భాగంగా జిల్లాలో 25 శాతం పనులు పూర్తి అయ్యాయని, లబ్ధిదారులు నిబంధనల ప్రకారం 600 చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మించుకోవాలని,నిబంధనల ప్రకారం ఇల్లు నిర్మించుకున్న లబ్ధిదారులకు బిల్లుల మంజూరు వేగంగా జరుగుతుందని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్లు రాని అర్హత కలిగిన లబ్ధిదారులు ఆందోళన పడవలసిన అవసరం లేదని, అర్హులైన ప్రతి ఒక్కరికి అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. గృహ జ్యోతి పథకంలో భాగంగా 200 యూనిట్ల ఉచిత విద్యుత్ లబ్ధిదారులకు అందించడం జరుగుతుందని, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అందించడం జరుగుతుందని తెలిపారు. రాజీవ్ ఆరోగ్య శ్రీ పథకం ద్వారా నిరుపేదలకు అందించే వైద్య సేవలను 5 లక్షల రూపాయల నుండి 10 లక్షల రూపాయలకు పెంచడం జరిగిందని తెలిపారు. రేషన్ కార్డు కలిగిన ప్రతి లబ్ధిదారుడికి చౌక ధరల దుకాణాల ద్వారా సన్న బియ్యం అందించడం జరుగుతుందని, ప్రజలంతా సంతోషంగా ఉన్నారని తెలిపారు. దాదాపు 10 సంవత్సరాల పాటు రేషన్ కార్డు లేకుండా ఎంతో మంది నిరుపేదలు ఇబ్బందులు పడ్డారని, ప్రభుత్వం జిల్లాలో అర్హులైన అందరికీ రేషన్ కార్డులు జారీ చేసి వారి సంక్షేమం దిశగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. రైతు సంక్షేమం లో భాగంగా రైతు భరోసా ద్వారా వానాకాలం పంట పెట్టుబడి సహాయాన్ని ముందుగానే రైతుల ఖాతా లలో జమ చేయడం జరిగిందని తెలిపారు. అనంతరం జైపూర్ మండల కేంద్రంలో 3 లక్షల రూపాయల నిధులతో కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్ పనులకు శంకుస్థాపన చేసి,వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో మొక్కలు నాటారు. భీమారం మండల కేంద్రంలో అంగన్వాడీ భవన నిర్మాణానికి 12 లక్షల రూపాయలతో శంకుస్థాపన చేశారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## ప్రయాణికులు సుఖాంతంగా ప్రయాణం చేయాలి

### బైక్ డ్రైవింగ్ లో హెల్మెట్ తప్పనిసరి వాడాలి



**వికారాబాద్ నియోజకవర్గం ప్రతినిధి ఆగస్టు 22 ( ప్రజాబ లం ) వికారాబాద్ జిల్లా:** మర్పల్లి / ట్రాఫిక్ రూల్స్ ప్రకారం ప్రయాణికులు హెల్మెట్ ధరించాలి, హెల్మెట్ ధరించడం వల్ల సుఖాంతంగా ప్రయాణం చేయవచ్చు అని పోలీసు అధికారులుతెలిపారు డ్రైవింగ్ చేసేవారి దగ్గర ఆర్సి లైసెన్స్ కూడా ఉండాలి ట్రాఫిక్ రూల్స్ కి వ్యతిరేకంగా నియమ నిబంధనలు పాటించకుండా డ్రైవింగ్ చేయకూడదు అని తెలిపారు వర్షాకాలం కాబట్టి టూ వీలర్ ఫోర్ వీలర్ డ్రైవింగ్ చేసేవారు జాగ్రత్తగా ప్రయాణం చేయాలని తెలిపారు గుంతలు వాగులు పొంగిపొర్లుతూ ఉంటాయి ప్రయాణం చేసే ముందు జాగ్రత్తలు పాటించాలని తెలిపారు

# చట్టపర విషయాలు తెలియ పరచాలి: అందె లక్ష్మణ్ రావు



**రాజేంద్రనగర్ నియోజకవర్గ ప్రజాబలం ప్రతినిధి 22 ఆగస్టు 2025.** మణికొండ మున్సిపాలిటీ పరిధిలో గత వారం మొత్తంగా మేఘాల విస్ఫోటనం వలన ఉరుములతో కూడిన భారీ వర్షపాతం నమోదు కావడం జగమెరుగిన సత్యం కాగా అందుకు తగ్గట్టు డ్రైనేజ్ నీటి పారుదల సదుపాయం సరిగా లేనందు వలన స్థానికులు నానా ఇబ్బందికర పరిస్థితులు ఎదుర్కోవడం కూడా సర్వ సాధారణ విషయ మయినది. స్థానికంగా ప్రఖ్యాతి గాంచిన శివాలయం ప్రహరీగోడ పటిష్టమైన స్థాయిలో లేక పోవడం వలన అది కాస్తా కూలడం పరిణామంగా 4 ఇండ్లు నేలమట్టం కావడం, అట్టి కుటుంబీకులు కట్టు బట్టలతో బయట పడడం, వారికి ప్రభుత్వ పరంగా ఏమైనా సహాయ సహకారాలు అందావా, లేవా ?ప్రహరీగోడ కూలడంపై ఆలయ నిర్వాహకులు చేపట్టిన చర్యలు ఏమిటో ? సంబంధిత ఎండోమెంట్ అధికారులు తెలుసు కోన్నారా ? నిమ్మకు నీరెత్తిన్నట్టు విధానాన్ని పాటించారా, ఇందు నిమిత్తం ఉన్నత స్థాయి అధికారులు చేపట్టిన చర్యలు ఏమిటో వివరముగా ప్రజలకు తెలుపాలని, ఇట్టి విషయమై ఆలయ నిర్వాహకులకి మున్సిపల్ అధికారులు ఏమైనా నోటీసులు జారీచేశారా ? చిత్రపురి కాలనీ క్రైరోస్ స్కూలు ప్రక్కన గల పెద్ద గోడ కూలడం, అందుకు అధికారుల ప్రతి స్పందన ఏమిటో ? సంబంధిత కమిటీ వారికి మున్సిపల్ అధికారులు ఏమైనా నోటీసులు జారీచేశారా ? ఇకపోతే ఆ ప్రక్కనే ప్రధాన రోడ్డు వారగా ఉన్న పెద్ద గోడ కూడా ఒక వైపుకు ఒరిగి ఉండి పటిష్టముగా లేనందు వలన ఎప్పుడైనా కూలవచ్చని స్థానికులు బయన్దోనలకు గురవుతూ





తెలియ జేసినారు. అందుకు గాను తగిన జాగ్రత్త చర్యలు తీసుకోవాలని లేని ఎడల అనుకోని ప్రమాదం జరగవచ్చునీ స్థానికులు వాపోతూ ప్రజా సంక్షేమ కోరి అధికారులు స్పందించి వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని, తది తర అన్ని విషయాలు సవివరముగా ప్రజలకు తెలియ పరచాలని ది సిటిజన్స్ కౌన్సిల్ ఉపాధ్యక్షుడు అందె లక్ష్మణ్ రావు డిమాండ్ చేస్తూ సంబంధిత విషయాలపై చట్ట పరిధి ప్రకారం వివరాలు సేకరించే నిమిత్తం అర్జీ కూడా దాఖలు చేయడం జరిగినదనీ తెలియ పరిచారు.

# ఈనెల 24 న జోగిపేటకు మందకృష్ణ రాక



**అందోల్ నియోజకవర్గం ప్రతినిధి ఆగస్టు 22 (ప్రజాబలం )సంగారెడ్డి జిల్లా:** అందోల్- జోగిపేట మున్సిపాలిటీ పట్టణంలో ఈనెల 24న నిర్వహిస్తున్న, వృద్ధులు, వికలాంగులు, వితంతువుల, పెన్షన్ల పెంపునకై నిర్వహిస్తున్న సభకు, పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ముఖ్య అతిథిగా హాజరవుతున్నారు, కాంగ్రెస్ ప్రభుత్వం మేనిఫెస్టోలో చెప్పిన విధంగా, పెన్షన్లు పెంచాలని డిమాండ్ తో, వచ్చే నెల 09,వ తారీకు హైదరాబాద్ పరేడ్ గ్రౌండ్ లో నిర్వహించబోయే భారీ బహిరంగ సభకు, ఈనెల 24న జోగిపేటలో సన్నాహ సభ నిర్వహించబోతున్నామని ఈ సభకు, ఆందోల్ నియోజకవర్గం లోని, వృద్ధులు, వితంతువులు, వికలాంగులు, అధిక సంఖ్యలో పాల్గొని సభను విజయవంతం చేయాలని, సమన్వయ కమిటీ సభ్యులు పిలుపునిచ్చారు, ఎన్నికల సందర్భంగా హామీ ఇచ్చిన విధంగా వృద్ధులు, వితంతువులకు,4, వేలు, వికలాంగులకు, 6, వేలు, ఒంటరి మహిళలకు 4, వేలు, కండరాల నరాల క్షీణతతో బాధపడుతున్న వారికి 15, వేల, రూపాయల పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు, లేనిపక్షంలో మాన్యశ్రీ మందకృష్ణ, మాదిగ నాయకత్వంలో ప్రభుత్వం తో పెన్షన్ దారుల తరపున తాడోపేడో తేల్చుకుంటామని అన్నారు, ఈ కార్యక్రమంలో సమన్వయ కమిటీ సభ్యులు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పల్లె సంజీవయ్య, మాజీ జెడ్పిటిసి అర్జునయ్య, జిల్లా ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ మానిటరింగ్ కమిటీ సభ్యులు కాశపాగ ఇమయ్యా, సీనియర్ నాయకులు ఏర్పుల కృష్ణ, సంటినోళ్ల సంజీవయ్య, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు మైసగళ్ల బుచ్చంద్ర, ఎంఎంఎస్ రాష్ట్ర నాయకురాలు పెద్ద గీత, కాకతీయ యూనివర్సిటీ నాయకుడు ఎర్రోళ్ల పోచయ్య, మాజీ కౌన్సిలర్ సంతోష్, చౌటకూర్ మండల ఎంఆర్పిఎస్ అధ్యక్షుడు ఎర్రోళ్ల రమేష్, జిల్లా కార్యదర్శి నల్లోల్ల ప్రవీణ్, తుమ్మల యాదగిరి, విహెచ్ పిఎస్ జిల్లా నాయకులు ప్రశాంత్,అర్జునయ్య, తదితరులు పాల్గొన్నారు....

# మెగాస్టార్ చిరంజీవి70వ పుట్టినరోజు వేడుకలో పాల్గొన్న.... కృష్ణారావు



**కూకట్పల్లి (ప్రజాబలం) ఆగస్టు 22:** పద్మ విభూషణ్ కేంద్ర మాజీ మంత్రివర్యులు మెగాస్టార్ చిరంజీవి గ పుట్టినరోజు సందర్భంగా కెపిహెచ్బి డివిజన్ రమ్య గ్రౌండ్ లోని ఆయన జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కూకట్పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు, కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు ..ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. కష్టాన్ని నమ్ముకుని సంకల్పమే ఆయుధంగా లక్ష్యాన్ని చేరుకోవడం చిరంజీవిని చూసే నేర్చుకోవాలని. ఆయన సినిమాల ద్వారా వినోదాన్ని, విజ్ఞానాన్ని పంచడమే కాకుండా సమాజానికి తన వంతుగా నేత్రదానం, రక్తదానం వంటి చారిటబుల్ ట్రస్ట్ లు ఏర్పాటు చేసి ఎంతోమందినీ ఆదుకుని నేటి యువతకు మార్గదర్శకులుగా చిరంజీవి కొనియాడారు. ఈ కార్యక్రమానికి సీనియర్ నాయకులు మందలపు సాయిబాబా చౌదరి ,శ్యామల రాజు ,పాతూరి గోపి ,రాజేష్ రాయ్, భగవాన్,వలవల నాయుడు,మహిళా నాయకులు భవాని, చిరంజీవి అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# గుంతల మయంగా రోడ్లు గుర్తించని అధికారులు

## పట్టించుకోని ప్రజా ప్రతినిధులు అధికారులు

## ఉమ్మడి పుల్కల్ మండలంలో పలుచోట్ల ఇదే పరిస్థితి

## ప్రయాణానికి తప్పని పాట్లు



**అందోల్ నియోజకవర్గం ప్రతినిధి ఆగస్టు 22 (ప్రజాబలం) సంగారెడ్డి జిల్లా :** ఉమ్మడి పుల్కల్ మండలంలోని రహదారులు, ప్రయాణికులకు ప్రాణ సంకటంగా మారాయి, ఈ రహదారులు వెంబడి ప్రయాణించాలంటే జంకుతున్న జనం, (బిఆర్ఎస్,) ప్రభుత్వం హయాంలో నియోజకవర్గంలోని పలు మండలాల గ్రామాలలో రోడ్ల పరిస్థితి అధ్వానంగా మారింది, ఈ ప్రజా ప్రభుత్వం వచ్చిన తర్వాత, ఆగమేఘాల మీద మంత్రి దామోదర్ రాజనర్సింహ,రహదారులకు నిధులు కేటాయించి పనులు ప్రారంభించారు, అయితే కొన్ని మండలాల్లో రహదారులకు కంకర వేసి వదిలివేయడంతో గడిచిన ఏడు ఎనిమిది నెలలుగా ఆ రహదారులు వెంబడి ద్విచక్ర వాహనదారులు, ఈ కంకర రోడ్లమీద ప్రయాణికులు వాహన చోదకులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని ప్రయాణించారు, ఇప్పుడు కురుస్తున్న భారీ వర్షాలకు, ఆ రహదారులన్నీ గుంతలు ఏర్పడి, ఆ గుంతలలో వర్షపు నీరుతో నిండి బురదమయమై రోడ్డు ఏదో గుంతలేవో తెలియక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు, ఆందోల్ నియోజకవర్గం చౌటకుర్,మండల కేంద్రం నుండి, పోసన్పల్లి, బొమ్మరెడ్డి గూడెం, లక్ష్మీసాగర్ కు వెళ్లే రహదారి గుంతల మయంగా బురదలో కూరుకుపోవడంతో, ప్రజలు ప్రయాణికులు నిత్యం నరకయాతన పడుతున్నారు, రోడ్లకు మరమ్మతులు చేయాలని పలుమార్లు, అధికారులకు ప్రజాప్రతినిధులకు పలుమార్లు వినతి చేసినా పట్టించుకోవడంలేదని, ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు, పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు, విద్యా బోధన చేసే ఉపాధ్యాయులు, ఇతర ఉద్యోగులు తమ విధులు నిర్వహించేందుకు, ఈ రోడ్లపై ప ప్రయాణించడం ఈ రోడ్డు ప్రాణ సంకటంగా మారిందని, ఆవేదన చెందుతున్నారు, ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి, రోడ్లకు మరవత్తు పనులు చేపట్టాలని, ఆయా గ్రామాల ప్రజలు అధికారులను కోరుతున్నారు....

# ఇల్లంతకుంటలో గణేష్ మంటప నిర్వాహకులతో పోలీసుల అవగాహన సదస్సు.



**రాజన్న సిరిసిల్ల ప్రతినిధి, ఇల్లంతకుంట, ( ప్రజాబలం),** రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ మహేష్ బి గీతే ఆదేశాలతో ఇల్లంతకుంట మండల కేంద్రంలో రానున్న వినాయక చవితి పండుగను శాంతియుతంగా జరుపుకునేందుకు పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో సిరిసిల్ల రూరల్ సీఐ మొగిలి, ఎస్సై అశోక్ ఆధ్వర్యంలో గణేష్ మంటప నిర్వాకులతో అవగాహన సదస్సు నిర్వహించారు.

ఈ సందర్భంగా సిఐ మొగిలి మాట్లాడుతూ పండుగ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, డీజే లు, శబ్ద కాలుష్యం వంటి నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు. అలాగే మతసామరస్యంతో ప్రతి ఒక్కరు పండుగను జరుపుకోవాలని నిర్వాహకులకు సూచనలు అందించారు.




పోలీసుల ఈ అవగాహన సదస్సులో మండల గణేష్ మంటపనిర్వాకులు పెద్ద ఎత్తున పాల్గొని పండుగను శాంతియుత వాతావరణంలో నిర్వహించేందుకు హామీ ఇచ్చారు.

# రాజన్న ఆలయంలో భక్తజన సంద్రం.

## శ్రావణమాసం చివరి శుక్రవారం కావడంతో పెరిగిన భక్తుల రద్దీ.



**వేములవాడ టౌన్, ( ప్రజాబలం ),** దక్షిణ కాశీగా ప్రసిద్ధి పొందిన వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానంలో శ్రావణమాసం చివరి శుక్రవారం కావడంతో తెలంగాణ రాష్ట్రం నుండే కాకుండా, ఇతర రాష్ట్రాల నుండి భక్తజనం గురువారం సాయంత్రం వరకే రాజన్న ఆలయానికి చేరుకున్నారు. శుక్రవారం వేకువజామునుండే భక్తులు తలనీలాలు సమర్పించి, పవిత్ర ధర్మగుండంలో కుటుంబ సమేతంగా పుణ్యస్నానాలు ఆచరించి, క్యూలైన్ల ద్వారా వెళ్లి స్వామివారిని దర్శించుకుని, వివిధ రకాల మొక్కలు చెల్లించుకొని, స్వామివారికి ప్రీతికరమైన కోడె మొక్కులు చెల్లించుకున్నారు. ధర్మగుండం, కళ్యాణ కట్ట, లడ్డు ప్రసాద కౌంటర్ల వద్ద భక్తజనం కిక్కిరిసిపోయినారు. ఆలయ పరిసర ప్రాంతాలు భక్తులతో సందడిగా మారినాయి. భక్తులకు దైవదర్శనానికి సుమారుగా రెండు గంటల సమయం పట్టింది. భక్తులకు ఎలాంటి అసౌకార్యాలు కలకుండా ఆలయ అధికారులు తగిన ఏర్పాట్లు చేసినరు.



# మైదుకూరులో మెగాస్టార్ చిరంజీవి జన్మదిన వేడుకలు

మైదుకూరులో పద్మ విభూషణ్ మెగాస్టార్ డాక్టర్ కొణిదల చిరంజీవి 70వ జన్మదిన సందర్భంగా మైదుకూరుశ్రీ కృష్ణదేవర రాయల కూడాలి లో జన్మదిన వేడుకలు అట్టహాసంగా చేశారు. మైదుకూరు నియోజకవర్గం చిరంజీవి యువత అధ్యక్షులు గోశెట్టి రామ గోవిందు ఆధ్వర్యంలో కేక్ కటింగ్ కార్యక్రమం నిర్వహించారు. జనసేన సీనియర్ నాయకులు గోశెట్టి చిలుంగారి కృష్ణమూర్తి, దండు, శ్రావణ్ మేకల విశ్వేశ్వరయ్య, ఇతర మెగా అభిమానుల పర్యవేక్షణలో పార్టీలకతీతంగా విచ్చేసిన పుర ప్రముఖులు సమక్షంలో కార్యక్రమం జరిగింది. రాబోయే జన్మదినం గల మెగాస్టార్ చిరంజీవి భారతరత్న రావాలని మెగా అభిమానులు కోరుకుంటున్నారన్నారం

# చేవెళ్లలో బీజేపీ ఛీఫ్ రామచంద్రరావు పర్యటన

చేవెళ్ల ఖానాపూర్ గ్రామంలో బిజెపి రాష్ట్ర అధ్యక్షులు శ్రీ ఎన్ రాంచందర్ రావు శుక్రవారం పర్యటించారు. ఉదయం పత్తి పొలంలో రైతులతో ముఖముఖిగా మాట్లాడుతూ పొలంలో విత్తనాలు, యూరియా ఎటువంటి మందులు వాడుతున్నారు, ఎకరానికి ఎకరానికి ఎంత ఖర్చు వస్తుంది, ఎంత లాభం వస్తుంది తెలుసుకున్నారు.



**ఆదిలాబాద్ ప్రజాబలం ప్రతినిధి:**ఇటీవల కురిసిన భారీ వర్షాలకు వ్యాధులు ప్రబలకుండా తలమడుగు మండలం ఉండం గ్రామం లో ముందస్తు చర్యల్లో భాగంగా గ్రామాల్లో నిర్వహిస్తున్న మెడికల్ క్యాంప్ ను శుక్రవారం జిల్లా కలెక్టర్ రాజర్షి షా ఆకస్మికంగా సందర్శించి , రిజిష్టర్ లో నమోదైన కేసులు, నిర్వహించిన పరీక్షల వివరాలను, ఫీవర్ సర్వే పై ఆరా తీస్తున్నారు దృశ్యం



**ఆదిలాబాద్ ప్రజాబలం ప్రతినిధి**తలమడుగు మండలం బ్రిడ్జి ప్రాంతం లో వరద ఉధృతి కి నష్టం వాటిల్లిన పంటలను శుక్రవారం పరిశీలించి నష్టం వాటిల్లిన ఎకరాల వివరాలను అడిగి తెలుసుకుంటున్న జిల్లా కలెక్టర్ రాజర్షి షా



**ఆదిలాబాద్ ప్రజాబలం ప్రతినిది** తలమడుగు మండలం లోని ప్రాధమిక వ్యవసాయ సహకార సంఘం కేంద్రాన్ని, గోదాము లో ఉన్న యూరియా స్టాక్ ను శుక్రవారం జిల్లా కలెక్టర్ రాజర్షి షా పరిశీలిస్తున్న దృశ్యం.

# రైతులకు ఉపయోగకరమైన పనులు చేపట్టాలి జిల్లా కలెక్టర్



**నిర్మల్ ప్రజాబలం ప్రతినిధి:**జాతీయ ఉపాధి హామీ పథకం (ఈజీఎస్) కింద రైతులకు, కూలీలకు ఉపయోగకరమైన పనులను చేపట్టాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు.

శుక్రవారం నిర్మల్ గ్రామీణ మండలం డ్యాంగాపూర్‌లో నిర్వహించిన పనుల జాతర కార్యక్రమంలో భాగంగా ఈజీఎస్ నిధులతో నిర్మించిన పశువుల పాకను లబ్ధిదారులతో కలిసి కలెక్టర్ ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ, జాతీయ ఉపాధి హామీ పనుల్లో రైతులకు ఉపయోగపడే గొర్రెలు, పశువుల పాకలు, పౌల్ట్రీ, పొలంబాటలు వంటి పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ప్రతి గ్రామపంచాయతీ స్థాయిలో ప్రజలకు ఉపాధి హామీ పనులపై అవగాహన కల్పించాలని ఆదేశించారు.



జిల్లాలో 100% అక్షరాస్యత సాధించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని తెలిపారు. ప్రతి ఒక్కరికి చదవడం, రాయడం వచ్చేటట్లు ప్రత్యేక శిక్షణ ఇవ్వడం జరుగుతుందని పేర్కొన్నారు. విద్యాశాఖ ఆధ్వర్యంలో వాలంటీర్లను నియమించి అక్షరాస్యతను పెంపొందించేందుకు చర్యలు కొనసాగుతున్నాయని వెల్లడించారు. అనంతరం 100 రోజుల ఈజీఎస్ పనులు పూర్తిచేసిన కూలీలను ఈ సందర్భంగా కలెక్టర్ సన్మానించారు.

ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, ఆర్డీఓ రత్న కళ్యాణి, ఎంపీడీవో గజానన్, అధికారులు, ఉపాధి హామీ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

# కేజీబీవీల్లో నాణ్యమైన విద్య బోధనకు చర్యలు. జిల్లా కలెక్టర్



**నిర్మల్ ప్రజాబలం ప్రతినిధి:** నిర్మల్ గ్రామీణ మండలం అనంతపెట్ లోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టోర్‌రూమ్, వంటగది, డైనింగ్‌హాల్‌ను పరిశీలించిన కలెక్టర్ విద్యార్థులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో విద్యుత్, తాగునీరు, బాత్రూం వంటి సదుపాయాలు సక్రమంగా వినియోగంలో ఉన్నాయా అనే అంశాన్ని స్వయంగా పరిశీలించారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని వసతులు కల్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం కలెక్టర్, అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. ప్రభుత్వ కేజీబీవీల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మౌలిక వసతులు అందించేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ప్రతి విద్యార్థి కష్టపడి చదివి ఉన్నత స్థానంలో నిలవాలని సూచించారు. సమస్యలేవైనా వాటిని అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. విద్యార్థులకు విద్యతో పాటు క్రీడల్లో నైపుణ్యం పెంపొందించేలా పాఠశాల ప్రాంగణంలో బ్యాడ్మింటన్, వాలీబాల్, బాస్కెట్‌బాల్ మైదానాల కోసం ల్యాండ్ లెవెలింగ్ పనులు చేపట్టాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.



ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ డీఈఓ పరమేశ్వర్, ఎంఈఓ వెంకటేశ్వర్లు, తాహసిల్దార్ సంతోష్, ఎంపీడీవో గజానన్, కేజీబీవీ ప్రత్యేక అధికారి శ్రీలత, అధికారులు, ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కాళేశ్వరం కమిషన్ నివేదికపై మధ్యంతర ఉత్తర్వులు లేవు హైకోర్టు

హైదరాబాద్ కేసీఆర్, హరీష్లకు తెలంగాణ హైకోర్టు షాక్ ఇచ్చింది. జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నివేదిక రద్దు చేయాలని దాఖలు చేసిన పిటిషన్పై మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వడం అవసరం లేదని స్పష్టం చేసింది. దీనిపై కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. తదుపరి విచారణను నాలుగు వారాలకు వాయిదా వేసింది

# శ్మశాన వాటికలో సౌకర్యాలు కల్పించాలని వినతి




**ప్రజాబలం చెన్నూరు నియోజకవర్గ రిపోర్టర్ ఆగస్ట్ 22** :మందమర్రి పట్టణంలోని సింగరేణి హై స్కూల్ వెనకాల గల ఈద్గా దగ్గరలో ముస్లిం మైనార్టీలకు చెందిన స్మశాన వాటిక (కబరేస్తాన్) లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా అథవాలే పార్టీ నాయకులు మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ తుంగపిండి రాజలింగు కు కలిసి వినతి పత్రాన్ని అందించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ శ్మశాన వాటికలో సోలార్ లైట్లు పనిచేయడం లేదని మరణించిన వారిని రాత్రి వేళల్లో పూడ్చి పెట్టాలంటే వెలుతురు లేక చాలా ఇబ్బందులు పడుతున్నారన్నారు. ముస్లిం మైనార్టీ ప్రజల సమస్యలను దృష్టిలో పెట్టుకొని తక్షణమే వాటి స్థానంలో కొత్త సోలార్ లైట్లు ఏర్పాటు చేయాలని కోరారు. ఈకార్యక్రమంలో రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (ఏ) పార్టీ ముస్లిం మైనార్టీ జిల్లా అధ్యక్షులు ఎండి రహమత్ ఖాన్, మంచిర్యాల జిల్లా ఇన్చార్జి పులిపాక శ్రీనివాస్, జిల్లా అధ్యక్షులు గుడికందుల తిరుపతి, జిల్లా ఉపాధ్యక్షులు ధర్మపురి శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి మామిడిపెల్లి ప్రకాష్, నాయకులు దర్శనాల వెంకటస్వామి, కన్నూరి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# తలమడుగు మండలం లో వరద ప్రాంతాలను విస్తృతంగా పర్యటించిన జిల్లా కలెక్టర్ రాజర్షి షా



**ఆదిలాబాద్ ప్రజాబలం ప్రతినిది** శుక్రవారం అదిలాబాద్ జిల్లా తలమడుగు మండలం లోని ఉండం గ్రామం లో మెడికల్ క్యాంప్, కొత్తూరు వరద ముంపు ప్రదేశం లో పంట నష్ట పరిశీలన, తలమడుగు ఫ్యాక్స్ కేంద్రం, గోదాములో ఉన్న యూరియా స్టాక్ వివరాలు, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనుల పరిశీలన, డొ ర్లి గ్రామం లోని శిధిలావస్థలో ఉన్న మండల పరిషత్ ప్రాధమిక పాఠశాల ను సందర్శించారు .

జిల్లాలోని వరద ప్రభావిత ప్రాంతాలను శుక్రవారం జిల్లా కలెక్టర్ రాజర్షి షా విస్తృతంగా పర్యటించారు. తలమడుగు మండలం యొక్క వివిధ గ్రామాలలో ఏర్పడిన పరిస్థితులను ఆయన స్వయంగా పరిశీలించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ ముందుగా ఉండం గ్రామంలో ఏర్పాటు చేసిన మెడికల్ క్యాంప్ ను సందర్శించి అక్కడి వైద్య సేవల పై అధికారులతో చర్చించారు. అనంతరం కొత్తూరు గ్రామం లో వరద ముంపు ప్రాంతాల్లో పంట నష్టాన్ని పరిశీలించి రైతులతో మాట్లాడారు.

అలాగే, తలమడుగు ఫ్యాక్స్ కేంద్రం, గోదాములో ఉన్న యూరియా నిల్వలపై సమీక్ష నిర్వహించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను పరిశీలించి, పనుల పురోగతిపై సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు.

తరువాత, డొర్లి గ్రామంలోని శిధిలావస్థలో ఉన్న మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను సందర్శించి పర్రుషికించారు

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇటీవలే కురిసిన వర్షాలకు జిల్లాలో పంటలు రహదారులు, వంతెనలు దెబ్బతిన్నాయని ఈ క్రమంలో తలమడుగు మండలం లో పంటలు, లోలైన్ ఏరియాలు, రహదారులు దెబ్బతిన్న వివరాలను సంబధిత అధికారులు సర్వే నిర్వహిస్తున్నారని, ప్రత్యామ్నాయ, శాశ్వత పరిష్కార సర్వే నిర్వహించి నివేదికలను ప్రభుత్వానికి సమర్పించడం జరుగుతుందని అన్నారు.

వర్షాల అనంతరం వ్యాధులు ప్రభలే అవకాశం ఉన్నందున గ్రామాల్లో మెడికల్ క్యాంప్ లు ఏర్పాటు చేయడం జరిగిందని, ఈ క్యాంపులను గ్రామ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, క్యాంపులు నిర్వహించే చోట కు వెళ్లి పరీక్షకు చేసుకోవాలనీ అన్నారు.

అలాగే గ్రామ ప్రజలు ఇంటిని, ఇంటి ఆవరణ ను శుభ్రంగా ఉంచుకోవాలని, నీరు నిలువకుండ చూడాలని, దోమలు, ఈగలు వాలకుండా పరిశుభ్రంగా ఇంటిని ఉంచుకొని ఆరోగ్యాన్ని సంరక్షించుకోవాలనీ హితవు పలికారు.

ఈ పర్యటనలో కలెక్టర్ వెంట తహశీల్దార్ రాజ్ మోహన్, DAO శ్రీధర్ స్వామి, సంబంధిత శాఖల అధికారులు, తదితరులు ఉన్నారు.

## యువతకు ఆదర్శప్రాయుడుగా చిరంజీవి... బండి రమేష్



**కూకట్పల్లి (ప్రజబలం) ఆగస్టు 22** :మెగాస్టార్ చిరంజీవి పుట్టినరోజు వేడుకలను కెపిహెచ్బి కాలనీ రమ్య గ్రౌండ్ లో ఆయన అభిమానులు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా టిపిసిసి ఉపాధ్యక్షుడు కూకట్పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి బండి రమేష్ హాజరయ్యారు.చిరంజీవికి శుభాకాంక్షలు అభిమానులకు అభినందనలు తెలియజేశారు.ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ స్వయంకృషితో తనదైన నటనతో సినీ రంగంలో పద్మ విభూషణ్ స్థాయికి ఎదిగిన నిత్య కృషివరుడు చిరంజీవి అని కొనియాడారు. ప్రజారాజ్యం పార్టీ ఆవిర్భావంలోనూ తనకు శేరిలింగంపల్లి ఎమ్మెల్యేగా పోటీ చేసేందుకు అవకాశం ఇచ్చిన ప్రోత్సహించిన చిరంజీవి యువత లోని టాలెంట్ ని గుర్తించి వారికి అవకాశాలను కల్పించడంలోనూ చిరంజీవి ఎంతో ముందుంటారన్నారు. తన ట్రస్టు ద్వారా రక్తదానం నేత్రదానం చేయడం ద్వారా ఎంతోమందికి ప్రాణదానం కంటి చూపును కల్పించడం తో సమాజానికి తన వంతు సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్న చిరంజీవి యువతకు ఆదర్శప్రాయుడనీ రమేష్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బచ్చు రాజు,గాలి బాలాజీ, లక్ష్మయ్య, పట్లోళ్ల నాగిరెడ్డి , గొట్టిముక్కల వెంకటేశ్వరరావు,కొప్పిశెట్టి దినేష్ ,గంధం రాజు,నరసింహారావు, ఫణి కుమార్,బచ్చు మల్శీ, పి ఆర్ నాయుడు,శివ చౌదరి, కామినేని వాసు ,శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ నుండే కదా మీ నాయన వచ్చింది.. మీ నాన్న కూడా థర్డ్ క్లాసే నా..?

## కేటీఆర్ కి పొలిటికల్ మెచ్యూరిటీ లేదు

## జగ్గారెడ్డి



నాంపల్లి గాంధీభవన్ ప్రజాబలం ప్రతినిధి: ఉప రాష్ట్రపతి అభ్యర్థిగా మాజీ జస్టిస్ సుదర్శన్ రెడ్డి నీ ఇండియా కూటమి ప్రకటించింది
. కేటీఆర్.. చిల్లర పార్టీ అని అంటున్నాడు
. కేటీఆర్ కి చెప్పదలుచుకున్న
. తెలంగాణ రాష్ట్రం ఇచ్చిన కాంగ్రెస్ నీకు ఇప్పుడు చిల్లర పార్టీ అయ్యిందా..?
. రాష్ట్రం ఇచ్చిన తర్వాత తెలంగాణ ఇచ్చాక..సోనియా గాంధీ ఇంటికి వెళ్లి కలిశారు కదా...అప్పుడు చిల్లర అనిపించలేదా..?
. అప్పుడు అనిపించనిది ..ఇప్పుడు ఎందుకు అనిపిస్తుంది
. మీ కుటుంబం వెలిగిపోతుంది అంటే దానికి కారణం కాంగ్రెస్ కాదా..?
కాంగ్రెస్ పై మాట్లాడిన కేటీఆర్ క్యారెక్టర్ లెనోడు
సోనియా గాంధీ వల్లనే తెలంగాణ వచ్చింది అని కేసీఆర్ సభలో చెప్పాడు.. ఆ మాట నువ్వు మర్చిపోయావా..?
కాంగ్రెస్ థర్డ్ క్లాస్ పార్టీ ఐతే.. మీ నాన్న ఆ పార్టీ నుండే కదా పాఠాలు నేర్చుకుంది
కాంగ్రెస్ థర్డ్ క్లాస్ ఐతే..మీ నాన్న కూడా థర్డ్ క్లాసే కదా..?
థర్డ్ క్లాస్ నుండే కదా..నువ్వు రాజకీయ నాయకుడివి అయ్యింది
వందకోట్ల ప్రజలకు స్వతంత్రం తెచ్చిన కాంగ్రెస్ పార్టీని థర్డ్ క్లాస్ అనడానికి మనసు ఎట్లా వచ్చింది
కేటీఆర్.. కాంగ్రెస్ అంటే ఏందో కేసీఆర్ నీ అడిగి తెలుసుకో
సోనియా గాంధీ తెలంగాణ ఇవ్వకపోతే .. మీ కుటుంబం వేల కోట్లు సంపాదించే అవకాశం రాకుండే
అమెరికా లో జీతం మీదనే బతికే వాడివి నువ్వు
నీ కుటుంబం ఏం చేసి బతుకుతుండే నో మరి
సుదర్శన్ రెడ్డి నీ ఉప రాష్ట్రపతి అభ్యర్థి గా పెడితే.. తెలంగాణ బిడ్డగా ఆయనకు ఓటేయాల్సింది పోయి
ఉల్టా కాంగ్రెస్ మీదనే ఆరోపణలు
. కేటీఆర్.. కేసీఆర్ వి అవకాశవాద రాజకీయాలకు పరాకాష్ట
కేటీఆర్.. పదేళ్లు మంత్రిగా ఉన్న రాజకీయ మెచ్యూరిటీ రాలేదు
అందుకే మాటకు దొర్లుతున్నాడు
కేటీఆర్..బాధ్యతారాహిత్యంగా మాట్లాడుతున్నాడు
కేటీఆర్..తాత..నానమ్మ బతికి ఉంటే..కేటీఆర్ ను పిలిచి తిట్టే వాడు..చెంప మీద కొట్టేవాళ్ళు
త్యాగాలకు కేటీఆర్ కి విలువ తెలియదు.
వీళ్ళంతా డ్రామా ఆర్టిస్టులు
కేసీఆర్ 11 రోజులు దీక్ష చేయగలడా.?
తిని దీక్ష చేసినా.. యాక్సెప్ట్ చేసే వాళ్ళు..అప్పుడు పరిస్థితి అది
కేసీఆర్ దీక్ష అంత కాంగ్రెస్ డిజైన్
మా వాళ్ళ బాధ మా వాళ్ళది..
జానారెడ్డి ముందుండి చేశారు
తెలంగాణ వచ్చి ప్రజలకు బెనిఫిట్ ఏమైందో తెలియదు
కానీ కేసీఆర్ కుటుంబానికి మాత్రం బెనిఫిట్ అయ్యింది
. కేటీఆర్ కి రాజకీయ మెచ్యూరిటీ లేదు
కేటీఆర్ తొందర పడి మాట్లాడి కిషన్ రెడ్డి కి అవకాశం ఇచ్చినట్టు అయ్యింది
సచివాలయం లో నేను చేసిన రివ్యూ చేశా.. దానిపై BRS ఆరోపణలు చేస్తుంది
నేను ప్రతిపక్షం లో ఉన్నా.. అధికారంలో ఉన్నా మొగొన్నే
సచివాలయం లో దందా చేస్తే తప్పు కానీ.. ప్రజల కోసం సమీక్ష చేస్తే తప్పా
మళ్ళీ చేస్తా..
మీ లెక్క కొడుకు..అల్లుడు.. బిడ్డ లు పంచుకున్నట్టు పంచుకున్నానా..?
నిధులు తీసుకోవాలి కదా..
గెలుపు ఓటమి కాదు.. నేను కూడా రాజకీయ నాయకున్నే కదా..?
కిషన్ రెడ్డి మంచోడు.. సౌమ్యుడు
ప్రాబ్లం ఏంటంటే.. ఆయన కూడా స్క్రిప్ట్ లీడర్
ప్రచారక్ రాసి ఇచ్చింది చదువుతారు
పొలిటికల్ స్పీచ్ లు ఇవ్వలేడు
. యూరియా మీరు ఇవ్వకుండా .. మాట్లాడితే ఏం లాభం
.కాంగ్రెస్ నీ బదనం చేయాలని ఎరువులను అడ్డం పెట్టుకుని బీజేపీ డ్రామా ఆడుతుంది
కేంద్రమే ఇవ్వాలి యూరియా.. వేల కోట్లు రైతులకు ఇచ్చే రేవంత్ రెడ్డి కి.. ఎరువులు ఇవ్వడానికి ప్రభుత్వానికి ఏదైనా ఇబ్బంది ఉంటద..?
రైతుల ముసుగులో బీజేపీ..%ఎతీం% కార్యకర్తలు వస్తారు
. పోలీసులు లాఠీలకు పని చెప్పకండి
. రైతులకు విషయాన్ని చెప్పండి
రాజకీయ పార్టీలు కుట్రలు చేస్తాయి
రైతులు జాగ్రత్తగా ఉండాలి
బీజేపీ brs కుట్రలు ..కుతంత్రాలు ఎక్కువ.. జాగ్రత్తగా ఉండండి

# "బాలానగర్ కిరణ వర్తక సంఘం" ఆధ్వర్యంలో "మార్వారీ గో-బ్యాక్" నిరసన..




కూకట్పల్లి (ప్రజాబలం) ఆగస్టు 22: బాలానగర్ స్థానిక వ్యాపార వర్గాలలో పెరుగుతున్న ఉద్రిక్తతలను ఎత్తిచూపుతూ, ఆర్య వైశ్య సమాజానికి చెందిన బాలానగర్ విభాగం శుక్రవారం మార్వారీ గో-బ్యాక్ నినాదని ప్రతిధ్వనిస్తూ నిరసనను నిర్వహించింది. స్థానిక ఆర్య వైశ్య సంఘం అధ్యక్షుడు సిద్ధిరాములు నిర్వహించిన ఈ ర్యాలీలో, సభ్యులందరూ తమ వ్యాపారాలను మూసివేసి ఐక్యత, మద్దతును ప్రదర్శించారు. సమాచారం అందుకున్న బాలానగర్ పోలీసులు త్వరితగతిన శాంతిభద్రతలను కాపాడటానికి ఎ. శంకర్, గోగికర్ బాల్‌రాజ్, బి. శేఖర్, టి. జయకుమార్, పి. బాలకృష్ణ, ఆర్. వెంకటేష్, డి. శివ రామ్ ప్రసాద్ వంటి అనేక మంది ఆర్య వైశ్య సంఘం సభ్యులను ముందస్తు చర్యలో భాగంగా అరెస్టు చేశారు. స్థానిక వ్యాపార వాణిజ్య కార్యకలాపాలలో మార్వారీ వ్యాపారుల ఆధిపత్యానికి ప్రతిస్పందనగా ఈ ప్రదర్శన నిర్వహించినట్లు ఆర్య వైశ్య సంఘం బాలానగర్ ప్రతినిధి యెర్రామ్ చంద్రశేఖర్ పేర్కొన్నారు. స్థానిక వ్యాపారాలను రక్షించే విధంగా తెలంగాణేతర నివాసితులు రాష్ట్రంలో భూమిని సేకరించకుండా నిరోధించే చట్టాన్ని తీసుకురావాలని బాలానగర్ కిరణ వర్తక సంఘం డిమాండ్ చేస్తోందని ఆయన అన్నారు. అంతేకాకుండా, గుజరాతీ, రాజస్థానీ వ్యాపారుల నుండి వస్తువులను బహిష్కరించాలని తెలంగాణ నివాసితులను వారి నుండి సహాయాన్ని నిలిపివేయాలని ఆ ఆర్య వైశ్య సంఘం పిలుపునిచ్చింది. ఇది ప్రతి మార్వారీని తిరిగి వెళ్లిపోమని అనడం కాదు అని చంద్రశేఖర్ స్పష్టం చేశారు. చిన్న వ్యాపారుల ఖర్చుతో మా వనరులను దోపిడీ చేయడాన్ని మాత్రమే మేము వ్యతిరేకిస్తున్నామని అయన స్పష్టం చేశారు. 5 లక్షల కంటే తక్కువ జనాభా ఉన్న పట్టణాలు, ప్రదేశాలలో బయటి వ్యక్తులు వ్యాపారాలు ప్రారంభించకుండా ప్రభుత్వం నిర్ధారించాలి వారు డిమాండ్ చేశారు.

## ఘనంగా మెగాస్టార్ చిరంజీవి 70 వ జన్మదిన వేడుకలు





ప్రజాబలం చెన్నూరు నియోజకవర్గ రిపోర్టర్ ఆగస్ట్ 22: ప్రముఖ సినీ నటుడు పద్మభూషణ్ మెగాస్టార్ చిరంజీవి 70వ జన్మదిన వేడుకలను మెగా ఫ్యామిలీ ఫాన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా శుక్రవారం పట్టణంలోని సింగరేణి హై స్కూల్ ఆవరణలో గల మనో వికాస్ స్కూల్ లో బర్త్ డే కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు సీట్లు, పండ్లను పంపిణీ చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ తెలుగు సినిమా పరిశ్రమలో తనకంటూ ప్రత్యేక గుర్తింపును తెచ్చుకున్న మెగాస్టార్ చిరంజీవి అందరికి ఆదర్శమన్నారు. సినీ నటుడుగా, రాజకీయ నాయకుడిగా, ప్రజా సేవకుడిగా రాణించి ఎందరికో స్ఫూర్తినిచ్చారన్నారు. ఈకార్యక్రమంలో మెగా ఫ్యామిలీ ఫ్యాన్స్ చిరంజీవి అభిమానులు కలువల శ్రీనివాస్, ముద్దం సంతోష్, కూకట్ల తిరుపతి యాదవ్, కలువల అశోక్, వంకుడ శివ నాయక్, బండి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సంక్షేమం కోసం ప్రజా ప్రభుత్వం కొనసాగుతుంది

# రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, గనులు భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేకానంద







ప్రజాబలం చెన్నూరు నియోజకవర్గ రిపోర్టర్ ఆగస్టు 22 రాష్ట్రంలోని ప్రజల సంక్షేమం కోసం ప్రజా ప్రభుత్వం కొనసాగుతుందని రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, గనులు భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేకానంద అన్నారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తో కలిసి జిల్లాలోని కోటపల్లి మండలం దేవులవాడ గ్రామంలో సి. సి. రోడ్డు, సెంట్రల్ లైటింగ్ సిస్టం, భారీ వర్షాలకు దెబ్బతిన్న పంట పొలాలు పరిశీలించి కొల్లూరు గ్రామంలో పనుల జాతరలో భాగంగా అంగన్వాడీ కేంద్రానికి భూమి పూజ చేశారు. సందర్భంగా రాష్ట్ర మంత్రి మాట్లాడుతూ ప్రజా సంక్షేమం దిశగా ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతుందని తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు కరకట్టలు నుంచి వరదలను నియంత్రించి, బ్యాక్ వాటర్ రాకుండా చర్యలు తీసుకుంటామని, ఇప్పటికే దెబ్బతిన్న పంట పొలాలను గుర్తించి సర్వే చేయాలని, ఒక ఎంక్వయిరీ కమిషన్ ఏర్పాటు చేసి విచారణ జరిపి తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు. గ్రామపంచాయతీల పరిధిలో 20 లక్షల రూపాయల వ్యయంతో పంచాయితీ కార్యాలయాలు, 12 లక్షల రూపాయల వ్యయంతో అంగన్వాడీ కేంద్రాలు నిర్మాణం చేపట్టడం జరుగుతుందని తెలిపారు. చెన్నూర్ మండలం సుందరశాల గ్రామంలో ఇటీవల కురిసిన వర్షాలకు నష్టపోయిన పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. 2 కోట్ల రూపాయలు మంజూరు చేసి డిగ్రీ కళాశాల భవన నిర్మాణ పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నామని, 200 కోట్ల రూపాయల వ్యయంతో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ ఏర్పాటుకు ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు నిష్ణాతులైన ఉపాధ్యాయుల నియామకం జరిగిందని తెలిపారు. అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ ఆధ్వర్యంలో అన్ని ప్రభుత్వ పాఠశాలలలో త్రాగునీరు, విద్యుత్, మూత్రశాలలు ఇతర మౌలిక సదుపాయాలు కల్పించి నాణ్యమైన విద్య అందించిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని, నూతన మెనూ ప్రకారం పోషక విలువలు కలిగిన ఆహారాన్ని అందించడం జరుగుతుందని తెలిపారు. విద్యార్థులకు ఆర్. ఓ. ప్లాంట్ల ద్వారా శుద్ధమైన త్రాగునీటిని అందిస్తున్నామని తెలిపారు. కార్పొరేట్ స్థాయిలో ప్రభుత్వ పాఠశాలలలో సౌకర్యాలు కల్పించడం జరుగుతుందని, జిల్లాలో ప్రైవేట్ పాఠశాలల నుండి విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలో చేరుతున్నారని, ఉపాధ్యాయులు పాఠశాలలలో విద్యార్థుల సంఖ్య పెంపొందించాలని తెలిపారు. లంబడిపల్లి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలకు 8 లక్షల 50 వేల రూపాయలతో నిర్మించిన ప్రహరీ గోడను ప్రారంభించడం జరిగిందని, 20 లక్షల రూపాయల నిధులతో పంచాయతీ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేయడం జరిగిందని తెలిపారు. గ్రామంలో సోలార్ హైమాస్ లైట్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని, ప్రతి ఇంటికి త్రాగు నీటిని అందించేందుకు మిషన్ భగీరథ పథకం ద్వారా కృషి చేయడం జరుగుతుందని తెలిపారు. పేద ప్రజల అవసరాలను తీర్చేందుకు ప్రభుత్వం కార్యచరణ ప్రకారం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. చెన్నూరు నియోజకవర్గంలో పనుల జాతరలో భాగంగా 50 కోట్ల రూపాయలతో అన్ని గ్రామాలను కలుపుతూ సి.సి. రోడ్లు, మురుగు నీటి వ్యవస్థ ఏర్పాటు, గ్రామ పంచాయతీ కార్యాలయాలు, ఉపాధి హామీ పథకం క్రింద అభివృద్ధి పనులు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. అర్హత కలిగిన ప్రతి లబ్ధిదారుడికి ఇందిరమ్మ ఇండ్లు కేటాయించి నిర్మాణ దిశగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని, ఈ క్రమంలో భాగంగా జిల్లాలో 25 శాతం పనులు పూర్తి అయ్యాయని, లబ్ధిదారులు నిబంధనల ప్రకారం 600 చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మించుకోవాలని, నిబంధనల ప్రకారం ఇల్లు నిర్మించుకున్న లబ్ధిదారులకు బిల్లుల మంజూరు వేగంగా జరుగుతుందని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్లు రాని అర్హత కలిగిన లబ్ధిదారులు ఆందోళన పడవలసిన అవసరం లేదని, అర్హులైన ప్రతి ఒక్కరికి అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. గృహ జ్యోతి పథకంలో భాగంగా 200 యూనిట్ల ఉచిత విద్యుత్ లబ్ధిదారులకు అందించడం జరుగుతుందని, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అందించడం జరుగుతుందని తెలిపారు. రాజీవ్ ఆరోగ్య శ్రీ పథకం ద్వారా నిరుపేదలకు అందించే వైద్య సేవలను 5 లక్షల రూపాయల నుండి 10 లక్షల రూపాయలకు పెంచడం పెంచడం జరిగిందని తెలిపారు. రేషన్ కార్డు కలిగిన ప్రతి లబ్ధిదారుడికి చౌక ధరల దుకాణాల ద్వారా సన్న బియ్యం అందించడం జరిగిందని, ప్రజలంతా సంతోషంగా ఉన్నారని తెలిపారు. దాదాపు 10 సంవత్సరాల పాటు రేషన్ కార్డు లేకుండా ఎంతో మంది నిరుపేదలు ఇబ్బందులు పడ్డారని, ప్రభుత్వం జిల్లాలో అర్హులైన అందరికీ రేషన్ కార్డులు జారీ చేసి వారి సంక్షేమం దిశగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. రైతు సంక్షేమంలో భాగంగా రైతు భరోసా ద్వారా వానాకాలం పంట పెట్టుబడి సహాయాన్ని ముందుగానే రైతుల ఖాతాలలో జమ చేయడం జరిగిందని తెలిపారు. అనంతరం జైపూర్ మండల కేంద్రంలో 3 లక్షల రూపాయల నిధులతో కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్ పనులకు శంకుస్థాపన చేసి, వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అవరణలో మొక్కలు నాటారు. భీమారం మండల కేంద్రంలో అంగన్వాడీ భవన నిర్మాణానికి 12 లక్షల రూపాయలతో శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

Edited ,Printed Published & Owned by A.SRAVANTHI ,Printed at: SRAVANTHI ENTER PRISES 1-9-18/A,Ramnagar,Hyderabad - 500020, T.S
and Published at 5-2-518,Osmangunj ,Risala Abdulla,Hyderabad -95 Editor; A.SRAVANTHI, RNI NO ; TELTEL/2005/16755 Cell ; 92921 04449
Email;prajaabalamnews@gmail.com